తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 21.02.2026 | సంపుటి : 12 సంచిక : 213 | పేజీలు : 12 వెల : రూ. 4/-



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ

### బంగ్లాదేశ్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలలుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ

మిగతా 2లో..



## మీ వివాదంలోకి మమ్మల్ని లాగొద్దు

- ఇరాన్‌పై దాడులకు మా దేశంలోని స్థావరాలను వాడొద్దు
- అమెరికాకు తేల్చిచెప్పిన యూకే

**లండన్(జనంసాక్షి):** అణు ఒప్పందంపై చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతో ఇరాన్‌పై దాడులకు అమెరికాసిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడులకు

మిగతా 2లో..



# ఏఐకి ప్రత్యేక మంత్రిత్వశాఖ అవసరం

> ఏఐ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. గ్రీన్ ఎనర్జీ, డేటా స్టోరేజ్, అప్లికేషన్స్‌లో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. కేంద్ర రాష్ట్రాల్లో ఏఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు వార్‌రూంను ఏర్పాటు చేయాలి. ఆ రంగంలో మరింత వృద్ధిని సాధించేందుకు వార్‌రూం ఉపయోగపడుతుంది. హైదరాబాద్‌లో ఏఐ వార్‌రూం ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఏఐ రంగంలో అగ్రగామిగా ఉండేందుకు జీపీయూ, చిప్స్‌ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలి. జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి
> - రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

## హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం

- భారత్‌ను ప్రపంచ ఏఐ పవర్‌హౌస్‌గా నిర్మించాలి
- తెలంగాణలో ఏఐ స్టార్టప్ విలేజీ ఏర్పాటుకు సిద్ధం
- సాంకేతిక విప్లవంలో ఇదో అంకం
- మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి.. అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం, మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం చెప్పారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఏఐ అభివృద్ధి ప్రతి దశలో ? సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్లు ? భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ

మిగతా 2లో..

## బెంగాల్ 'సర్' విధుల్లో




# సుప్రీం అసాధారణ నిర్ణయం

### ప్రక్రియలో జ్యూడీషియల్ అధికారులను నియమించండి

### ఆ రాష్ట్ర హైకోర్టును ఆదేశించిన సుప్రీం ధర్మాసనం

- ఈసీ, బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం దురదృష్టకరం
- ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రహసనంగా మారిందని వ్యాఖ్య





**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటర్ రోల్ క్లీన్-అప్ డ్రైవ్ విషయంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మధ్య పరస్పర నిందారోపణలు చోటుచేసుకోవడం, ఎస్ఐఆర్ పక్రియపై సంక్లిష్ట పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు శుక్రవారం సంచలన నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాల సవరణపై దురదృష్టకరమైన విమర్శల ఆట కొనసాగుతోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాల సవరణ పక్రియను పర్యవేక్షించేందుకు న్యాయాధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో అభ్యంతరాలు, వివాదాలను జ్యుడిషియల్ ఆఫీసర్లు పరిష్కరిస్తారని పేర్కొంది. రాజ్యాంగ బద్ధ వ్యవస్థలైన రాష్ట్రం, ఎన్నికల కమిషన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. దీంతో ఎస్ఐఆర్ పక్రియ అభ్యంతరాలు, వివాదాల మధ్య చిక్కుకుంది' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కోసం పనిచేస్తున్న జిల్లా జడ్జి హోదాలో ఉన్న మాజీ న్యాయాధికారులను కూడా ఈ పక్రియ కోసం నియమించాలని, అసాధారణ పరిస్థితుల కారణంగా అసాధారణ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. న్యాయాధికారుల నియామకం, బాధ్యతలకు సంబంధించి సమగ్ర ప్లాన్ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో శనివారం నాడు సమావేశం కావాలని ఎన్నికల కమిషనర్, చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్, ఇతర ఉన్నతాధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడిషియల్ ఆఫీసర్లు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు వేసింది. 'రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆశించాం. అయితే కమ్యూనికేషన్ విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా? ఫిబ్రవరి 9వ తేదీ ఆదేశాలకు


మిగతా 2లో..

## ప్రపంచదేశాల ముందు పరువుపోయింది

### ఏఐ సమ్మిట్‌లో నవ్వులపాలైన యూపీ గల్గోటియాస్ యూనివర్సిటీ

### చైనా రోబో మాదేనంటు తప్పుడు క్లైమ్

### సదస్సు నుంచి యూనివర్సిటీ గెంటివేత




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహిస్తోంది. దానికి అంతర్జాతీయస్థాయి నేతలు, ప్రతినిధులు, టెక్ సంస్థల సీఈఓలు హాజరవుతున్నారు. ఇలాంటి సమయంలో ఉత్తంప్రదేశ్‌లోని యూనివర్సిటీ నిర్వాకం తీవ్ర విమర్శలకు దారితీసింది. చైనా రోబోడాగ్ వివాదాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది జాతీయ మీడియా కథనాల ప్రకారం..గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ దిల్లీలో జరుగుతోన్న ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రోబోడాగ్‌ను అభివృద్ధి చేశామంటూ విద్యాసంస్థ ప్రతినిధులు దానిని ప్రదర్శించారు. దాని పనితీరును మీడియాకు వివరించారు. ఆ వీడియోలు నెట్టింట్లో వైరల్

మిగతా 2లో..

# ఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు

> స్మగ్లర్ల ఆగడాలు అరికట్టేందుకు ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది : మంత్రి జూపల్లి

**హైదరాబాద్(జనంసాక్షి):** స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో

మిగతా 2లో..




## ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ

- ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో సాగుకు రూ.456 కోట్లు కేటాయింపు
- పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి
- కామారెడ్డి జిల్లాలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి తుమ్మల

వార్త 2 లో

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

# ఏప్రిల్ నుంచి అమల్లోకి

### పీయూష్ గోయల్





**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఇది ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అలాగే యూకే, ఒమన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా అదే నెల నుంచి అమల్లోకి రావొచ్చని మంత్రి చెప్పారు. న్యూజిలాండ్‌తో కుదిరిన డీల్ అమల్లోకి రావడానికి మాత్రం సెప్టెంబర్ వరకు సమయం పట్టొచ్చని తెలిపారు. మార్చిలో యూఎస్‌తో ఖరారైన మధ్యంతర ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఇప్పటికే గోయల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా త్వరలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగొచ్చని దిల్లీలో జరుగుతోన్న ఏఐ సదస్సులో భాగంగా వెల్లడించారు. అలాగే యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో రానున్న కొన్ని నెలల్లో భారత్‌లో పర్యటిస్తారని చెప్పారు. ఇదిలాఉంటే.. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు ఇరుదేశాల ప్రతినిధులు మూడు రోజుల పాటు సమావేశం కానున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ఈ సమావేశం జరగనుంది.

### ఫ్లోరిడా ఎయిర్‌పోర్టుకు ట్రంప్ పేరు!


9 లో..

## టోల్ ప్లాజాల వద్ద ఇక డిజిటల్ చెల్లింపులే..

**ఢిల్లీ(జనంసాక్షి):** జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద ఫీజు చెల్లింపులకు పూర్తిగా డిజిటల్ లావాదేవీలను మాత్రమే అనుమతించే అంశాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పరిశీలిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి నగదు లావాదేవీలను పూర్తి నిలిపివేయాలనుకుంటోంది. ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే టోల్‌ఫీజు వసూలు చేయాలని అనుకుంటోంది. జాతీయ రహదారుల టోల్ ఎకోసిస్టమ్‌ను పూర్తిగా డిజిటల్‌గా మార్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ ఓ ప్రకటనలో పేర్కొంది. టోల్ చెల్లింపుల్లో చాలా వరకు ఫాస్టాగ్ ద్వారానే జరుగుతున్నాయి. దాదాపు 98 శాతం పేమెంట్లు ఈ రూపంలోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఫాస్టాగ్ లేకపోవడం, పని చేయకపోవడం వంటి కారణాలతో టోల్‌ప్లాజా వద్దకు వచ్చే వాహనాల నుంచి రెండింతల ఫీజు వసూలు చేస్తున్నారు. యూపీఐ ఆప్షన్

మిగతా 2లో..





## గ్రహాంతర వాసుల సమాచారం బహిర్గతం చేస్తా

### అందుకు సంబంధించిన ఫైళ్లను గుర్తించి విడుదల చేయండి

### ఫెడరల్ ఏజెన్సీలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్గదర్శకాలు

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర వాసుల సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఏలియన్ల సమాచారం ఉన్న ప్రభుత్వ ఫైళ్లను గుర్తించి, విడుదల చేయాలని ఈ మేరకు ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో గ్రహాంతర వాసుల సమాచారం గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ సమాఖ్య సంస్థలకు తాజాగా ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది అమెరికన్లు తమ ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర జీవుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ అన్నారు. అందుకే వాటికి సంబంధించిన ముఖ్యమైన.. ఆసక్తికరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఒబామా గ్రహాంతర వాసుల ఉనికి గురించి మాట్లాడుతూ ఓ రహస్య విషయాన్ని వెల్లడించారని ట్రంప్ మండిపడ్డారు. ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. అయితే ఒబామా చెప్పిన రహస్యం ఏంటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

మిగతా 2లో..

### ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం

- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- సుప్రీంకోర్టు తీర్పు అవమానకరం: ట్రంప్

2 లో..


## దేవాదులపై అంత నిర్లక్ష్యం ఎందుకు?

- ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు నడవట్లేదు
- హామీల అమలు మేరకు బడ్జెట్ కేటాయింపులు జరగాలి
- ఎన్నికల ముందు రాసిచ్చిన బాండ్ పేపర్ల సంగతేంది: హరీశ్



**హనుమకొండ,సిద్ధిపేట(జనంసాక్షి):** దేవాదుల ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు నడవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌస్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. వరంగల్ జిల్లాలో దేవాదుల పరిధి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేవాదుల పనులు నత్తనడకన నడిచాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల నీటి కేటాయింపులను 60 టీఎంసీలకు పెంచినట్లు చెప్పారు." దేవాదుల ఆయకట్టును 47 వేల ఎకరాల నుంచి 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మోటార్లను ఈ ప్రభుత్వం

మిగతా 2లో..




## తప్పిన పెనుముప్పు

- మైత్రీవనం కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం
- సకాలంలో ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ప్రమాదం
- ఎల్బీనగర్ చట్నీస్‌లో పేలుడు.. ముగ్గురు సిబ్బందికి గాయాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కాంప్లెక్స్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో పలువురు విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. నిచ్చెన సాయంతో 60 మందిని కిందికి దించారు. నీలగిరి బ్లాక్‌లోని షాపులను మూసివేయించారు. కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులను పంపించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. మూడు అంతస్తుల వరకు మంటలు వ్యాపించినట్లు పోలీసులు తెలిపారు. పై అంతస్తులోని కొన్ని ఐటీ సంస్థల్లో ఉన్న కోచింగ్

మిగతా 2లో..

# ప్రపంచదేశాల ముందు పరువుపోయింది

అయ్యాయి. అలాంటి రోబోడాగ్‌నే చైనా రోబోటిక్ కంపెనీ యూనిట్రీ అభివృద్ధి చేసింది. యూనిట్రీ పేరిట విక్రయిస్తోంది. భారత్‌లోనూ ఆ విక్రయాలకు అనుమతి ఉంది. రూ.2లక్షలు నుంచి రూ.3లక్షలు పెట్టి ఆన్‌లైన్‌లో ఆ డాగ్‌ను కొనుక్కోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన నెటిజన్లు యూనివర్సిటీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విదేశీ సాంకేతికతను భారత్ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై విమర్శలు చేశారు.దీనిపై యూనివర్సిటీ వివరణ ఇచ్చుకుంది. దానిని చైనా సంస్థ నుంచే కొనుగోలు చేశామని, విద్యార్థులు నేర్చుకోవడానికి ఒక సాధనంగా వాడుతున్నామని చెప్పింది. దానిని తామే అభివృద్ధి చేశామని ఎన్నడూ చెప్పలేదని పేర్కొంది. భారత్‌లో అలాంటి ఉత్పత్తిని తీసుకొచ్చేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని చెప్పింది. కానీ నెట్టింట్లో చక్కర్లు కొడుతోన్న వీడియోల్లో విద్యాసంస్థ ప్రతినిధులు దానిని తామే అభివృద్ధి చేసినట్లు చెప్పుకోవడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. సదస్సులో నుంచి గల్గోటియాస్‌కు ఉద్వాసన పలికింది. దానికి కేటాయించిన స్టాల్‌ను అధికారులు ఖాళీ చేయించారు.అయితే రోబోడాగ్ వరకే ఈ వివాదం పరిమితం కాలేదు. దక్షిణకొరియా అభివృద్ధి చేసిన సాకర్ డ్రోన్‌ను తమవద్దే అభివృద్ధి చేశామని విద్యాసంస్థ ప్రతినిధులు చెప్పినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యాఖ్యలు కూడా తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. సాకర్ డ్రోన్ రిమోట్ కంట్రోల్‌తో నడుస్తుంది. డ్రోన్ చుట్టూ గుండ్రటి ఆకృతి పంజరం మాదిరిగా ఉంటుంది. కాగా.. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. సరైన ప్లానింగ్ లేకుండా ప్రచారం చేసుకుంటున్నారంటూ కేంద్రాన్ని ఉద్దేశించి విమర్శలు చేశారు.

## తప్పిన పెనుముప్పు

తీసుకుంటున్న విద్యార్థులు మెట్ల మార్గం ద్వారా బయటకు వచ్చారు. మరికొందరిని అగ్నిమాపక సిబ్బంది బాల్కనీ ద్వారా, మెట్ల ద్వారా సురక్షితంగా కిందకు చేర్చారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కొందరు కిందకు దూకేందుకు ప్రయత్నించగా వారిని అగ్నిమాపక సిబ్బంది కాపాడింది.

**ఎల్బీనగర్ చట్నీస్‌లో పేలుడు**

ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో పేలుడు సంభవించింది. భారీ శబ్దానికి వినియోగదారులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇడ్లీ స్టీమర్‌లో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధిక వేడిమి కారణంగానే స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు పేలుడు సంభవించిన కిచెన్‌ను పరిశీలించాయి. ఇడ్లీ స్టీమర్ వేడెక్కడంతోనే పేలుడు సంభవించిందా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ

బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ క్రమంలో భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. కొద్దికాలం క్రితం భారత వ్యతిరేక యువనేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యకు గురికావడం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హదీ హత్యానంతరం హిందూ మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. గత డిసెంబర్ నుంచి భారత్-బంగ్లా మధ్య వీసా సర్వీసులు నిలిచిపోయాయి. అయితే యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తప్పుకోవడం, ప్రజాస్వామ్యబద్ధంగా తారిఖ్ రెహ్మాన్ ఎన్నికకావడంతో భారత్-బంగ్లా మధ్య సంబంధాల పునరుద్ధరణకు సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి.

## ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం

- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- సుప్రీంకోర్టు తీర్పు అవమానకరమైన: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పలు దేశాలపై ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆయన తన అధికారాలను అతిక్రమించి సుంకాలు విధించారని పేర్కొంది. టారిఫ్‌ల విషయంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ సారథ్యంలోని ధర్మాసనం 6-3 మెజార్టీతో తీర్పు వెలువరించింది.అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఏకపక్షంగా ప్రతీకార సుంకాలు సహా ఈ టారిఫ్‌లు విధించారని సుప్రీం కోర్టు పేర్కొంది. సుంకాలు సహా పన్నులు విధించే అధికారం పార్లమెంటుకే ఉందని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. పన్నులు విధించే అధికారం ఏ కార్యనిర్వాహక విభాగానికీ అప్పగించలేదని చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. సుంకాలను కీలకమైన ఆర్థిక, విదేశాంగ విధానంగా ట్రంప్ ఉపయోగించుకున్నారని వ్యాఖ్యానించారు.

స్పందించిన ట్రంప్..

పలు రాష్ట్రాల గవర్నర్లతో ట్రంప్ సమావేశమైన సమయంలోనే ఈ తీర్పు వచ్చినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు అవమానకరమైనదిగా ట్రంప్ అభివర్ణించినట్లు తెలుస్తోంది. ఈ తీర్పు సమయంలో దాదాపు 20 రాష్ట్రాల గవర్నర్లతో ఆయన భేటీ అయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

సానుకూలంగా స్టాక్ మార్కెట్లు

సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు అక్కడి స్టాక్ మార్కెట్లలో జోష్ నింపింది. తీర్పు వెలువడిన కొన్ని నిమిషాల్లోనే సూచీలు పాజిటివ్‌గా స్పందిస్తున్నాయి.

## సునీత యాత్ర మిషన్ ప్రాణాంతక వైఫల్యమే

**నాసా సంచలన నివేదిక**

**న్యూయార్క్(జనంసాక్షి):**భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ వారం రోజుల అంతరిక్ష యాత్ర కాస్తా.. అనివార్య కారణాల వల్ల నెలల పాటు గడిచింది. యావత్ ప్రపంచం ఉత్కంఠగా చూసిన ఆ రోదసి యాత్రపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఆ మిషన్ 'ప్రాణాంతక వైఫల్యమేనని' అంగీకరించింది. దానిని 'టైప్-ఏ' ప్రమాదంగా అభివర్ణించింది.వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్‌మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా 311 పేజీల నివేదిక విడుదల చేసింది. ఈ సందర్భంగా నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్మ్యాన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్‌మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారని వెల్లడించారు. "2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్ట్‌ను ఉత్పత్తి చేసే స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు పనిచేయడం ఆగిపోయాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అయితే, అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు" అని ఈ నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన ప్రొటోకాల్స్‌ను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూల్‌కు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు.

# ఏఐకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం



పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం?రాష్ట్రాల సమన్వయంతో జాతీయ "ఏఐ వార్ రూమ్" ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు.ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని అన్నారు. అయితే సరైన రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ- ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చా రు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే "ఏఐ స్టార్టప్ విలేజ్"ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు.ఏఐ అభివృద్ధి సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని ఆయన స్పష్టం చేశారు.

## బెంగాల్ 'సర్' విధుల్లో సుప్రీం అసాధారణ నిర్ణయం

ఫిబ్రవరి 17న స్పందించారు. 8,500 ఆఫీసర్లను పంపామంటారు. మేము మైక్రో అబ్జర్వర్లం కాదు. ఈ వ్యవహారం మాకు తీవ్ర అంసతృప్తిని కలిగిస్తోంది. రాష్ట్రాలు సహకరిస్తాయని మేము భావిస్తాం. మాకు ప్రైవేటు వివరణలు అవసరం లేదని సీజేఐ అన్నారు. ఎస్ఐఆర్‌పై జరుపుతున్న పోరాటాన్ని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇటీవల ఢిల్లీకి తీసుకువెళ్లారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులతో సమావేశానంతరం బహిరంగంగానే ఆమె హెచ్చరికలు చేశారు. ఎన్నికల కమిషన్ ముందు లక్షలాది మంది బాధితులను పెరేడ్ చేయిస్తామన్నారు. మమతా బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఈసీ మండిపడింది. ఎన్నికల అధికారులు ఎంతో సంయమనంతో గౌరవంతో ఆమెతో మాట్లాడినట్టు తెలిపింది. అయితే బెంగాల్ ఓటర్ల జాబితా క్లీనప్ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి మినహాయించారని మమతా బెనర్జీ ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన అస్సాంలో ఎందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికల సంఘం బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని తప్పుపట్టారు.

## మీ వివాదంలోకి మమ్మల్ని లాగొద్దు

తమ దేశంలోని రెండు కీలక స్థావరాలను వాడొద్దని యూకే అగ్రరాజ్యానికి తేల్చి చెప్పింది. దీంతో స్విండన్ సమీపంలోని ఫెయిర్ ఫోర్డ్ బేస్ నుంచి లాంగ్‌రేంజ్ బాంబింగ్ ఆపరేషన్లు నిర్వహించడానికి అగ్రరాజ్యానికి అవకాశం లేకుండా పోయింది. మరోవైపు ఇప్పటికే డియాగో గార్సియా బేస్‌ను మారిషస్‌కు తిరిగి అప్పజెప్పాలన్న యూకే నిర్ణయంపై ట్రంప్ అసం

## గ్రహాంతర వాసుల సమాచారం బహిర్గతం చేస్తా

**ఒబామా ఏమన్నారంటే..?**

గతవారం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఒబామా ఏదోఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను అమెరికాలోని నెవాడలో ఉన్న అత్యంత రహస్య ప్రాంతం 'ఏరియా 51'లో యూఎస్ ప్రభుత్వం నిర్బం ధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని పేర్కొన్నారు. గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధ్య క్షుడిగా ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు. తనకు తెలిసినంతవరకు ఏరియా 51లో ఎటువంటి భూగర్భ కేంద్రాలు లేవని.. ఒకవేళ ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియవని అన్నారు.

## టోల్ ప్లాజాల వద్ద ఇక డిజిటల్ చెల్లింపులే..

ఎంచుకుంటే 1.25 రెట్లు ఫీజు మాత్రమే తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టోల్‌ప్లాజాల వద్ద పూర్తిగా డిజిటల్ రూపంలో చెల్లింపులకు మాత్రమే అనుమతివ్వాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తోంది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదాచేయడం, రుసుముల వసూళ్లలో పారదర్శకత కోసం ఎన్‌హెచ్ఏఐ ఈ నిర్ణయం తీసుకుంది.

## దేవాదులపై అంత నిర్లక్ష్యం ఎందుకు?

నడపలేకపోతోంది. నిర్వహణ ఖర్చులు రూ.8 కోట్లు లేక మోటార్లు నడపట్లేదు. గండిరామారంతోపాటు ఇతర లిఫ్టులు బంద్ చేశారు. దేవన్నపేట పంప్‌హౌస్‌లో 3 మోటార్లు నడవట్లేదు. మరమ్మతులకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.7,300 కోట్ల మేర దేవాదుల ప్రాజెక్టుపై ఖర్చు పెట్టాం. 80శాతానికిపైగా పనులు పూర్తి చేశాం. 47వేల ఎకరాల ఆయకట్టును.. 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. ఈ ప్రాజెక్టు కోసం 33 వేల ఎకరాలు అవసరం ఉంటే.. 30వేల ఎకరాల భూ సేకరణ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయింది. ఒకట్రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి..మిగతా 3 వేల ఎకరాల భూ సేకరణ చేస్తే.. అదనంగా 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు పెరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం కనీసం రూ.200 కోట్లు అయినా ఖర్చు చేశారా? దేవాదుల ప్రాజెక్టుపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు?" అని హరీశ్‌రావు నిలదీశారు.

**హామీల అమలు మేరకు బడ్జెట్ కేటాయింపులు జరగాలి**

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను తయారు చేయాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా, రాహుల్ రాసిచ్చిన బాండ్ పేపర్లు ఏమాయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 800 రోజులైనా ఒక్క హామీకి దిక్కులేదని, గెలిచిన నెలకే వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 4000 పెన్షన్ అన్నారు. 27 నెలలైనా రాలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిధులు పెడతారా, లేదా? అంటూ ప్రశ్నించారు. నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు. ఒక్కరికైనా రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. వెంటనే బ్జడెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఎగ్గొట్టారని, రాజీవ్ యువ వికాసం అంతా బూటకమని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లన్నీ ఉత్త మాటలే. అసెంబ్లీలో మాయ మాటలు మాని, వాస్తవ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకిచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10వేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 25 వేలు, డిగ్రీకి రూ. 50వేలు, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి, ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20 వేలు కోట్ల బ్జడెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపిందని విమర్శించారు . వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ అని చెప్పి మాయమాటలు చెప్పారని, ఏటా రూ. 15వేలు రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందని పేర్కొన్నారు. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు చేయగా కాంగ్రెస్ రూ. 4వేలు ఇస్తామని హామీ ఇప్పటి వరకు నెరవేర లేదని అన్నారు. బడ్జెట్‌లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత , చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4వేలు పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని, రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా బ్జడెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డికి అస్వస్థత

**హుటాహుటిన హైదరాబాద్ నిమ్స్‌కు తరలింపు**

**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, జీవన్ రెడ్డి ఇటీవల కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్, జీవన్ రెడ్డి మధ్య వర్గపోరు కొనసాగుతోంది.ఒక దశలో పార్టీని కూడా వీడుతానని జీవన్ రెడ్డి అలకబూనడంతో అధిష్ఠానం బుజ్జగింపులతో వెనక్కి తగ్గారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సైతం తన వర్గం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్నాడు. సీనియర్ అయిన తనను సరిగా గౌరవం ఇవ్వడం లేదని అసృంతృప్తికి లోనవుతున్నాడు. జీవన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ట్రంప్ నిర్ణయాలపై ఇండో అమెరికన్లలో తీవ్ర అసంతృప్తి

**ఆయన తీరును వ్యతిరేకిస్తున్న 55 శాతం మంది**

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై ఇండో-అమెరికన్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ట్రంప్ తీసుకుంటున్న చర్యలు మింగుడు పడడం లేదు. ఇప్పటికే అమెరికాలో ఆ దేశస్తులు రోడ్డెకకి నిరసనలు తెలిపారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను నిర్వహిస్తున్న తీరును 55 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. కార్నెగి ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ విడుదల చేసిన '2026 ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్ సర్వే'లో ఈ విషయం వెల్లడైంది.యూగవ్ భాగస్వామ్యంతో నవంబర్ 25, 2025 నుంచి జనవరి 6, 2026 మధ్యలో ఈ సర్వే జరిగింది. ఇందులో వెయ్యి మంది ఇండియన్ అమెరికన్లు పాల్గొన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో ట్రంప్ విధానాలను 55 శాతం మంది వ్యతిరేకించారు. వాణిజ్యం, వ్యూహాత్మక సహకారంలో నెలకొన్న విభేదాలు క్వాడ్ కూటమని, ఇండో-పసిఫిక్ లక్ష్యాలను దెబ్బతీశాయని వారు పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ రైతాంగానికి మహర్దశ




- ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో సాగుకు రూ.456 కోట్లు కేటాయింపు
- పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి
- కామారెడ్డి జిల్లాలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి తుమ్మల

కామారెడ్డి(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుతో రైతాంగానికి మహర్దశ పట్టనుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత ౘ జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పాల్వంచమర్రి గ్రామంలో ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖతో పాటు హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతు సింగిరెడ్డి బలరాం యొక్క ఆరున్నర ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ పంట రైతుల కుటుంబాలను ఆర్థికంగా బలపరుస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 2.88 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉన్నదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు 32,923 మంది రైతులు 1,05,455 ఎకరాల్లో ఈ పంట సాగును చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రూ.456 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా, సిద్దిపేట జిల్లా నర్మేటలో నిర్మాణం పూర్తయిన ఫ్యాక్టరీ త్వరలో అందుబాటులోకి రానుందని మంత్రి చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పంట నాలుగు సంవత్సరాల్లో దిగుబడిని ఇవ్వడం ప్రారంభించి 30 నుంచి 40 సంవత్సరాల పాటు ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా అంతరపంటల ద్వారా కూడా అధిక లాభాలను పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనుకునే రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, డ్రిప్ సౌకర్యాలను ప్రభుత్వం రాయితీ మీద అందిస్తుందని, రైతుకు ఎకరాకు రూ.51,000 సబ్సిడీ రూపంలో అందచేయడం జరుగుతున్నదని, అందుబాటులో ఉన్న ఈ అవకాశాలను వినియోగించుకుని రైతులు పెద్దఎత్తున ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని మంత్రి సూచించారు. కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ పంట ద్వారా ఎకరానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని, మార్కెట్ సమస్యలు లేకుండా సాగు చేయగల పంట ఇదేనని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల మాదిరిగా కామారెడ్డి జిల్లా కూడా ఆయిల్ పామ్ సాగులో ముందంజలో నిలవాలని సూచించారు.హిందుస్థాన్ యూనిలీవర్ ప్రతినిధి వరుణ్ మెహత మాట్లాడుతూ కంపెనీ తరపున సాగు, మార్కెటింగ్‌కు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. డ్రిప్ సౌకర్యానికి అదనంగా కంపెనీ ద్వారా రూ.5,000 ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మదన్ మోహన్, ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్, సర్పంచ్ శేకర్ తదితరులు పాల్గొన్నారు. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ప్రతినిధులు విల్లెం యూజెన్, యోగేష్ మిశ్రా, విపుల్ పాటిల్, వరుణ్ మెహత, సుందర్ మహాజన్, రతీష్ మాత్యు, విజయ రంగస్వామి కూడా హాజరయ్యారు.

## ఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు

ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి పాల్గొన్నారు.

## అమెరికా వ్యూహాత్మక కూటమిలోకి భారత్.. 'ప్యాక్స్ సిలికా'లో చేరిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికా నేతృత్వంలో ఏర్పాటైన అంతర్జాతీయ వ్యూహాత్మక కూటమి 'ప్యాక్స్ సిలికా'లో భారత్ చేరింది. ఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ సమిట్ వేదికగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ కూటమిలో చేరుతూ భారత్ సంతకం చేసింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా రాయబారి సెర్గియో గోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సంతకంతో కీలక ఖనిజాల ఉత్పత్తి, కృత్రిమ మేధ వంటి రంగాల్లో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. "ప్రపంచం భారత్‌ను విశ్వసిస్తోంది. మన దగ్గర నిపుణుల కొరత లేదు. ఇప్పుడు ప్యాక్స్ సిలికాలో చేరడం వ్యూహాత్మక ముందడుగు. సెమీకండక్టర్ల సరఫరా గొలుసు, చిప్




తయారీ వంటి రంగాలకు ఇది చాలా కీలకం. ఈ కూటమిలో చేరడంతో భారత ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ పరిశ్రమకు లబ్ధి చేకూరనుంది" అని వెల్లడించారు.అనంతరం సెర్గియో గోర్ మాట్లాడుతూ.. "రెండు దేశాల మధ్య విస్తృత అవకాశాలకు కొదవలేదు. పాక్స్ సిలికాలో భారత్ చేరడం కీలక పరిణామం" అని తెలిపారు. అంతేగాక, త్వరలోనే భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖాముఖి భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

**ఏంటీ ప్యాక్స్ సిలికా..**

కృత్రిమమేధ పురోగతికి అవసరమైన సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా ఉండేందుకు అమెరికా గతేడాది ఈ 'ప్యాక్స్ సిలికా' ప్రోగ్రామ్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో ఆస్ట్రేలియా, గ్రీస్, ఇజ్రాయెల్, జపాన్, ఖతర్, దక్షిణ కొరియా, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యూకే సభ్యదేశాలుగా ఉన్నాయి. భవిష్యత్తులో ఏఐ, సాంకేతిక వ్యవస్థల అభివృద్ధి కోసం విశ్వసనీయ దేశాలన్నీ కలిసి ఓ భాగస్వామ్య ప్రణాళికను రూపొందించడమే ఈ కూటమి లక్ష్యం. అరుదైన ఖనిజాల కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా ఈ కూటమి ఏర్పడింది.

# సాయుధ బలగాలను వెనక్కి తీసుకోవాలి

- 'ఆపరేషన్ కాగర్-2' పేరుతో సాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'ఆపరేషన్ కాగర్-2' పేరుతో కర్రెగుట్ట అటవీ ప్రాంతాన్ని వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి, మావోయిస్టులను హతమార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. అడవిలో మోహరించిన గ్రేహౌండ్స్, సి.ఆర్.పి.ఎఫ్, కోబ్రా బలగాలను తక్షణమే వెనక్కి తీసుకొని, ఈ కూంబింగ్‌ను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేవారు. కేంద్ర హెూంశాఖ విధించిన 40 రోజుల డెడ్‌లైన్ పేరుతో కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో గత రెండు రోజులుగా సాయుధ బలగాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటికే ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు ప్రచారం జరుగుతున్నదని, మరికొంత మంది అగ్రనేతల ప్రాణాలకు హాని కలిగించేలా గాలింపు చర్యలు ఇంకా కొనసా గుతుండటం ఆందోళన కరమని అన్నారు. మావోయిస్టులు ఎలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడడం లేదని, ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధమని ప్రకటించారని, హింసాత్మక చర్యలను నిలిపివేసి, సమస్య పరిష్కారానికి మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చే విధంగా వారితో చర్చలు జరపాలని దేశ వ్యాపితంగా తమ పార్టీతో పాటు, వివిధ రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు కేంద్రానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్రం ప్రభుత్వం బేఖాతరు చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం మొండిగా హింసాత్మక మార్గాన్నే ఎంచుకోవడం సరైంది కాదని తెలిపారు. తక్షణమే ఈ మారణకాండను నిలిపివేయాలని, అటవీ ప్రాంతంలో సాధారణ స్థితిని పునరుద్ధరించాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఖర్గేతో చిన్నారెడ్డి భేటీ

- రాజ్యసభ సభ్యునిగా అవకాశం ఇస్తామన్న హామీని నిలబెట్టుకో వాలని ఖర్గేను కోరిన చిన్నారెడ్డి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఏఐసిసి చీఫ్, రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గేతో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ లో జరిగిన ఈ భేటీలో ఖర్గేకు పూల బొకే ఇచ్చి తెలంగాణ రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులను చిన్నారెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ 70 శాతం స్థానాలను, మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని కొనసాగించిందని, రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో, ఇతర ఏ ఎన్నికలు వచ్చిన కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతామని ఖర్గేకు చిన్నారెడ్డి వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా చేస్తున్న కృషిని మల్లికార్జున్ ఖర్గే అభినందించారని చిన్నారెడ్డి తెలిపారు. రెండేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ బీ ఫారంను తాను వెనక్కి ఇచ్చే సమయంలో తనను రాజ్యసభ సభ్యునిగా అవకాశం ఇస్తామని అధిష్టానం హామీనిచ్చిన విషయాన్ని చిన్నారెడ్డి ఏఐసీసీ చీఫ్ ఖర్గే దృష్టికి తెచ్చారు. తనకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఖర్గేను చిన్నారెడ్డి కోరారు.

# సిగరెట్ కాల్చొద్దన్నందుకు ఆగ్రహం

- పెట్రోల బంక్‌లో అగ్గిపుట్టించి హంగామా
- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



**రాయ్‌పూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** పెట్రోల్ బంకు వద్ద సిగరెట్ కాల్చేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించగా, వద్దని పెట్రోల్ బంకు సిబ్బంది కోరడంతో. ఆగ్రహించిన ఆ వ్యక్తి పెట్రోల్ నింపుతున్న బైక్ ట్యాంకులోకి లైటర్ విసిరాడు. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 18న రాత్రి 7:40 గంటల సమయంలో ఉర్లా ప్రాంతంలోని పెట్రోల్ బంకు వద్దకు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. ఆ బైక్‌లో పెట్రోల్ నింపుతుండగా వెనుక కూర్చొన్న వ్యక్తి కిందకు దిగి సిగరెట్ వెలిగించేందుకు ప్రయత్నించాడు. గమనించిన పెట్రోల్ బంకు ఉద్యోగి సిగరెట్ కాల్చవద్దని అతడికి చెప్పాడు. ఆగ్రహించిన ఆ వ్యక్తి పెట్రోల్ నింపుతున్న బైక్ ట్యాంకులోకి లైటర్ విసిరాడు. దీంతో బైక్‌తో పాటు అక్కడ మంటలు ఎగసిపడ్డాయి. పెట్రోల్ బంకు ఉద్యోగి, బైక్‌పై ఉన్న వ్యక్తి భయంతో అక్కడి నుంచి పరుగెత్తారు. మరోవైపు పెట్రోల్ బంకు ఉద్యోగి ఆ వెంటనే అప్రమత్తమయ్యాడు. ఇంధనం సరఫరా నిలిపివేశాడు. అగ్నిమాపక పరికరంతో మంటలను ఆర్పివేశాడు. ఇంతలో పారిపోతున్న ఆ ఇద్దరు వ్యక్తులను బంకు సిబ్బంది పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకున్న తర్వాత ఆ ఇద్దరిని అప్పగించారు. ఆ ఇద్దరు వ్యక్తులను ధర్మేంద్ర సింగ్, ఇమ్రాన్ ఖురైషిగా పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేశారు. వారి బైక్‌తో పాటు లైటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. కాగా, ఆ పెట్రోల్ బంకు వద్ద ఉన్న సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# భూతగాదాల్లో కాంగ్రెస్ నేత దారుణ హత్య

**సిద్దిపేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. భూ తగాదాల నేపథ్యంలో బాల్‌రెడ్డి (50) అనే వ్యక్తిని దాయాదులు హత్య చేశారు. దుబ్బాక పురపాలికలోని చెల్లాపూర్ వార్డు శివారులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెల్లాపూర్ వార్డుకు చెందిన వంగ బాల్‌రెడ్డిని అదే గ్రామానికి చెందిన దాయాదులు భూ తగాదాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం దారుణంగా గొంతు కోసి చంపారు. అనంతరం నిందితులు తల్లి, కొడుకు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు అనంతరం హత్యకు సంబంధించిన వివరాలు తెలియజేస్తామని ఏసీపీ తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణాను గుర్తించిన ఎమ్మెల్యే

**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** నర్సింహులపేట మండలంలో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు కొందరు వ్యక్తులు. ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ చేతిలో అడ్డంగా బుక్కయ్యారు. ఎమ్మెల్యే రామచంద్రునాయక్ కౌసల్యదేవిపల్లికి వెళ్తున్న క్రమంలో ఆకేరువాగు బ్రిడ్జీ వద్ద కాన్వాయి ఆపి, ఇసుక ట్రాక్టర్లకు జారీ చేసిన కూపన్లను పరిశీలించారు. ఇసుక ఎక్కడకు తరలిస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# న్యాయస్థానంలో అవినీతి బట్టబయలు

- రైతు దగ్గర లంచం డిమాండ్
- రూ.5వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ముగ్గురు కోర్టు సిబ్బందిపై విచారణ
- భూపాలపల్లిలో కలకలం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని న్యాయస్థానంలో అవినీతి బట్టబయలైంది.. సిబ్బంది నిర్వాకానికి కోర్టు పరువు పోయినంత పని అయింది.. శుక్రవారం ఓ రైతు వద్ద రూ.5 వేలు లంచం తీసుకుంటూ ముగ్గురు కోర్టు సిబ్బంది ఏసీబీకి చిక్కారు.. ఈ సంఘటన జిల్లా కేంద్రంలో కలకలం రేపింది.. ఒక న్యాయస్థానంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం పలువురిని ముక్కున వేలేసుకునేలా చేసింది.. వివరాల్లోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కర్కపల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు 14ఎకరాల 2గుంటల భూమి ఉంది. కాగా పక్కనే గల వ్యక్తి భూ తగాదా విషయంలో సుమారు 1995 లో కోర్టులో కేసు వేశాడు. ఈ కేసు విషయం పలుదఫాల్లో వివిధ కోర్టులకు బాధిత రైతు హాజరయ్యాడు. ఇందులో భాగంగా జిల్లా కోర్టులో గత సెప్టెంబర్ లో బాధిత రైతుకు అనుకూలంగా కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. అయితే ఈ కోర్టు తీర్పు కాపీ కావాలని ఫిబ్రవరి 10న బాధిత రైతు కాపీ సెక్షన్ లో అడుగగా, కోర్టు సిబ్బంది సాయి చరణ్ నిరాకరించాడు. రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. తాను అంత డబ్బులు ఇచ్చుకోలేనని వెళ్లిపోయిన బాధిత రైతు, తిరిగి 13న మళ్లీ కాపీ సెక్షన్ లోకి వెళ్లి చరణ్ ను కలిసి బ్రతిమిలాడగా రూ. 5 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. రూ. 5వేలు లంచం ఇవ్వడం ఇష్టం లేని రైతు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ మేరకు పథకం ప్రకారం శుక్రవారం జిల్లా కోర్టులోని కాపీ సెక్షన్ కు వెళ్లి బాధిత రైతు జడ్జి తీర్పు కాపీ కావాలని అడగగా, సెక్షన్ లో ఉన్న రజిత అనే సిబ్బందికి డబ్బులు ఇచ్చి కాపీ తీసుకోవాలని సాయిచరణ్ చెప్పాడు. దీంతో బాధిత రైతు లంచం డబ్బులు రూ. 5వేలు రజిత అనే సిబ్బందికి ఇచ్చేశాడు. ఇదే సెక్షన్లో సునీత అనే సిబ్బంది కూడా చరణ్ ఆ డబ్బులను తనకు ఇవ్వమన్నాడని తీసుకుంది. అప్పటికే అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు వెంటనే వెళ్లి పట్టుకున్నారు. లంచంగా తీసుకున్న డబ్బులను స్వాధీనం చేసుకొని ముగ్గురు కోర్టు సిబ్బందిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. అయితే జిల్లాకేంద్రంలోని కోర్టు సెక్షన్ లో జరిగిన ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. ఒక న్యాయస్థానంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఒక న్యాయస్థానం ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ, లంచం డిమాండ్ చేయడం ఏమిటని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా న్యాయస్థానంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పగడ్బందీ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయండి : వరంగల్ ఏసీబీ డిఎస్పి సాంబయ్య..**

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని వరంగల్ ఏసీబీ డిఎస్పి సాంబయ్య కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ముగ్గురు సిబ్బందిని పట్టుకున్న అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గణపురం మండలం కర్కపల్లి కి చెందిన రైతు కొద్ది రోజులుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నాడని ఈ క్రమంలో కోర్టు తీర్పు వచ్చిన తరువాత ఆ కాపీ ఇచ్చేందుకు, కాపీ సెక్షన్ లోని సాయి చరణ్ లంచం డిమాండ్ చేయడం జరిగిందని, ఈ విషయంపై బాధిత రైతు ఏసీబీని సంప్రదించగా తాము రంగంలోకి దిగి లంచం తీసుకుంటుండగా కోర్టు సిబ్బంది సాయి చరణ్, రజిత, సునీత లను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఎవరు లంచం అడిగినా తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ దాడుల్లో ఏసీబీ సిబ్బంది ఎల్ రాజు, ఎస్ రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త




**హైదరాబాద్ (జనంసాక్షి) :** కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన అవార్డు ప్రెజెంటేషన్- 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై, అవార్డు గ్రహీతలను సన్మానించి కార్యక్రమానికి విశిష్టత చేకూర్చారు. ఆయన మాట్లాడుతూ కళలు, సంస్కృతి సమాజాన్ని మానవీయ విలువలతో ముందుకు నడిపిస్తాయని, కళాకారులను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం జరగాలని ఆకాంక్షించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు అన్ని విధాలా అండగా వుంటున్నారని, గద్దర్ పేరిట ప్రతి ఏటా అవార్డులు అందజేస్తామని వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కర్ణాటక, తమిళనాడు ,ఆంధ్రప్రదేశ్ తెలంగాణ (4 రాష్ట్రాల) నుండి కవులు కళాకారులు వచ్చారు అని 180 మంది కళాకారులు , 180 నిమిషాలు అలాగే 180 అవార్డులు అందజేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ వేడుకలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు అవార్డులు అందజేయగా, పలువురు ప్రముఖులు, కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కీర్తి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు బిందు లిమ్మా గారు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళా, సాంస్కృతిక రంగానికి మరింత ఉత్సాహాన్ని అందించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామదాసు తేజావత్, అదనపు డిప్యూటీ




కమిషనర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అలాగే రాజేంద్ర, సినీ, టీవీ కళాకారుడు, దైవజ్ఞ శర్మ ప్రముఖ న్యూమరాలజిస్టు, డా. నారాల రుక్మారావు వ్యవస్థాపకులు, చైర్మన్ యశోద ఫౌండేషన్, బొంతల రాధిక అంతర్జాతీయ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

# ఘాట్ రోడ్డులో కారును ఢీకొన్న లారీ

- ప్రమాదంలో ఏడుగురు వ్యక్తుల దుర్మరణం



**అహ్మదాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఘాట్ రోడ్డులో ఒక కారును లారీ ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ కారు ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. ఆ కారులో ప్రయాణించిన ఏడుగురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. గుజరాత్‌లోని వాస్లాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో కర్పాడలోని కుంభ్‌ఘాట్ రోడ్డులో వేగంగా వెళ్తున్న కారును ఒక లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఆ కారు నుజ్జునుజ్జు అయ్యింది. కాగా, కారులో ప్రయాణించిన ఏడుగురిలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రికి తరలించగా మరో ఇద్దరు అక్కడ చనిపోయారు. మరణించిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మరోవైపు మృతులను అంబా జంగిల్ గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. నానా పోండాకు కారులో వారు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# 2014, ఫిబ్రవరి 20 మరిచిపోలేని రోజు

- మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



**రంగారెడ్డి (జనంసాక్షి) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లు ఫిబ్రవరి 20, 2014 నాడు రాజ్యసభలో ఆమోదం పొంది సాధనకు ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకొని పుష్కరకాలం అయిపోయిన సందర్భంలో మిఠాయిలు వంచుతూ తెలంగాణ న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమంలో జరిగిన పోరాట సందర్భాన్ని గుర్తుచేసుకొని సంతోషాన్ని వ్యక్తపరుస్తూ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నందుకు గర్వంగా ఉన్నదని వారు తెలియజేశారు ఈ సందర్భంగా వారు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షని కేంద్రంగా చేసుకొని జిల్లా కోర్టులో టెంటు వేసి వంద రోజులు నిరాహారదీక్ష చేసిన సందర్భం ఉద్యమాన్ని గల్లి నుంచి ఢిల్లీ వరకు న్యాయవాదులు నల్లకోటు ధరించి ఉద్యమంలోని పలు సంఘటనలను గుర్తు చేసుకున్నారు. పార్లమెంట్ ఫైరింగ్ జోన్ లోకి వెళ్లి జై తెలంగాణ అని దేశానికి చాటిన సందర్భం, హైకోర్టు గేట్లు ఎక్కి తెలంగాణ ఆకాంక్షను సమాజానికి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను చాటిన సందర్భం అసెంబ్లీ ముట్టడి సెక్రటేరియట్ ముట్టడి డీజీపీ ఆఫీస్ గేట్లు బద్దలు కొట్టి తెలంగాణ వాదాన్ని దిక్కులు పెక్కటిల్లెల తెలంగాణ వాధాన్ని తెలియజేసిన, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు అండగా నిలబడి మానవ హక్కుల కమిషన్ను యూనివర్సిటీకి తీసుకుపోయి కరెంటు నీరు ఇప్పించి పోలీసుల ధమన కాండను ఆపివేయడం కొరకు చేసిన పలు సందర్భాలు ఉప ఎన్నికలలో టిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కొరకు చేసిన ప్రచారాలు ఉద్యమకారులకు నాయకులకు వేసిన బెయిల్ పిటిషన్ సందర్భాలు గుర్తు చేసుకున్నారు. ఏదేమైనా తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడినందుకు గర్వంగా ఉన్నదని వారు తెలియజేశారు. ఉద్యమ సందర్భంలో 2009 నుంచి 14 వరకు న్యాయవాదులను జిల్లా కోర్టు నుండి అనేక పోరాటాలకు బై ఎలక్షన్ ప్రచారాలకు జైల్లో ఉన్న ఉద్యమకారులను పరామర్శించడం కొరకు పులిహార గోవర్ధన్ రెడ్డి సఫారీ కారు ఉద్యమ కాలంలో 2009 నుంచి 14 వరకు వేలాది కిలోమీటర్లు ఉద్యమకారులను మోసిన సందర్భాన్ని గుర్తు చేసుకొని ఈరోజు బిల్లు పాసైన సందర్భం రోజులో సఫారీ కారుకు ఘనంగా సత్కరించి పూలమాలలతో సత్కరించి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొంత గోవర్ధన్ రెడ్డి పుడు కమిషన్ సభ్యులు పులిహార గోవర్ధన్ రెడ్డి మాజీ ట్రిబ్యునల్ పంచాయతీరాజ్ సభ్యులు, న్యాయవాదులు మంత్రి రవీందర్రావు రావుల వెంకటరెడ్డి పెందుట శ్రీనివాసరావు,రవికుమార్ మాధవి ,మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణిలో 296 దరఖాస్తులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 296 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 113, రెవెన్యూ శాఖకు సంబంధించి 26, ఇందిరమ్మ ఇండ్ల కోసం 105, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 51 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

- విద్యార్థులు ఆస్పత్రిపాలు

**మెదక్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** జిల్లాలోని రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. దాంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం గుడ్డు కూర తిన్నారు. అయితే అదే గుడ్డు కూరను రాత్రికి పులుసగా తయారుచేసి విద్యార్థులకు వడ్డించినట్లు తెలుస్తోంది. తద్వారా 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం పది విద్యార్థులు తిరిగి కోలుకున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

# గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలని సూచించింది. జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆకస్మిక సందర్శనలతో పాటూ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. తనిఖీ నివేదికలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలని హుకుం జారీ చేసింది. ప్రతి నెలా 5వ తేదీలోపు నివేదిక సమర్పణని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**CHENGE OF NAME AND DATE OF BIRTH AND ADDRESS**

I, P. SRINU,R/O H.NO.3-25, KAKARAVANI THANDA GP, ERUPUMALLA (POST), BOMRASPET (MANDAL), VIKARABAD (DIST), TELANGANA (STATE), PIN:509338, CHENGED MY NAME AND DATE OF BIRTH AND ADDRESS PAN CARD, AADHAR CARD RAMAVATH SRINU S/O RAMDAS, D.O.B.12/02/1990, H.NO.3-25/1, KAKARLAGANDI THANDA GP, ERUPUMALLA POST, BOMRASPET(M), VIKARABAD (DIST),TELANGANA (STATE), PIN:509338.

# 2050కి స్వదేశీ తయారీతో ఆర్థిక మహాశక్తి భారత్!

స్వదేశీ తయారీ భావన భారత ఆర్థిక వ్యవస్థలో తాత్కాలిక నినాదం కాదు; అది దీర్ఘకాలిక వ్యూహాత్మక దృక్పథకోణం. 2014లో ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం 2025 నాటికి స్పష్టమైన ఫలితాలను ఇచ్చింది. తయారీ రంగం స్థూల దేశీయోత్పత్తిలో 14% వాటా కలిగి ఉంది. 2025-26లో తయారీ జీవీఏ పెరుగుదల 7.72% నుంచి 9.13% వరకు ఉంది. 2050 నాటికి ఈ వాటా 30%-32% స్థాయికి చేరుకోవడం కేవలం గణాంక పురోగతి కాదు; అది ఆర్థిక నిర్మాణ మార్పు. 2050 నాటికి భారతదేశం 30-35 ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి స్థాయిని చేరుకోవాలంటే తయారీ రంగ వార్షిక వృద్ధి కనీసం 8%-10% మధ్య స్థిరంగా కొనసాగాలి. 2025-26లో జీడీపీ వృద్ధి 7.4%గా అంచనా వేశారు. ఈ వృద్ధి సాధ్యమవ్వాలంటే మూడు కీలక ఆధారాలు బలపడాలి: మౌలిక వసతులు, నైపుణ్య మానవ వనరులు, సాంకేతిక పరిశోధన. మౌలిక వసతుల విస్తరణ ముఖ్యం. 2025లో లాజిస్టిక్స్ ఖర్చు స్థూల దేశీయోత్పత్తిలో 10%కి తగ్గితే, 2050 నాటికి అది 7%-8% మధ్యకు రావాలి. పోర్టుల సామర్థ్యం 1600 మిలియన్ టన్నుల నుంచి 3000 మిలియన్ టన్నులకు పెరగాలి. రైల్వే సరుకు రవాణా వాటా 27% నుంచి 45% దాటాలి. 2025లో రైలు నెట్వర్క్ 69,439 కి.మీ.కి చేరింది, 99.1% విద్యుదీకరణ సాధించారు. జాతీయ రహదారి జాలం 1.46 లక్షల కి.మీ.కి చేరింది. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2025 స్థాయితో పోలిస్తే 2050 నాటికి 2.5 రెట్లు పెరగాలి. అందులో పునరుత్పాదక శక్తి వాటా 60% దాటితే శక్తి స్వావలంబన బలపడుతుంది. 2025లో పునరుత్పాదక శక్తి సామర్థ్యం 190 గిగావాట్లకు చేరింది, 2030 నాటికి 420 గిగావాట్లకు పెరగాలని అంచనా. నైపుణ్యాభివృద్ధి మరో కీలకం. ప్రతి సంవత్సరం ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశించే 12-15 మిలియన్ యువతలో కనీసం 70% మందికి పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ అందాలి. 2025 వరకు 25 మిలియన్ మందికి శిక్షణ అందించారు, 2050 నాటికి ఈ సంఖ్య 80-100 మిలియన్ దాటాలి. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు ఏర్పడాలి. పరిశ్రమ-విద్యా సంస్థల భాగస్వామ్యం 3 రెట్లు పెరగాలి. ఎమ్ఎస్ఎమ్ఈలు తయారీ ఉత్పత్తిలో 35.4% వాటా కలిగి, 32.82 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. పరిశోధన అభివృద్ధి మూడవ స్తంభం. 2025లో స్థూల దేశీయోత్పత్తిలో 0.64% వద్ద ఉన్న పరిశోధన వ్యయం 2050 నాటికి 3% చేరాలి. ఇది సంవత్సరానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడిని సూచిస్తుంది. దేశీయ పేటెంట్ల సంఖ్య 2025తో పోలిస్తే 4 రెట్లు పెరగాలి. రక్షణ, అంతరిక్ష, ఔషధ, ఎలక్ట్రానిక్స్, హరిత శక్తి రంగాల్లో స్వదేశీ సాంకేతికత అభివృద్ధి కీలకం. ఎగుమతుల పరంగా 2025 ఏప్రిల్-డిసెంబర్లో తయారీ ఆధారిత ఎగుమతులు 634.3 బిలియన్ డాలర్లు, 4.3% పెరిగాయి. 2050 నాటికి అవి 2 ట్రిలియన్ డాలర్లు దాటాలి. ప్రపంచ సరఫరా గొలుసుల్లో భారత వాటా 3% నుంచి 8%-10% వరకు పెరగాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఔషధ, ఎలక్ట్రిక్ వాహనాలు, హరిత సాంకేతిక పరికరాలు ప్రధాన ఎగుమతి రంగాలుగా ఎదగాలి. దిగుమతుల పరంగా కీలక ముడి పదార్థాలు, చిప్స్, శక్తి వనరులపై ఆధార గణనీయంగా తగ్గాలి. క్రియాశీల ఔషధ పదార్థాల్లో స్వావలంబన 65% నుంచి 90% వరకు పెరగాలి. సెమీకండక్టర్ తయారీలో కనీసం 50% దేశీయ అవసరాలను దేశంలోనే తీర్చగల సామర్థ్యం అభివృద్ధి చెందాలి. రక్షణ సామగ్రిలో స్వదేశీ ఉత్పత్తి వాటా 60% నుంచి 85% దాటాలి. ఉపాధి పరంగా 2050 నాటికి తయారీ రంగం ప్రత్యక్షంగా 100-110 మిలియన్ మందికి ఉపాధి కల్పించగలదు. అనుబంధ రంగాలు కలుపుకుంటే ఇది 180 మిలియన్ దాటే అవకాశం ఉంది. గ్రామీణ పారిశ్రామికీకరణ ద్వారా పట్టణాలకు వలస ఒత్తిడి 20% వరకు తగ్గవచ్చు. ప్రాంతీయ అసమానతలు




30% వరకు తగ్గే అవకాశం ఉంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్య 2025లో 63 మిలియన్ వద్ద ఉంటే 2050 నాటికి 100 మిలియన్ దాటవచ్చు. వీటి స్థూల దేశీయోత్పత్తి వాటా 30% నుంచి 40% వరకు పెరగాలి. డిజిటల్ ఫైనాన్స్, ఈ-కామర్స్ వేదికల ద్వారా దేశీయ మార్కెట్ విస్తరించాలి. గ్రామీణ మార్కెట్ల వినియోగ శక్తి 2050 నాటికి 3 రెట్లు పెరగవచ్చు. ఆర్థిక స్థిరత్వం పరంగా విదేశీ మారక నిల్వలు దిగుమతుల 12 నెలల అవసరాలను తీర్చగల స్థాయిలో ఉండాలి. ద్రవ్యోల్బణం సగటు 4%-5% మధ్య నియంత్రితంగా కొనసాగాలి. తయారీ ఆధారిత వృద్ధి వల్ల పన్ను ఆదాయాలు పెరిగి సామాజిక రంగాలకు అధిక పెట్టుబడులు పెట్టే అవకాశముంటుంది. ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులపై ప్రభుత్వ వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 6%-8% వరకు పెరగవచ్చు. హరిత ఆర్థిక వ్యవస్థ 2050 దిశగా ప్రధాన దిక్సూచి అవుతుంది. కార్బన్ ఉద్గారాలను 2005 స్థాయితో పోలిస్తే 45% వరకు తగ్గించాలి. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి మొత్తం ఆటోమొబైల్ ఉత్పత్తిలో 70% వాటాను చేరాలి. సౌర, వాయు శక్తి ఉత్పత్తి సామర్థ్యం 2025తో పోలిస్తే 3 రెట్లు పెరగాలి. హరిత హైడ్రోజన్ ఉత్పత్తిలో ప్రపంచ మార్కెట్లో 15% వాటా లక్ష్యంగా పెట్టుకోవచ్చు. 2025లో బహిరంగ విద్యుత్ ఉత్పత్తి రికార్డు 41 గిగావాట్లు జోడించారు, పునరుత్పాదక శక్తి 40% వాటా చేరింది. డిజిటల్ పారిశ్రామికీకరణ కూడా కీలకం. పరిశ్రమ 4.0 సాంకేతికతల వినియోగం 80% తయారీ యూనిట్లలో అమలు కావాలి. ఆటోమేషన్ వల్ల ఉత్పాదకత 35% వరకు పెరగవచ్చు. సరఫరా గొలుసు పారదర్శకత 100% డిజిటల్ ట్రాకింగ్ ద్వారా సాధ్యమవుతుంది. చిన్న పరిశ్రమలు కూడా గ్లోబల్ మార్కెట్లలో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయి. సామాజిక పరంగా మధ్యతరగతి జనాభా 2025లో 35% ఉంటే 2050 నాటికి 60% దాటవచ్చు. వ్యక్తిగత ఆదాయం ప్రస్తుత స్థాయితో పోలిస్తే 3-4 రెట్లు పెరిగే అవకాశం ఉంది. పేదరిక రేటు 5% లోపు స్థాయికి తగ్గవచ్చు. మహిళా ఉపాధి వాటా తయారీ రంగంలో 20% నుంచి 40% వరకు పెరగాలి. వ్యూహాత్మక భద్రతా పరంగా మహిళా తయారీ రంగ ఉపాధి వాటా 40% చేరితే సామాజిక సమానత్వం బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన వల్ల ప్రాంతీయ అసమానతలు 30% వరకు తగ్గవచ్చు. స్వదేశీ తయారీ పెరగడం ద్వారా ఆర్థిక బలం మాత్రమే కాదు; జాతీయ గౌరవం, వ్యూహాత్మక స్వాతంత్ర్యం, సామాజిక సమతౌల్యం, భవిష్యత్ తరాల భద్రత అన్నీ సమన్వయంగా బలపడతాయి. అయితే ఈ ప్రయాణం సవాళ్లతో కూడినదే. ప్రపంచ పోటీ తీవ్రత, సాంకేతిక మార్పుల వేగం, వాతావరణ మార్పు ప్రభావాలు, ఆర్థిక అస్థిరత వంటి అంశాలు వ్యూహాత్మక చాతుర్యాన్ని కోరుకుంటాయి. విధాన స్థిరత్వం, పారదర్శక పాలన, న్యాయ వ్యవస్థ వేగవంతత, బ్యాంకింగ్ రంగ బలోపేతం కీలక పాత్ర పోషిస్తాయి. సారాంశంగా చెప్పాలంటే, 2014లో ప్రారంభమైన పారిశ్రామిక పునరుజ్జీవ నం 2025 నాటికి స్థిరమైన పునాది వేసింది. 2050 నాటికి సంపూర్ణ ఉత్పత్తి స్వయం సమృద్ధి సాధించడం సాధ్యమే కాని అది క్రమబద్ధమైన పెట్టుబడులు, సమగ్ర విధానాలు, నైపుణ్య మానవ వనరులు, సాంకేతిక స్వావలంబనపై ఆధారపడి ఉంటుంది. తయారీ రంగం 30% పైగా వాటాను సాధించి, ఎగుమతులు 2 ట్రిలియన్ డాలర్లు దాటి, ఉపాధి 100 మిలియన్ దాటితే భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానాన్ని అధిరోహిస్తుంది. స్వదేశీ తయారీ కేవలం ఆర్థిక వ్యూహం కాదు; అది జాతీయ గౌరవం, వ్యూహాత్మక స్వాతంత్ర్యం, సామాజిక సమతౌల్యం, భవిష్యత్ తరాల భద్రతకు బలమైన పునాది. 2050 దిశగా ఈ ప్రయాణం స్థిర సంకల్పం, సమగ్ర దృష్టి, సమన్వయ చర్యల ద్వారా విజయవంతమ వుతుంది. స్వదేశీ తయారీ భావనను సమగ్రంగా విశ్లేషించినప్పుడు ఒక ప్రాథమిక సత్యం స్పష్టమవుతుంది: ఉత్పత్తి సామర్థ్యం బలపడితేనే ఆర్థిక స్వావలంబన సుస్థిరంగా నిలుస్తుంది. 2014లో ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం భారత ఆర్థిక నిర్మాణంలో ఒక గుణాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. ప్రారంభ దశలో విధాన సంస్కరణలు, పెట్టుబడి ప్రోత్సాహకాలు, మౌలిక వసతుల విస్తరణ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణ వంటి చర్యలు చేపట్టబడగా, తదుపరి దశలో ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు, డిజిటల్ పారిశ్రామికీకరణ, హరిత శక్తి మార్పు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలు క్రమంగా బలపడ్డాయి. ఈ క్రమబద్ధమైన ప్రయాణం 2025 నాటికి గణనీయమైన ఫలితాలను ఇచ్చింది. అయితే అసలు సవాలు 2050 దిశగా ఉన్న దీర్ఘకాలిక లక్ష్య సాధనలోనే ఉంది. 2050 నాటికి భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామి దేశాలలో ఒకటిగా నిలవాలంటే తయారీ రంగం స్థూల దేశీయోత్పత్తిలో కనీసం 30% వాటాను సాధించాలి. ఇది కేవలం శాతపరమైన గణాంకం కాదు; దేశ ఉత్పత్తి సామర్థ్యం మూడు నుంచి నాలుగు రెట్లు పెరగాలి అనే అర్థం. తయారీ రంగం వార్షిక వృద్ధి 8%-10% మధ్య స్థిరంగా కొనసాగితేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది. దీని ఫలితంగా దేశ స్థూల దేశీయోత్పత్తి 30-35 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉంది. ఈ పరిమాణంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వాణిజ్యంలో ప్రభావవంతమైన పాత్ర పోషిస్తుంది. స్వదేశీ తయారీ పెరుగుదలతో ఏర్పడే అత్యంత కీలక మార్పు ఉపాధి విస్తరణ. 2025 నాటికి సుమారు 60 మిలియన్ మందికి ఉపాధి కల్పించిన తయారీ రంగం, 2050 నాటికి 100-110 మిలియన్ ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించగలదు. అనుబంధ రంగాలు కలుపుకుంటే ఈ సంఖ్య 180 మిలియన్ దాటవచ్చు. ఇది యువ జనాభా శక్తిని సృజనాత్మక దిశగా మలిచే సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఉపాధి పెరగడం వల్ల వ్యక్తిగత ఆదాయం పెరుగుతుంది; ఆదాయం పెరగడం వల్ల వినియోగ శక్తి పెరుగుతుంది; వినియోగం పెరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అంతర్గతంగా బలపరుస్తుంది. దిగుమతులపై ఆధారం తగ్గించడం కూడా 2050 లక్ష్యంలో కీలక అంశం. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ సామగ్రి, ఔషధ ముడి పదార్థాలు, శక్తి పరికరాలు వంటి రంగాల్లో కనీసం 80% దేశీయ అవసరాలను దేశంలోనే తీర్చగలిగితే విదేశీ మారక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావం 40%-50% వరకు తగ్గవచ్చు. వ్యూహాత్మక స్వాతంత్ర్యం బలపడుతుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు; జాతీయ భద్రతకు కూడా బలమైన పునాది. ఎగుమతుల విస్తరణ ద్వారా భారతదేశం ప్రపంచ సరఫరా గొలుసుల్లో కీలక కేంద్రమవుతుంది. 2050 నాటికి తయారీ ఆధారిత ఎగుమతులు 2 ట్రిలియన్ డాలర్లు దాటితే ప్రపంచ వాణిజ్యంలో 8%-10% వాటా సాధ్యమవుతుంది. హరిత శక్తి పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, బయోటెక్నాలజీ ఉత్పత్తులు, డిజిటల్ హార్డ్వేర్, రక్షణ పరికరాలు, ఔషధాలు ప్రధాన ఎగుమతి రంగాలుగా ఎదగవచ్చు. భారతదేశం కేవలం వినియోగ మార్కెట్ కాకుండా, ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా మారుతుంది. పరిశోధన సాంకేతిక స్వావలంబన 2050 లక్ష్య సాధనలో అత్యంత ముఖ్యమైన స్తంభం. స్థూల దేశీయోత్పత్తిలో పరిశోధన వ్యయం 3% చేరితే దేశీయ ఆవిష్కరణలు పెరుగుతాయి. పేటెంట్ల సంఖ్య నాలుగు రెట్లు పెరిగితే సాంకేతిక ఆధారపడుదల తగ్గుతుంది. పరిశ్రమ 4.0, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, బయోఫార్మా, నానోటెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యం పెరిగితే ఉత్పాదకత 35%-40% వరకు పెరగవచ్చు. ఇది గ్లోబల్ పోటీలో ముందంజనిస్తుంది. మౌలిక వసతుల విస్తరణ కూడా సమాంతరంగా కొనసాగాలి. లాజిస్టిక్స్ ఖర్చు 14% నుంచి 7% వరకు తగ్గితే భారత ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత పోటీగా మారుతాయి. పోర్టు సామర్థ్యం రెట్టింపు కావాలి. రైల్వే సరుకు రవాణా వాటా 45% దాటాలి. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2.5 రెట్లు పెరగాలి. అందులో పునరుత్పాదక శక్తి వాటా 60% దాటితే శక్తి భద్రత బలపడుతుంది. హరిత ఆర్థిక వ్యవస్థ 2050 భారత దృశ్యంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలి. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి మొత్తం వాహన ఉత్పత్తిలో 70% చేరాలి. హరిత హైడ్రోజన్ ఉత్పత్తిలో ప్రపంచ మార్కెట్లో కనీసం 15% వాటా సాధించాలి. పర్యావరణ అనుకూల పారిశ్రామిక విధానాలు దీర్ఘకాలిక స్థిరత్వాన్ని నిర్ధారిస్తాయి. సామాజిక దృక్కోణంలో మధ్యతరగతి విస్తరణ, గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా ఉపాధి పెరుగుదల వంటి అంశాలు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయి. మహిళల తయారీ రంగ ఉపాధి వాటా 40% చేరితే సామాజిక సమానత్వం బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన వల్ల ప్రాంతీయ అసమానతలు 30% వరకు తగ్గవచ్చు. పేదరిక రేటు 5% లోపు స్థాయికి చేరే అవకాశం ఉంది. విధాన పరంగా స్థిరత్వం, పారదర్శకత, సత్వర న్యాయ పరిష్కార వ్యవస్థ, బలమైన బ్యాంకింగ్ రంగం అవసరం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సాంకేతిక సహాయం, తక్కువ వడ్డీ రుణాలు, మార్కెట్ ప్రాప్తి కల్పించాలి. డిజిటల్ వేదికల ద్వారా దేశీయ ఉత్పత్తుల ప్రాచుర్యం పెంచాలి. వినియోగదారులలో స్వదేశీ ఉత్పత్తులపై విశ్వాసం మరింత బలపడాలి. 2050 దిశగా ప్రయాణం సవాళ్లతో కూడినదే అయినప్పటికీ, సమగ్ర ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం, పరిశ్రమ-ప్రభుత్వ సమన్వయం, సాంకేతిక ఆవిష్కరణలతో ఈ లక్ష్యం సాధ్యమే. తయారీ రంగం 30% పైగా వాటాను సాధించి, ఎగుమతులు 2 ట్రిలియన్ డాలర్లు దాటి, ఉపాధి 100 మిలియన్ దాటితే భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామి స్థానాన్ని పొందుతుంది. స్వదేశీ తయారీ పెరగడం ద్వారా ఆర్థిక బలం మాత్రమే కాదు; జాతీయ గౌరవం, వ్యూహాత్మక స్వాతంత్ర్యం, సామాజిక సమతౌల్యం, భవిష్యత్ తరాల భద్రత అన్నీ సమన్వయంగా బలపడతాయి. 2014లో ప్రారంభమైన ఈ దిశా నిర్దేశం 2050 నాటికి సంపూర్ణ ఫలితాన్ని ఇస్తే భారతదేశం స్వయం సమృద్ధి సాధించిన మహా ఆర్థిక శక్తిగా ప్రపంచ వేదికపై నిలుస్తుంది. ఇదే స్వదేశీ తయారీ భావన యొక్క అంతిమ లక్ష్యం, ఇదే ఆర్థిక స్వావలంబన యొక్క సార్థకత.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## కవి ఏమవుతాడు

ఆవేశాక్షర శరాలను సంధిస్తూ
సమసమాజ నిర్మాణానికి అంకుశమవుతాడు
పదనెక్కిన పదమై పద్మవ్యూహాలను ఛేదిస్తూ
అభ్యుదయ పథ దిక్సూచిలా సాగుతాడు
వడిగొను వాక్య వాతూలమై వర్ణాలను మట్టిలో
కలుపుతూ నిచ్చెన మెట్లను కూల్చుతాడు
గర్జించు గ్రంథమై గురివిందగింజల
నిజరూపుకు నిలువెత్తు సాక్షమౌతాడు
పేకమేడల కలల సౌధాలకు పునాదియై
చెదిరిన బతుకులకు చేయూతగ నిలుస్తాడు
నిశ్శబ్ద శబ్దాల సారమై మనసు పొరలను
తాకుతూ
అనంత భావావేశ ఉత్తుంగ తరంగాల
సింధువవుతాడు
అక్షరమై,పదమై,వాక్యమై,గ్రంథమై
రవి గాంచని చోటుకు సాగుతూ
అక్షర శిల్పియై పొత్తమునేలుతాడు

అడ్డగూడి ఉమాదేవి
తెలుగు అధ్యాపకురాలు
సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ
కళాశాల, వరంగల్
9908057980

## మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కండి

ఉషోదయం విరబూయాల్సిన చోట
ఉన్మాదం చెలరేగిపోతుంది
మానవ పరిమళాలు వెదజల్లే చోట
మతోన్మాదం పాములు బుస కొడుతున్నాయి
జ్ఞానం వికాసం చెందాల్సిన చోట
అజ్ఞానం తాండవ మాడుతుంది
తిమిరాలను తరిమికొట్టే ప్రదేశాల్లో
తోడేళ్లు తిరుగుతున్న కలకలం
మనుషులు, మనసులు సంచరించే చోట
మనిషిలోని మృగాలు తిరుగుతున్నాయి
మనిషికి మనిషికి మధ్యలో మతం చొరబడి
మనుషుల్లో మనిషే లేకుండా పోతున్నాడు
నిత్య నూతనంగా మెరవాలసిన ఆలోచనలు
నికృష్టపు మురికి కాలువలై కంపు కొడుతున్నవి
సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లిన చోట
పాతకాలపు సిద్ధాంతాలు మొలకెత్తుతున్నాయి.
మూర్ఖపు సిద్ధాంతాలన్నీ ముసుగు తీసి
మనువాదపు దుర్మార్గమంతా నిద్రలేచి
మనిషికి మనిషికి మధ్యలో అంతరాలు పేర్చే
మరో ప్రమాదం ముంచుకు వస్తున్నది.
మేల్కొనండి, నిద్ర మత్తు వీడండి
మనల్ని మనం రక్షించుకోవడం కోసం
మతోన్మాదాన్ని తరిమికొట్టే దేశభక్తులమై
మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కండి.

నెరువట్ల చైతన్య, 9491470746

## సీస మాలిక

కష్టమ్ము చేసిన కడుపు నింపగలేని!
కాలము వచ్చెను కరుణ వీడి!
లంచగొండితనము లక్ష్యమ్ము వీడగా!
నవినీతినంతయు నార్పివేయ!
పండిన పంటకు పాటియౌ ధరలకై!
రైతు కోరికదీర్చ రయముగాను!
పట్టభద్రులపట్టి పొట్టనింపగలేని!
పోరాట యోధుల పోరు కోరి!
వెంటబడుచునాడ పిల్లల వేధించు!
కామాంధు పాలిటి కత్తిగాను!
ప్రజలను భయపెట్టి పాలించు ప్రభుతల!
గుండాలకు తుపాకి గుండుగాను!
నోట్లునిచ్చి కొనెడు నోటుతో పెద్దలు!
వద్దన్న కుండినన్ గద్దెదిగరు,!
ఇవియె కవికి నేడు నితివృత్తములుగను!
కావాలి సంపూర్ణ కార్యదీక్ష!
**తేటగీతి:**
పేదజీవుల పాలిట పెన్నిధిగను!
మంచిచెడులన్నియు నెపుడు నెంచిచూడ!
కలము చేతిన పట్టుచు కదులు తీరు!
రవియుకాంచని చోటును కవియు గాంచు!

కవి: కనకయ్య మల్లముల,
సిద్దిపేట, 9440554042

## తప్పిపోయిన మానవుడు

మనిషి తప్పిపోయిండు
జాడ మరచి పోయిండు
అత్యాశల దారుల్లో...
ఆదమరచి పోయిండు!
విలాసాల వలయంలో
వినోదాల కూపంలో
తనకు తాను తెలియకుండ
నిలిచె అంధకారంలో!
బంధాలను వదిలేసి విలువలను
కాలరాసి.. ఏకాకిగా మారెనేడు
అందరితో ఎడబాసి!
మత్తునకు గమ్మతుగా
బానిసాయె మత్తుగా...మైకంలో
మైమరచి.. ఓడినాడు చిత్తుగా!
ప్రాపంచిక పరుగులో
గెలవాలని పోరులో
పిల్లిమొగ్గలేస్తుండు.. రాకాసి స్వప్నంలో!
నిన్నునీవు మరచిపోతె
నీ వాళ్ళతొ మైత్రిచెడితె బంధాలకు
విలవేది ధర్మాన్ని విడిచిపోతె!
అనుసరించు ధర్మము
తెలిసి నడువు మార్గము
నిన్ను నీవు తెలుసుకుంటె
అదే నీకు శ్రేయము!

వంగరి వెంకటేశం
చరవాణి: 9951626284

## ఏఐ సమ్మిట్‌లో చైనా రోబో డాగ్ వివాదం

భారతదేశం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ప్రపంచ స్థాయి నాయకత్వం వహించాలన్న లక్ష్యంతో న్యూఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 ఒక వివాదంతో ముగిసింది. గల్గోటియాస్ యూనివర్సిటీ ప్రదర్శించిన రోబో డాగ్ 'ఓరియన్' చైనా యూనిట్రీ రోబోటిక్స్ కంపెనీ తయారు చేసిన గో2 మోడల్ అని తేలడంతో పెద్ద రచ్చ రేగింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ నేహా సింగ్ డీడీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇది తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అభివృద్ధి చేసినదని చెప్పారు. కానీ సోషల్ మీడియాలో నెటిజన్లు దీన్ని చైనా ఉత్పత్తిగా గుర్తించి, మోసం అంటూ ఆరోపణలు చేశారు. ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీ స్టాల్ తొలగించమని ఆదేశించింది. ఈ ఘటన భారత ఏఐ రంగంలో నిజమైన ఆవిష్కరణలు ఎంత దూరంలో ఉన్నాయో చూపిస్తోంది. గల్గోటియాస్ యూనివర్సిటీ మిస్‌కమ్యూనికేషన్ అని సమర్థించుకుంది. రోబో డాగ్‌ను స్టూడెంట్ లెర్నింగ్ టూల్‌గా ప్రదర్శించామని, ప్రొఫెసర్ తప్పుగా మాట్లాడారని చెప్పింది. కానీ ఇది సమ్మిట్ మొత్తాన్ని హాస్యాస్పదంగా మార్చింది. ప్రపంచ నాయకులు, టెక్ దిగ్గజాలు పాల్గొన్న కార్యక్రమంలో చైనా ఉత్పత్తిని స్వదేశీ ఆవిష్కరణగా చూపించడం భారత ఇమేజ్‌కు దెబ్బతీసింది. ఈ వివాదం రాజకీయ రంగు పూసుకుంది. అపోజిషన్ పార్టీలు బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాయి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మోదీ సర్కార్‌ను ఉద్దేశించి, ఏఐ సమ్మిట్‌ను చైనా బజార్‌లా మార్చారని ఎద్దేవా చేశారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాజీనామా చేయమని డిమాండ్ చేశారు. గల్గోటియాస్ యూనివర్సిటీ బీజేపీకి సన్నిహితమని, సంబిత్ పాత్రా, పీయూష్ గోయల్ వంటి నాయకులు ఆ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఆరోపణలు వచ్చాయి. సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ యూనివర్సిటీకి బీజేపీ ప్రోత్సాహం ఉందని విమర్శించారు. బీజేపీ మాత్రం వివాదం తెలిసిన వెంటనే యూనివర్సిటీని తొలగించామని సమర్థించుకుంది. మిస్‌లీడింగ్‌ను ప్రోత్సహించమని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇది సమ్మిట్ మొత్తానికి మచ్చ తెచ్చింది. ఏఐ సమ్మిట్ భారతదేశం టెక్ రంగంలో అగ్రగామిగా మారాలన్న లక్ష్యంతో జరిగింది. ప్రధాని మోదీ, బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునక్ వంటి నాయకులు పాల్గొన్నారు. కానీ ఒక చిన్న మోసం సమ్మిట్ గౌరవాన్ని దెబ్బతీసింది. గల్గోటియాస్ లాంటి ప్రైవేట్ యూనివర్సిటీలు నిజమైన పరిశోధనలు చేయకుండా, విదేశీ ఉత్పత్తులను స్వంతమని చూపించడం భారత ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో లోపాలను బయటపెడుతోంది. యూనివర్సిటీలు ఆవిష్కరణలు చేయాలి, మోసాలు కాదు. ఈ ఘటన సోషల్ మీడియాలో మీమ్స్ ఫెస్ట్‌గా మారింది. 'గల్గోటియాస్ టాపీ ఉస్కే సర్' అని జోకులు వచ్చాయి. నేహా సింగ్ లింక్డిన్ ప్రొఫైల్ 'ఓపెన్ టు వర్క్'గా మార్చారు. ఇది హాస్యాస్పదమే కానీ, భారత ఏఐ రంగానికి ఇబ్బందికరం. బీజేపీ ప్రభుత్వం ఏఐ మిషన్‌తో 10,000 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ ఇలాంటి మోసాలు ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సమ్మిట్‌లో పాల్గొనే యూనివర్సిటీలు, కంపెనీలు సరైన వెరిఫికేషన్ చేయకుండా అనుమతించడం ప్రభుత్వ లోపం. చైనా ఉత్పత్తులపై భారతదేశం ఆధారపడటం, స్వదేశీ ఆవిష్కరణలు లేకపోవడం ఇక్కడ స్పష్టం. చైనా రోబోటిక్స్‌లో ముందుంది, భారత్ ఇంకా ప్రారంభ దశలోనే. మేక్ ఇన్ ఇండియా నినాదాలు చెప్పడం కాదు, నిజమైన పరిశోధనలు ప్రోత్సహించాలి. యూనివర్సిటీలకు ఫండింగ్ పెంచి, ప్లేజియరిజం పై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ వివాదం అపోజిషన్‌కు బీజేపీని విమర్శించే అవకాశం ఇచ్చింది. రాహుల్ గాంధీ మోదీని 'చైనా ప్రేమికుడు' అని విమర్శించారు. మహువా మొయిత్రా వైష్ణవ్ రాజీనామా డిమాండ్ చేశారు. బీజేపీ మాత్రం తక్షణ చర్య తీసుకున్నామని చెప్పుకుంటోంది. కానీ సమ్మిట్ ఆర్గనైజర్లు ఎలా అనుమతించారు? ఇది ప్రభుత్వ ఓవర్‌సైట్ లోపం. ఏఐ రంగంలో భారత్ ప్రపంచానికి చూపించాలనుకున్నది నిజమైన ఆవిష్కరణలు, కానీ ఇలాంటి మోసాలు మన ఇమేజ్‌ను దెబ్బతీస్తాయి. యూనివర్సిటీలు విద్యార్థులకు నిజాయితీ నేర్పాలి, మోసాలు కాదు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలి. సమ్మిట్‌లో పాల్గొనే సంస్థలు సర్టిఫికేషన్ చేయాలి. ఏఐ రంగం భవిష్యత్, కానీ మోసాలతో ముందుకు వెళ్లలేం. ఈ ఘటన నుంచి పాఠాలు నేర్చుకుని, స్వదేశీ ఆవిష్కరణలు ప్రోత్సహించాలి. బీజేపీ ప్రభుత్వం తన విధానాలను సమీక్షించాలి, అపోజిషన్ విమర్శలకు సమాధానం చెప్పాలి. ఏఐ సమ్మిట్ లాంటి కార్యక్రమాలు నిజమైన ఆవిష్కరణలకు వేదిక కావాలి, మోసాలకు కాదు. భారత్ ఏఐ సూపర్ పవర్ కావాలంటే, స్వదేశీ పరిశోధనలు పెంచాలి. ఈ ఘటన ఒక హెచ్చరిక. మోసాలు ఎంతకాలం దాచిపెట్టలేం, సత్యం బయటికి వస్తుంది. యూనివర్సిటీలు, ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. భారత యువతకు నిజమైన అవకాశాలు కల్పించాలి. ఈ వివాదం ముగియాలంటే, కఠిన చర్యలు తీసుకోవాలి. గల్గోటియాస్ పై ఇన్వెస్టిగేషన్ చేయాలి. బీజేపీ తన సన్నిహితులను కాపాడకుండా చూడాలి. ఏఐ రంగం భారత ఆర్థిక వ్యవస్థకు కీలకం, మోసాలతో దెబ్బతినకుండా చూడాలి. ఇది భారత టెక్ రంగానికి అవసరం. వివాదం ముగిసినా, దాని ప్రభావం మిగిలిపోతుంది. బీజేపీ ప్రభుత్వం తన బాధ్యత తెలుసుకోవాలి. అపోజిషన్ విమర్శలు సరైనవే, సమాధానం చెప్పాలి. ఏఐ భవిష్యత్, మోసాలు ఆపాలి. ఈ ఘటన ఒక టర్నింగ్ పాయింట్ కావాలి. భారత్ నిజమైన ఆవిష్కరకులను ప్రోత్సహించాలి. యూనివర్సిటీలు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలి. ప్రభుత్వం కఠిన రూల్స్ పెట్టాలి. ఇది భారత ఏఐ డ్రీమ్‌ను సాకారం చేస్తుంది. వివాదం మరచిపోకుండా, పాఠాలు నేర్చుకోవాలి. బీజేపీ తన పాలనను సమీక్షించాలి. ఏఐ సమ్మిట్ లాంటివి నిజమైన ప్లాట్‌ఫామ్‌లుగా మారాలి. ఈ ఘటన భారత సమాజంలో నైతికతపై చర్చ రేపింది. మోసాలు ఎక్కడైనా తప్పు, టెక్ రంగంలో మరీ తప్పు. యూనివర్సిటీలు బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వం విచారణ చేయాలి. ఇది భవిష్యత్ ఘటనలు ఆపుతుంది. భారత్ ఏఐలో సూపర్ పవర్ కావాలి, నిజమైన ఆవిష్కరణలతో. ఈ వివాదం ఒక హెచ్చరిక. ముందుకు సాగుదాం, మోసాలు ఆపుదాం.

డాక్టర్ హరిణి , తెలుగు అధ్యాపకులు

# మన బతుకు చిత్రం.. గంగా జమునా తహజీబ్!

భారతదేశం బహుళ సంస్కృతుల సమ్మేళనానికి సజీవ సాక్ష్యం. ఎన్నో వందల ఏళ్లుగా ఈ గడ్డ మీద హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ మతాలు ఒకే తల్లి బిడ్డల్లా కలిసిమెలిసి జీవిస్తున్నాయి. మన పొరుగు దేశాలు మతం ఆధారంగా ఏర్పడి అశాంతిలో కొట్టుమిట్టాడుతుంటే, మన దేశం మాత్రం భిన్నత్వంలో ఏకత్వం అనే పునాది మీద నిలబడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ముఖ్యంగా మన దక్కన్ పీఠభూమి, తెలంగాణ గడ్డ గంగా జమునా తహజీబ్ కు నిలువెత్తు రూపం. ఇక్కడ ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాసాలు విడిచే సమయంలో పంచుకునే ఖర్జూరం, సేమియాల కోసం పొరుగున ఉన్న హిందూ కుటుంబాలు ఎంతో ప్రేమగా ఎదురుచూస్తాయి. దసరా, దీపావళి పండుగల్లో తయారుచేసిన పిండివంటలు ముస్లిం ఇళ్లకు అంతే ఆప్యాయంగా వెళ్తాయి. పల్లెల్లో పీర్ల పండుగ (మొహర్రం) వస్తే హిందూ సోదరులే ముందుండి పీర్లను ఎత్తుతారు, నిప్పుల గుండం తొక్కుతారు, పానకం పంచుతారు. ఒకరి కష్టంలో మరొకరు పాలుపంచుకుంటూ, ఒకరి పండుగను మరొకరు గౌరవించుకుంటూ సాగుతున్న ఈ సామాజిక ప్రయాణంలో ఎన్నడూ మతం ఒక అడ్డుగోడ కాలేదు. కానీ, నేటి రాజకీయాలు ఈ అందమైన బతుకు చిత్రంపై కక్షగట్టాయి. అమాయక ప్రజల మనసుల్లో అనుమానం అనే విషపు బీజాలు నాటుతూ, తరతరాల సోదరభావాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం బలిపీఠం ఎక్కిస్తున్నాయి.

లౌకికవాదం అంటే రాజ్యాంగ పుస్తకంలో రాసుకున్న ఒక అక్షరం మాత్రమే కాదు, అది ఈ దేశ ప్రజల దైనందిన జీవితం. ఒక సామాన్యుడికి ఆసుపత్రిలో రక్తం ఎక్కించేటప్పుడు అది ఏ మతం వాడి రక్తం అని ఎవరూ అడగరు. బస్సులో పక్క సీట్లో కూర్చున్న ప్రయాణికుడి మతం చూసి ఎవరూ మాట్లాడటం మానేయరు. మార్కెట్లో కూరగాయలు కొనేటప్పుడు, ఆటో ఎక్కేటప్పుడు అవతలి వ్యక్తి మతం ఏమిటో చూసి ఎవరూ బేరం ఆడరు. కష్టజీవుల చెమటకు కులం, మతం ఉండవు. కానీ, ఎన్నికలు రాగానే ఈ సామరస్య వాతావరణం ఒక్కసారిగా ఎందుకు కలుషితం అవుతుందో ప్రతి పౌరుడు ఆలోచించాలి. నిరుద్యోగం,



ద్రవ్యోల్బణం, వ్యవసాయ సంక్షోభం, పేదరికం వంటి అసలైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కొందరు స్వార్థ రాజకీయ నాయకులు మతాన్ని ఒక మత్తుమందులా వాడుతున్నారు. ఒక వర్గాన్ని భయపెట్టడం, మరొక వర్గాన్ని రెచ్చగొట్టడం ద్వారా ఓట్ల పంట పండించుకుంటున్నారు. ఈ రాజకీయ చదరంగంలో అమాయక మైనారిటీలు అనుక్షణం అభద్రతాభావంతో బతకాల్సిన దుస్థితి దాపురించింది. దశాబ్దాలుగా ఈ దేశాభివృద్ధిలో భాగస్వాములైన వారి దేశభక్తిని పదే పదే ప్రశ్నించడం, వారి ఆహారపు అలవాట్లను, వేషధారణను వివాదంగా మార్చడం ఏ రకమైన జాతీయవాదమో ఆ నాయకులే చెప్పాలి.

నిజమైన దేశభక్తి అంటే మనుషులను విడదీయడం కాదు, కలపడం. దేశంలోని పౌరులందరినీ ఒకేలా చూడటం. కానీ నేటి విద్వేష ప్రసంగాలు సమాజంలో ఒక అదృశ్యమైన శత్రువును సృష్టిస్తున్నాయి. చారిత్రక గాయాలను పదే పదే రేపడం, వందల ఏళ్ల క్రితం జరిగిన పరిణామాలకు నేటి తరాలను బాధ్యులను చేస్తూ ద్వేషాన్ని నూరిపోయడం ద్వారా సమాజంలో అగాధాలు సృష్టిస్తున్నారు. వీధివీధినా అపనమ్మకాలు పెంచుతున్నారు. దీని వల్ల అంతిమంగా నష్టపోయేది దేశమే. ఒక సమాజంలో నిరంతరం అశాంతి, ఘర్షణ వాతావరణం ఉంటే అక్కడ పెట్టుబడులు రావు, ఉపాధి అవకాశాలు సృష్టించబడవు. ద్వేషంతో రగిలిపోయే యువత చేతుల్లో దేశ భవిష్యత్తు సురక్షితంగా ఎలా ఉంటుంది? నాయకులు తమ పిల్లలను విదేశాల్లో చదివించుకుంటూ, సామాన్యుల పిల్లల చేతుల్లో మాత్రం మత విద్వేషపు కత్తులు పెడుతున్నారు. ఈ కుట్రను సామాన్య ప్రజలు గ్రహించిన నాడే ఈ దేశానికి పట్టిన అసలైన చీడ వదులుతుంది. మతం మనిషిని సంస్కరించాలి కానీ, ఉన్మాదిగా మార్చకూడదు. తోటి మనిషిని ప్రేమించలేని ఏ మతం కూడా దేవుడికి ప్రీతిపాత్రం కానేరదు.

మన రాజ్యాంగ నిర్మాతలు ఎంతో దూరదృష్టితో ఈ దేశాన్ని ఒక లౌకిక రాజ్యంగా తీర్చిదిద్దారు. సంఖ్యాబలంతో సంబంధం లేకుండా మెజారిటీ, మైనారిటీ వర్గాలందరికీ సమాన హక్కులు కల్పించారు. ఆ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు పౌర సమాజం మీదనే ఉంది. ముఖ్యంగా బాధ్యతాయుతమైన పత్రికలు, మేధావులు ఈ విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా గొంతు విప్పాలి. మతం పేరుతో చిచ్చుపెట్టే నాయకులను గ్రామాల్లో, వాడల్లో నిలదీయాలి. మాకు విద్వేషాలు వద్దు, మా పిల్లలకు బడులు కావాలి, యువతకు కొలువులు కావాలి అని ప్రశ్నించాలి. ముస్లింల పట్ల సానుభూతి చూపడం అంటే మెజారిటీ వర్గానికి వ్యతిరేకంగా పనిచేయడం కాదు, రాజ్యాంగం కల్పించిన సమానత్వాన్ని గౌరవించడమే అనే సత్యాన్ని అందరూ గ్రహించాలి. కులమతాలకు అతీతంగా మానవత్వం అనే ఒకే ఒక్క విశాల ఆకాశం కింద భారతీయులంతా చేయి చేయి కలిపి నడిచినప్పుడే మన దేశం నిజమైన విశ్వగురువుగా నిలబడుతుంది. అప్పటి వరకు ఈ గంగా జమునా తహజీబ్ అనే ఆత్మకు మనం నిరంతరం కాపలా కాయక తప్పదు.



- పురుషోత్తం నారగౌని
సీనియర్ జర్నలిస్ట్
8897388393

## మసీదులు, ఈద్గాల వద్ద పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- రంజాన్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పలు శాఖల అధికారులు, ముస్లిం మతపెద్దలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రంజాన్ పర్వదినాన్ని విజయవంతం చేయాలన్నారు. ముస్లింలు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు చేస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. మసీదులు, ఈద్గాల వద్ద పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. శాంతిభద్రతలను నిశితంగా పరిశీలించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## విజయవంతంగా ముగిసిన సెంట్రల్ జోన్ వైస్ ఛాన్స్‌లర్ల సదస్సు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ), ఉస్మానియా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన సెంట్రల్ జోన్ వైస్ ఛాన్సలర్ల సదస్సు శుక్రవారం ఘనంగా ముగిసింది. భారతీయ విద్యా రంగంలో డిజిటల్ పరివర్తనకు ఈ సదస్సు ఒక మైలురాయిగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం సాంకేతికతతో కూడిన ఉన్నత విద్యా సంస్థల నిర్మాణం" అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, వైస్ ఛాన్సలర్లు, పారిశ్రామికవేత్తలు పాల్గొని భవిష్యత్ పరిశోధనలు, నైతిక విలువలు,సాంకేతిక ఆధారిత విద్యా విధానాలపై లోతైన చర్చలు జరిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ చర్చల్లోని మేధోమధన సారాంశాన్ని నివేదిక రూపంలో ఏఐయూ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నారు. రెండు రోజుల వైస్ ఛాన్సలర్ల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ హాజరై మాట్లాడారు. ప్రపంచం ఆధునికత వైపు వేగంగా ప్రయాణిస్తోందని... అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థ రూపాంతరం చెందటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని అభిప్రాయపడ్డారు. పాలనలో తనకున్న సుదీర్ఘ అనుభవంలో సాంకేతికత ప్రభావాన్ని ఆయన ఉదాహరణలతో వివరించారు. కృత్రిమ మేధ, క్వాంటం ఆధారిత విద్యాసంస్థలు, పరిశ్రమలు భవిష్యత్తు రూపురేఖలు మార్చనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉద్యోగ అన్వేషకులుగా కాకుండా



ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా... ఎదగాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యాసంస్థల్లో జరిగే పరిశోధనలు సమాజంలోని అవసరాలకు పరిష్కారం చూపేవిగా ఉండాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యా సంస్థల కోసం 'ఏఐ మరియు క్వాంటం రోడ్‌మ్యాప్' ఆవిష్కరణ దిశగా రెండు రోజుల ఉపకులపతులు చర్చించారు. ఆరు రాష్ట్రాల నుంచి వచ్చిన 120 మంది ఉపకులపతులు, విద్యావేత్తలు, అధికారులకు ఆతిథ్యం ఇవ్వటం సంతోషంగా ఉందని ముంగింపు సమావేశంలో ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అన్నారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా జరిగిన చర్చలు, కార్యక్రమాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఏఐ మౌలిక సదుపాయాలు, క్వాంటం పరిశోధన సన్నద్ధత మరియు విద్యా సంస్థల మధ్య సమన్వయంపై జరిగిన మూడు ప్రత్యేక సాంకేతిక సెషన్ల సారాంశాన్ని ఆయన వివరించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యాసంస్థలు ఆధునిక సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవటం సహా పరస్పర భాగస్వామ్యంతో పరిశోధనల్లో పాల్గొనేందుకు ఈ సమావేశాలు ఎంతగానో తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు. ఇటువంటి ఉన్నత స్థాయి విద్యా చర్చలకు వేదికగా నిలవడంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తన బాధ్యతను భవిష్యత్తులోనూ కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. విద్యా అనుభవంలో అత్యాధునిక సాంకేతికతను మరియు పరిశోధనా నైపుణ్యాన్ని అంతర్భాగం చేయడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. నాలుగో పారిశ్రామిక విప్లవం సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రాంతీయ విశ్వవిద్యాలయాల మధ్య నిరంతర సహకారం అవసరమని స్పష్టం చేశారు. ఏఐయూ సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం చేసిన ఏర్పాట్లను అభినందించారు. ప్రభుత్వ రంగంలోని విశ్వవిద్యాలయం ఇంత అద్భుతంగా కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉందని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న ప్రొఫెసర్ నిర్మల్జీత్ సింగ్ కల్సి, ప్రత్యక్షంగా పాల్గొన్న జె.ఎన్.టి.యూ వీసీ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, పారిశ్రామికవేత్త డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి మాట్లాడుతూ... విశ్వవిద్యాలయ పాలనలో 'హ్యూమన్-సెంట్రిక్ ఏఐ' (మానవతా దృక్పథంతో కూడిన ఏఐ) మరియు స్పష్టమైన నియంత్రణలు పునాదిగా ఉండాలని పేర్కొన్నారు. వైస్-ఛాన్సలర్లు కేవలం నిర్వాహకులుగా కాకుండా 'పరివర్తనకు చోదకులుగా' మారి దేశ విద్యా భవిష్యత్తును దిశానిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు.

# పాఠశాలల్లో నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** జిల్లాలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్ లలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో మండల విద్యా అధికారులు, సమగ్ర శిక్ష విభాగంతో సమీక్షా సమావేశం జరిగింది. పీఎం శ్రీ పథకం, భవిత సెంటర్లు, కేజీబీవీ సివిల్ వర్క్స్‌తో పాటు పలు విద్యా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. భవిత సెంటర్ల నిర్మాణంలో జహీరాబాద్, మొగుడంపల్లి, కల్హేర్, కొండాపూర్ , మునిపల్లి, పుల్కల్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కేజీబీవీ భవనాల నిర్మాణాల్లో న్యాల్కల్, నాగలిగిద్ద, పుల్కల్, మనూర్, సిర్గాపూర్, వట్పల్లి ప్రాంతాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్‌లు, ఇతర భవన నిర్మాణాల పురోగతిని విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు విచారించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్ ఆర్ జి ఈ ఎస్ కింద మంజూరైన టాయిలెట్లను మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం శ్రీ బడ్జెట్, యు డి ఐ ఎస్ ఈ డేటా, ప్రీ-ప్రైమరీ పాఠశాలల అంశాలు కూడా సమావేశంలో పరిశీలించబడ్డాయి. సంబంధిత విభాగాలకు డేటా ఖచ్చితత్వం, పనితీరుపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## యువత విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** నేటి యువత విద్యతోపాటు అన్ని రంగాలలో ముందు ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శుక్రవారం బౌరంపేట్ కు చెందిన యువకుడు పలుపు నూరి తులసి రెడ్డి పర్వతారోహణలో పలు విజయాలు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ పర్వత ఆరోహణలో సాధించిన తులసి రెడ్డికి అభినందనలు తెలియజేశారు. యువత విద్యతోపాటు క్రీడలలో మెరుగైన నైపుణ్యాన్ని కలిగి ఉండాలని సూచించారు. రానున్న రోజులలో మరిన్ని విజయాలను సాధించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి మంచి గుర్తింపు తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, తులసి రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్'కు ఫ్రీడమ్ ఆయిల్ మద్దతు



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ తయారీదారులు), సేవా భారతి తెలంగాణతో దశాబ్ద కాలంగా ఉన్న తమ భాగస్వామ్యాన్ని విస్తరిస్తూ, సమాజంలో వెనుకబడిన, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన బాలికల విద్యను ప్రోత్సహించటానికి తమ భారీ వార్షిక కార్యక్రమం 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్'ను మార్చి 1న గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న ఈ పరు గులో ఎక్కువ మంది పాల్గొనడాన్ని ప్రోత్సహిం చడానికి తమ ఫిలాంత్రోపీ భాగస్వామి సత్వా గ్రూప్‌తో కలిసి ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించాయని జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమి టెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్, మార్కెటింగ్ పి.చంద్ర శేఖర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ మార్కె టింగ్ జనరల్ మేనేజర్ చేతన్ పింపాల్‌ఖుటే, సేవా భారతి, తెలంగాణ ఉపాధ్యక్షురాలు శ్రీమతి డాక్టర్ సుమలత తోకలసి ఆయన మాట్లాడుతూ 'రన్ ఫర్ ది గర్ల్ చైల్డ్' అనే కార్యక్రమం యొక్క ప్రభావా న్ని, ఈ పరుగులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ బాలిక జీవితం, సమాజంపై చూపే సహకారాన్ని ప్రధానం గా వెల్లడించటానికి ఈ ఫ్లాష్ మాబ్‌ను ప్రదర్శిం చినట్లు చెప్పారు. నాలెడ్జ్ రియాలిటీ ట్రస్ట్(కేఆర్ టీ) యొక్క మార్క్యూ ఆఫీస్ ఆస్తి అయిన సత్వ నాలెడ్జ్ సిటీలో ఫ్లాష్ మాబ్ నిర్వహించినట్లు చెప్పారు. ఇది అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించే కమ్యూనిటీ-ఆధారిత కార్యక్రమాలను ప్రారంభించడంలో ప్లాట్‌ఫామ్ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించిందని తెలిపారు.

## మంత్రిని కలిసిన జిల్లా టీఎన్జీఓల నూతన కార్యవర్గం



**మక్తల్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా టీఎన్జీఓ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహ రెడ్డి నేతృత్వంలో మంత్రిని సన్మానించగా, మంత్రి కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. జిల్లాలో తొలిసారి టీఎన్జీఓ యూనియన్ ఏర్పాటు కావడంపై మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ, జిల్లా కేంద్రంలో సంఘ భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే, జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి దామోదర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మిన్నంటిన శివాజీ జయంతి వేడుకలు



**తాండూరు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** పట్టణ పుర వీధుల్లో శివాజీ శోభాయాత్ర శోభాయమానంగా కొనసాగింది. గురువారం హిందూ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. శివాజీ జయంతి సందర్భంగా ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని కాళికాదేవి ఆలయం నుంచి భారీ శోభాయాత్ర చేపట్టారు. అక్కడి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శాంతి మహల్ చౌరస్తా, వినాయక్ చౌక్, ఇందిరాచౌక్, మల్లప్ప మడిగ మీదుగా శివాజీ చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో యువకులు శివాజీ మహారాజ్ కీ జై, జై శివాజీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగారం మల్లేశం, ఉమా మహేశ్వరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్, పూజారి పాండు, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, రజనీకాంత్, పర్యాద రామకృష్ణ, లింగదలి రవికుమార్, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, తదితర పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు తాండూరు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

- భార్య ఫిర్యాదు మేరకు కంపెనీ మేనేజర్‌పై కేసు నమోదు

**రేవల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** గోడౌన్ ఖాళీ చేస్తుండగా వ్యక్తికి విద్యుత్ షాక్ తగిలిన ఘటన గోపాల్ పేట్ మండలంలోని తాడిపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల మేరకు తేదీ 17.2.2026 రోజున మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తాడిపర్తి గ్రామ శివారులో గల కొండయ్య మెకానిక్ షెటర్లో గల విల్కాట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క గోడౌన్ ఖాళీ చేయుచుండగా మెట్టుపల్లి గ్రామానికి చెందిన పాండు (50), వృత్తి ఎలక్ట్రిషన్ ఆ యొక్క కంపెనీ బోర్డు మిద్దె మీద నుండి తీస్తుండగా అక్కడే ఉన్న 11 కెవి విద్యుత్ వైరుకు తగలడం వలన షాక్ కొట్టి అక్కడి పడిపోగా వెంటనే అక్కడ ఉన్నవారు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ లో ఉన్న అతని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక గోపాల్ పేట ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

## బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహారాజ్

- అదనపు కలెక్టర్ నగేష్
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**నర్సాపూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం సేవలాల్ మహారాజ్ 287 జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, స్థానిక ఎమ్మెల్యే సున్నిత లక్ష్మారెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు సేవాలాల్ మహారాజ్ ఆదర్శప్రాయుడన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడి వారి ఔన్నత్యానికి పునాదులు వేశారని సేవాలాల్ మహారాజులు కొనియాడారు. శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజని, ఆయన చూపించిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. ఈ ర్యాలీలు అదనపు కలెక్టర్ నగేష్ నిర్వాహకులతో నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పేదోడి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం



**శామీర్‌పేట్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** ఉద్దమర్రి గ్రామంలో రంగు లావణ్య వీరస్వామికి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంను మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశంతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన నూతన కౌన్సిలర్లు దోస కాయల లత వెంకటేశం, పెద్దిరెడ్డి శ్రీలత వెంకట్ రెడ్డి, రాజి గళ్ళ లత భూపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తుంకి వెంకటేశం, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నాగేష్, వెంకటరెడ్డి, భూపాల్, మాజీ ఉపసర్పంచ్ శ్రవణ్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతపై సామాజిక అవగాహన

**రాజాపూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** జిల్లా ఎస్.పి. జానకి ఆదేశాల మేరకు, మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలపూర్‌లో సురక్ష పోలీసు కళాబృందం, ఏ హెచ్ టియు టీం, మరియు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలోవిద్యార్థుల భద్రతపై సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి పెట్టి క్రమశిక్షణతో జీవిస్తే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. టీనేజ్ వయసులో అనవసరపు ఆకర్షణలకు, మోహ వ్యామోహాలకు లోనై విలువైన జీవితాన్ని, బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. చదువుకోవాల్సిన వయసులో చదువుపైనే దృష్టి పెట్టాలని, బాల్య వివాహాల వల్ల బాలికల జీవితం దుర్భరంగా మారుతుందని, అలాంటి ఘటనలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, పోక్సో చట్టం - 2012, సైబర్ భద్రత గురించి వివరించి, సోషల్ మీడియా ద్వారా అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టులు, వీడియో కాల్స్, ఫోటోలు షేర్ చేయడంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, అవసరమైతే "నో" అని స్పష్టంగా చెప్పడం, ఒంటరిగా ఉన్నప్పుడు అనుమానాస్పద పరిస్థితుల్లో సహాయం కోరడం చాలా ముఖ్యమని తెలిపారు. మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనప్పటికీ డయల్ 100 లేదా షీ టీం నంబర్ 8712659365, ఎహెచ్ టియు నంబర్ 8712680066 ను నిర్భయంగా సంప్రదించాలని అన్నారు.



కార్యక్రమంలో రాజాపూర్ ఎంఈఓ సుధాకర్ సుజాత ఎస్ఐ, శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బండి వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సురక్ష పోలీసు కళాబృందం సభ్యులు రాములు , జగదీష్ , టీం సభ్యులు జ్యోతి, వరప్రసాద్, ఈకార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 ఫిబ్రవరి 2026

# నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి
- మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ప్రారంభం



**సదాశివపేట, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** గత ప్రభుత్వ హయంలో పేద ప్రజలకు అన్యాయం జరుగుతే ప్రజా ప్రభుత్వం లో నిరుపేద ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచాడని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం సదాశివపేట మండలం అంకెన్ పల్లి, ఎల్లారం, కొల్కూర్, నిజాంపూర్, వెల్టూర్ గ్రామాలలో నిర్మాణం పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లను, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపనలను కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని అన్నారు. సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైంది అన్నారు. నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిర మైండ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉచిత కరెంటు, రేషన్ కార్డులు, సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాలకు అందిస్తున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధికి నోచుకోలేదని, అప్పుల తెలంగాణగా మార్చారని అన్ని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రేష్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బగ్గు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, సర్పంచులు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, కాంగ్రెస్ పార్టీ గ్రామల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సు



**మల్దకల్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** మండలం పరిధిలోని మేకలసోంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో హార్టికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్ హాజరు కాగా, ఈ సదస్సు గ్రామ సర్పంచ్ జయరాముడుఅధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రభుత్వం రైతులు సంప్రదాయ పంటల నుండి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లాలని, సాగులో మెళకువలుప్రభుత్వ మద్దతు గురించి వివరించారు. ప్రభుత్వం అధిక సబ్సిడీలతో పాటు గ్యారెంటీ ధరను కల్పిస్తోందని, తద్వారా దళారుల ప్రమేయం లేకుండా లాభాలు నేరుగా రైతులకే అందుతాయని వివరించారు. ఆయిల్ పామ్ ఒకసారి నాటితే 25 నుండి 30 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయాన్ని ఇస్తుందని, ఇది రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తుందని పేర్కొన్నారు. పూర్తి స్థాయి దిగుబడి 4వ సంవత్సరం నుండి గరిష్ట స్థాయిలో పంట వస్తుంది. మార్కెట్ స్థిరత్వం ఎకరానికి అధిక దిగుబడి రావడమే కాకుండా మార్కెట్ ఒడిదుడుకుల భయం ఉండదు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ ముద్దాడాని మంజునాథ్ యాదవ్, హెచ్ ఈవో మెగారెడ్డి, ఏఈఓ సానియా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి
- మహిళా సమైక్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



**సదాశివపేట, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలికల సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం సదాశివపేట మండలం ఎల్లారం గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు పావుల వడ్డీ రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, మహిళా సంఘాల సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

- బాధ్యతలు స్వీకరించిన మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు



**మక్తల్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, స్థానిక మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అండదండలతో మునిసిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు తెలిపారు. మున్సిపాలిటీలోని చైర్మన్ చాంబర్లో శుక్రవారం ఉదయం పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా వాకిటి మానస హనుమంతు బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్ పర్సన్ గా శైవిరెడ్డి సైతం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు మాట్లాడుతూ నియోజకవర్గం లో మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, మంత్రి చేపట్టిన అభివృద్ధిని చూసి మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజారిటీ అందించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సూచనల మేరకు మక్తల్ మున్సిపాలిటీకి అధిక నిధులను తీసుకువచ్చి, మంత్రి వాకిడి శ్రీహరి మార్గదర్శకత్వంలో మక్తల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, పురపాలక సిబ్బంది అందరి సహకారాలతో అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి గారి సతీమణి వాకిటి లలిత, మార్కెట్ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, అన్ని వార్డుల కౌన్సిలర్లు, నాయకులు చంద్రకాంత్ గౌడ్, గణేష్ కుమార్, రవికుమార్, కల్లూరి గోవర్ధన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి



**మల్దకల్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన వాయిదాల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, డిమాండ్ చేశారు. శుక్రవారంఅమరవాయి హైస్కూల్ లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూసిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వాయిదాల రూపంలో చెల్లించడం బాధాకరమని, ప్రభుత్వం సకాలంలో వీటిని చెల్లించకుండా వాయిదాల సంఖ్యను పెంచుకుంటూ పోవడం వల్ల ప్రస్తుతం అవి 60కి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాయిదాల ద్వారా రావలసిన మొత్తం సుమారు 1200 కోట్లకు చేరడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేస్తున్న 700 కోట్ల నిధులలో భాగంగా ప్రతి నెల తప్పనిసరిగా సీపీఎస్ బకాయిల కోసం కేటాయించాలని కోరారు. అలాగే గత ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని ఓపిఎస్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ నరేష్, కాంప్లెక్స్ సెక్రటరీ శాంతన్న, టిఎస్ ఈపిఎస్ఈ యు మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పుట్ట నాగరాజు, ఎస్టియు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, సుంకన్న, సీతంనాయుడు, శ్రీరాములు, భాస్కర్, శ్రీలత, రజిత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితునికి రిమాండ్



**నంగునూరు, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** దొంగతనం కేసులో నిందితుడు శివరాత్రి దివాకర్ తండ్రి శ్రీనివాస్ ని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించడం జరిగిందని దరాజగోపాల్ పేట ఎస్ఐ వివేక్ తెలిపారు. వివరాలు నంగునూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన ముక్కెర వెంకటేశం o/శీ పర్వతాలు అను అతను ఫిబ్రవరి 19 తేదీ గురువారం రోజు ఉదయం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి ఫిర్యాది చిన్నకోడూరు కి వెళ్ళగా తన భార్య కూలి పని నిమిత్తం పనికి వెళ్ళినది, తిరిగి ఫిర్యాదు సాయంత్రం 05:00 గంటలకు వచ్చే వచ్చేసరికి నిందితుడు శివరాత్రి దివాకర్ o/శీ శ్రీనివాస్ ఇంటి యొక్క తాళమును రాయితో పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న దాదాపు మూడు తులాలు గల ఒక బంగారు నెక్లెస్ మరియు రెండు బంగారు ఉంగరాలను దొంగతనం చేసినాడు .ముక్కెర వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు హెచ్ సి సంపత్, పోలీసులు రమేష్, ఆనంద్ ,తిరుపతి రెడ్డి నిందితున్ని పట్టుకొని మొత్తం ప్రాపర్టీ రికవరి చేసి తేది ఫిబ్రవరి 20 శుక్రవారం రోజు అరెస్టు చేసి కోర్టు నందు హాజరుపరిచి జ్యూడిషల్ పంపడం జరిగింది.

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

- పెద్ద శంకరంపేటలో ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహావిష్కరణ..



**పటాన్‌చెరు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** భక్తి మార్గం ద్వారానే మనిషికి సంపూర్ణ మానసిక ప్రశాంతత లభిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం ఉత్తులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు ఆధ్యాత్మికంగా వెల్లివిరిసినప్పుడే ప్రజల మధ్య సోదరభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పాడిపంటలతో గ్రామలు సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిరుడి శ్రావణిసాయిలు, మాజీ సర్పంచ్ మంద మల్లేష్, సతీష్, పెంటయ్య, దుర్గయ్య, బ్యతయ్య, చంద్రయ్య, సాయిలు, దశరథ్, సాయిలు, సంగయ్య, అశోక్, రాములు, పెంటన్న, ఈర గౌడ్, ఉత్సవ నిర్వహకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీబీ బ్యాంక్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

- రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న డీసీసీబీ బ్యాంక్ లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను కోరారు. శుక్రవారం రైతు సంగం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ సంగారెడ్డి డీసీసీబీ బ్యాంక్ లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని ప్రభుత్వంను కోరారు. రైతుల నుండి అదనంగా 1% డబ్బులు వసూలుచేసిన డీసీసీబీ బ్యాంక్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా లో ఇప్పటికే రైతులు పంటలు నష్ట పోయి తీవ్ర ఇబ్బందులలో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విదంగా ఆర్ బి ఐ, నాబార్డ్ నిబంధనలు అతిక్రమిస్తూ జిల్లాలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అదనంగా వసూలు చేసిన సుమారు 8 కోట్ల రూపాయలు రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్, వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, సహాయ కార్యదర్శి యస్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి, విట్టల్, మాణిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రభుత్వం లక్ష్యం



**తెలకపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** గ్రామాల సంక్షేమం అభివృద్దే తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన ప్రభుత్వం లక్ష్యమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలానికి చేరుకున్నవారు మండలం పరిధిలోని కార్వంగ గ్రామంలో మంజూరైన నూతన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్వంగ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన రవాణా సదుపాయం కలుగుతుందని అన్నారు. అనంతరం పులిజాల నుండి కార్వంగ గ్రామం మధ్య ఉన్న వాగు కారణంగా రైతులు మరియు గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించిన వారు త్వరలోనే ఆ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

# పది పరీక్షల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ సమీక్ష




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీలు మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో 10వ తరగతి పరీక్షల సన్నద్ధతపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఐఏఎస్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) గోవిందరాజు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ పాఠశాలల పనితీరును వివరంగా సమీక్షించారు. పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న టాప్ 10 పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ సబ్జెక్టు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల పరీక్ష ఫలితాలు, ఉపాధ్యాయుల పనితీరుపై నిరంతర సమీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు సాధిస్తున్నారో గుర్తించి, ఆ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పనితీరు బాగా లేని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులతో వెంటనే సమావేశాలు నిర్వహించాలని డీఈఓని ఆదేశించారు. కఠినమైన గణితం, భౌతికశాస్త్రం వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి, వారు మంచి మార్కులతో పాస్ అయ్యేలా వివరణాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. త్వరలోనే (26.02.2026న) నిర్వహించనున్న ప్రీ-ఫైనల్ పరీక్షల ఫలితాల సమావేశంలో మెరుగైన పనితీరు కనబరచాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలని డీఈఓకి సూచించారు. అన్ని ప్రధానోపాధ్యాయులు ప్రీమియర్ స్కాలర్‌షిప్‌లలో విద్యార్థుల రిజిస్ట్రేషన్‌ను సోమవారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మండల కేంద్రాల్లో 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించాలని ఎంఈఓలకు సూచించారు. డీసీఈబీ సెక్రటరీ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ... పదవ తరగతి వార్షిక పరీక్షల మధ్యలో ఉన్న నాలుగు రోజుల వ్యవధిని విద్యార్థులు కీలకంగా వినియోగించుకోవాలని వివరించారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా జిల్లాలో 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కీలక చర్యలు చేపట్టాలనే జిల్లా అధికారుల కు సూచించడం జరిగింది. ఈ సమావేశంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో/కొల్చారం, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకుని, సబ్జెక్టులను ఎలా అభ్యసించాలి, మంచి మార్కులు ఎలా సాధించాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి పలికి, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తూచా తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని, టీవీ, మొబైల్ ఫోన్, సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉమా రాణి, గ్రామ సర్పంచ్ దయాకర్ గౌడ్, ఎం.ఆర్.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పెరుమాండ్ల చిట్‌ఫండ్ పేరుతో మోసం



- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- బిఎస్ఎస్ అధ్యక్షులు మారపల్లి క్రాంతి కుమార్

**శాయంపేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** శాయంపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మారపెల్లి క్రాంతి కుమార్ బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ పెరుమాండ్ల చిట్ ఫండ్ యజమాని పెరుమాండ్ల కిషోర్ రెడ్డి చిట్ ఫండ్ ప్రారంభించి ,వందల మంది పేద ప్రజల దగ్గర చిట్టీల పేరుతో డబ్బులను వసూలు చేసి, కోట్ల రూపాయలు వసూలు చేసుకొని పేద వారు దాచుకున్న సొమ్మును వారికి ఇవ్వకుండా, ఐపీ పెట్టి పారిపోవడాన్ని కండిస్తూ, బాధితులకు అండగా బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాయంపేట పోలీస్ స్టేషన్ లో బాధితులతో కలిసి చిట్ ఫండ్ యజమాని పైన కేసు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను కోరడం జరిగిందని తెలిపారు. కిషోర్ రెడ్డి పేద ప్రజల దగ్గర చిట్టిల పేరుతో వసూలు చేసిన డబ్బులను తన బినామీల పేరు మీద, తన కుటుంబ సభ్యుల పేరు మీద ,ఆస్తులను కొనుగోలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. పేద ప్రజలు వారి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారు సంపాదించిన సంపాదనలో కొంత మొత్తాన్ని చిట్టి పేరుతో దాచుకొని వారి పిల్లల చదువులకు లేదా పెళ్లిళ్లకు లేదా గృహ నిర్మాణాలకు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయని ఆశపడి వారి కష్టాన్ని పెరుమాళ్ళ చిట్ ఫండ్ లో పెట్టడం జరిగింది, కానీ ఏమాత్రం మానవత్వం లేకుండా కనీస కనికరం లేకుండా ప్రజల సొమ్మును తిరిగి ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు, లేదా ఇతర దేశాలకు వెళ్లే ప్రమాదం ఉంది అని, కాబట్టి తక్షణమే అతనికి ఉన్నటువంటి పాస్ పోర్ట్ రద్దు పరిచే చర్యలు తీసుకొని ,ఇతర దేశాలకు వెళ్లకుండా ఆపాలని పోలీసు వారిని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు గజ్జి శ్రీనివాస్, సిలువేరు శ్రీనివాస్, పరకాల రవి, రత్నమాల, వినయ్, వీణాచారి, రఘుపతి రెడ్డి, శ్రీవాణి, నాయకులు మొగ్గం సుమన్, విజయ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వ్యవసాయ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో వ్యవసాయ యాంత్రీకరణ, భూసార పరీక్షలు, జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్, రైతు నేస్తం, డిజిటల్ వ్యవసాయ మిషన్, కేంద్ర ప్రభుత్వ పథకాలకు రైతుల నమోదు, సహజ వ్యవసాయంపై జాతీయ మిషన్, పిఎం కిసాన్, ఎరువుల విక్రయాలపై యాప్ పై అవగహన, రైతు బీమా తదితర వ్యవసాయ అంశాలపై గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నూరు శాతం అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్న, చిట్టచివరి రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి దూరం కాకుండా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా కార్మిక వ్యయాలు తగ్గించి దిగుబడులు పెంచే విధంగా రైతులను ప్రోత్సహించాలని, భూసార పరీక్షల ద్వారా సరైన ఎరువుల వినియోగంపై రైతులకు అవగహన కల్పించాలని తెలిపారు. జాతీయ ఆహార భద్రత పోషకాహార మిషన్ కింద పంటల ఉత్పాదకత పెంపు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. డిజిటల్ వ్యవసాయ మిషన్, పిఎం కిసాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలలో అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తిచేయాలని, నమోదు చేసుకున్న రైతులకు రైతు బీమా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. రైతు నమోదు చాలా తక్కువగా ఉందని వారంలో పూర్తి చేయాలని స్పష్టంచేశారు. సహజ వ్యవసాయంపై జాతీయ మిషన్ కింద రసాయన రహిత సాగుకు రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. యూరియా కొరకు రైతులు యాప్ ద్వారా నమోదుకు రైతు వేదికల్లో అవగహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువుల నాణ్యత నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నకిలీ విత్తనాలు, ఎరువులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వ్యవసాయ రంగం జిల్లా ఆర్థికాభివృద్ధికి కీలకమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీపాల్, రమేష్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యా ప్రమాణాల పెంపు, సౌకర్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలి..**

విద్యా ప్రమాణాల పెంపు, సౌకర్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8 పాఠశాలలు పీఎం శ్రీకి ఎంపికైనట్లు తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల ద్వారా విద్యా ప్రమాణాలను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పీఎం శ్రీ పథకంలో ఎంపిక చేసి ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు విద్యార్థులకు సైన్స్, రీసెర్చ్ రంగాల్లో శిక్షణ, క్షేత్ర పర్యటనలు, ఇండస్ట్రియల్ విజిట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు, క్రీడా సామగ్రి, బోధనా సామగ్రి, విద్యార్థులకు ఐడీ కార్డులు, బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్, వృత్తి విద్యా పరికరాలు, చైల్డ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ చర్యలు, విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ (కరాటే) శిక్షణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఈ నెలాఖరులోగా అవసరమైన సామగ్రి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు ఆధారిత హాజరు 100 శాతం నమోదు అయ్యేలా జిల్లా విద్యాశాఖ అధికారి నుండి మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, పిఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ములుకనూర్ సొసైటి అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి జాతీయ స్థాయి పురస్కారం




**భీమదేవరపల్లి:ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** భీమదేవరపల్లి మండలంలోని ములుకనూర్ సహకార సొసైటి అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు,సుస్థిర పద్ధతుల అమలులో విశేష కృషి చేసినందుకు జాతీయ స్థాయి ఘన సత్కారం లభించింది.గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రికల్చర్ ఇన్నోవేషన్ కాంగ్రెస్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు.ఈ కార్యక్రమం శుక్రవారం తాజా ల్యాండ్స్ ఎండ్‌లో జరిగింది. వ్యవసాయ రంగంలో సాంకేతిక ఆధారిత పద్ధతులను ప్రోత్సహిస్తూ ఖచ్చితమైన సాగు విధానాలను రైతులకు పరిచయం చేయడంలో ప్రవీణ్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారు.డ్రోన్లు, అంతర్జాల అనుసంధాన పరికరాలు,భౌగోళిక సూచిక విధానాల ద్వారా అవసరమైన ప్రాంతాల్లోనే నీరు, ఎరువులు వినియోగించే పద్ధతులను అమలు చేస్తున్నారు.కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికత సహాయంతో వాతావరణ మార్పులు చీడపీడల ఉద్భవాన్ని ముందుగానే అంచనా వేసి రైతులకు తగిన సూచనలు అందిస్తున్నారు. విత్తనాల ఎంపిక నుండి పంటల విక్రయం వరకు సమగ్ర సేవలు అందించే వ్యవసాయ సాంకేతిక సంస్థలతో అనుసంధానం కల్పించి రైతులకు మద్దతు అందిస్తున్నారు. సేంద్రియ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ రసాయనాల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించే చర్యలు చేపట్టారు.బిందు మరియు సూక్ష్మ సేద్య విధానాల ద్వారా నీటి వృథాను అరికట్టడంలో ప్రత్యేక దృష్టి సారించారు.సమగ్ర చీడపీడల నియంత్రణ పద్ధతుల ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా జీవ నియంత్రణ మార్గాలను అమలు చేస్తున్నారు. ఈ చర్యల ఫలితంగా తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధ్యమవుతూ రైతుల ఆదాయం పెరుగుతోంది. నేల, నీరు,గాలి కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. ములుకనూర్ సొసైటి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా పార్థసారథి ప్రతిమ దాస్ చేతుల మీదుగా ప్రవీణ్ రెడ్డికి పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ నిపుణులు,రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేయూ పద్మక్షి లేడీస్ హాస్టల్ సి బ్లాక్‌లో 3 నెలలుగా నీటిఎద్దడి

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పరిపాలన భవనం ముందు ధర్నా




**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో పద్మక్షి లేడీస్ హాస్టల్ సి బ్లాక్ లో గత మూడు నెలల నుండి వాటర్ రాక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు శుక్రవారం ఎస్ఎఫ్ఐ పిడిఎస్ యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పరిపాలన భవనం ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మూడు నెలల నుండి పద్మాక్షి లేడీస్ హాస్టల్ సి బ్లాక్ విద్యార్థులకు వాటర్ రాక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు ఈ సమస్య పై గత రెండు మూడు నెలల క్రితమే హాస్టల్ డైరెక్టర్ కి రిజిస్టర్ కి జేడీలకు కేర్ టేకర్లకు చెప్పిన పట్టించుకోలేదన్నారు విద్యార్థులు పక్క హాస్టల్ కి వెళ్లి బకెట్లు పట్టుకొని వాటర్ తెచ్చుకొని వాడుకుంటున్నారన్నారు ఇంత జరుగుతున్న కూడా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు అలాగే హాస్టల్లో వాష్రూమ్స్ శానిటైజేషన్ లేదన్నారు వర్కర్స్ కూడా రెగ్యులర్గా హాస్టల్ శుభ్రపరచడానికి కూడా ఎవరు రావడం లేదన్నారు ఈ విషయంపై స్పందించిన యూనివర్సిటీ రిజిస్టర్ రామచంద్రం ధర్నా చేస్తున్న విద్యార్థుల విద్యార్థి సంఘాల నాయకుల దగ్గరికి వచ్చి రెండు మూడు రోజులలో అన్ని విధాల వాటర్ సౌకర్యం కల్పిస్తానీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయికుమార్ బిరెడ్డి జస్వంత్ రణదీప్ రాహుల్ సాయి మల్లేష్ పవన్ ప్రవళిక మౌనిక శిరీష అనూష విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## పేదలకు వరం ఇందిరమ్మ ఇల్లు మంజూరు

- మాజీ కౌన్సిలర్ ముంజాల రవీందర్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం పేదలకు వరమని మాజీ కౌన్సిలర్ ముంజాల రవీందర్ గౌడ్ అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కారల్ మార్క్స్ కాలనీ కాపువాడలో ఎండి ఫరీదాకు, మాజీ కౌన్సిలర్ రవీందర్ గౌడ్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి, శుక్రవారం ముగ్గు పోయించారు. పేదల పెన్నిధి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ ముంజాల రవీందర్ చేతుల మీదుగా టెంకాయ కొట్టి పని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాలుగో వార్డు అధ్యక్షులు సునీల్ కుమార్, ముష్క రమేష్, కస్తూరి రమేష్, బాలాజీ యూత్ నాయకులు వాసు, సంజు, వాడ పెద్దమనుషులు శ్రీనివాస్, సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆయన కళ్లు సజీవం

- నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 20, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంపు బస్తికి చెందిన విశ్రాంత సింగరేణి ఉద్యోగి బింగి అశోక్ కుమార్ 63 సంవత్సరాల వయస్సులో మరణించగా ఆయన కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా నేత్రదానం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు పంచాలని భావించారు. నేత్రదానం చేయడానికి ముందుకు రావడంతో సదశయా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి సహకారంతో ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది ప్రదీప్ నేత్రాలని స్వీకరించారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ బింగి అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉన్నకూడా భార్య బింగి రాజ కుమారి, కుమారులు బింగి శ్రావణ్ కుమార్, సంతోష్ కుమార్, తల్లి బింగి వెంకమ్మ, సోదరుడు బింగి మల్లేష్ సహకారంతో నేత్రదానానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. వారి స్ఫూర్తితో ప్రజలందరు మరణించిన తరువాత నేత్ర, అవయవ, శరీరాలు కాల్చి బూడిద అయి వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కళ్లలోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని అన్నారు. బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని వివరించారు. శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అందించి కొన్ని వేల మంది వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్సకు ఉపయోగపడే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం అనంతరం కుటుంబ సభ్యులకు ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంక్ నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీలి కృష్ణ, సామాజిక కార్యకర్త గజెల్లి మోహన్, జనహిత సేవా సమితి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల రమాదేవి, ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు డోలి సుకుమార్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల ప్రజలు ప్రాపర్టీ టాక్స్ బకాయిలు సత్వరమే చెల్లించాలి


- నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** మునిసిపాలిటీల ప్రజలందరూ తమ ప్రాపర్టీ టాక్స్ ను వెంటనే చెల్లించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, బైంసా మూడు మునిసిపాలిటీలలో ప్రాపర్టీ టాక్స్ బకాయిలు ఎక్కువగా పేరుకుపోయాయని ఆయన తెలిపారు. ప్రాపర్టీ టాక్స్ బకాయిలు ఉన్న ప్రజలంతా విధిగా తమ పన్నులను చెల్లించాలని వివరించారు. ప్రాపర్టీ టాక్స్ వసూలు కొరకు మూడు మునిసిపాలిటీలలో సోమవారం నుంచి, నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజలు పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పన్నులు చెల్లించని వారికి నోటీసులు అందించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. పన్నుల చెల్లింపు ద్వారా, మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యపడుతుందని వివరించారు. కావున మూడు మునిసిపాలిటీల ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి తమ బకాయి పన్నులను చెల్లించాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

- ముఖ్యఅతిథిగా హాజరైన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి



**నెక్కొండ, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** నెక్కొండ మండలం కేంద్రంలోని పత్తిపాక తండా లో బోడ రజిత లక్ష్మణ్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుమల్, నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్, షేక్ షబ్బీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్ సీనియర్ నాయకులు చల్లా పాపిరెడ్డి, ఇండ్ల రవి, పత్తిపాక సర్పంచ్ లావుడ్య సామ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాల సమస్యలు పెద్దవి కాదు

- సమస్యల పరిష్కారంలో మా తప్పేం లేదు
- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్




**ఖానాపూర్ ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** బంజారాలు తన ముందు ఉంచిన సమస్యలు పెద్దవి కావని అన్ని చిన్న సమస్యలే అని అసాధ్యమైనవేమీ కావని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రం పొలిమేరలోని మైదానంలో జిల్లా స్థాయి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అధ్యక్షత వహించగా బంజారా సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, బిజెపి ప్రతిపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మటి, మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖ నాయక్ లు పాల్గొన్నారు. మొదటగా బంజారాలు డీజే చప్పుళ్లతో ప్రధాన దారి పొడవునా తెలంగాణ తల్లి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడి నుండి సభా స్థలికి చేరుకున్నారు. మొదటగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి బోగ్ బండారు ను నిర్వహించి అర్చకులచే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అతిథులు బంజారా నాయకులు సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా బంజారాలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధుల ముందు ఉంచారు. స్పందించిన బిజెపి ప్రతిపక్ష నాయకుడు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తన ప్రసంగంలో బంజారాల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అధికారంలో లేకపోయినా ప్రతిపక్షంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం సభాధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడారు. ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేసి తండాల నుండి బంజారాలను తరలించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం బంజారాలను గుర్తించి సేవాలాల్ జయంతిని ఒక పండగలా నిర్వహించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిందని దానిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని, బాసరలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి తనవశీతు కృషి చేస్తానని ఈ సందర్భంగా బొజ్జు పటేల్ హామీ ఇచ్చారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని నల్లమల అడవుల్లో ప్రత్యేక ఆలయాన్ని నిర్మించి 20 ఎకరాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. ప్రతి ఒక బంజారా ఆలయాన్ని సందర్శించాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే బంజారాలు ఎక్కడ ఉన్న పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉన్నత ఉద్యోగాలు అనుభవించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అన్నారు. ఆశ్రమ గిరిజన పాఠశాలలో సైతం కాస్మెటిక్స్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తన నియోజకవర్గ పరిధిలో భారీ మొత్తంలో నిధులను వెచ్చించి ప్రత్యేక లైబ్రరీని ఏర్పాటు చేస్తానని అన్నారు. ప్రతి ఒక్క శాసనసభ్యుడు వారి వారి నియోజకవర్గ స్థాయిలో ఒక భారీ లైబ్రరీ ఏర్పాటు చేయాలని విద్యార్థులకు లైబ్రరీ ఎంతో ఉపకరిస్తుందని స్పష్టం చేశారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవానికి జిల్లా స్థాయిలో బంజారాలు భారీగా తరలిరాగా బంజారా వేషధారణతో చిన్నారులు, మహిళలు చేసిన సాంప్రదాయ నృత్యాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రాథోడ్ తుకారాం నాయక్, సభ్యులు జాదవ్ వెంకట్రావు, భుఖ్య గోవింద్ నాయక్, ప్రేమ్ సింగ్, రాజేశ్వర్ నాయక్, మాజీ జెడ్పిటిసి రాథోడ్ రాము నాయక్, అపావత్ రాజేందర్, కిషన్ నాయక్, చంద్రశేఖర్ నాయక్, రాజేష్ నాయక్, అశోక్ నాయక్, రాజేష్ బాబు, సిద్ధార్థ నాయక్, వాల్ సింగ్ లతోపాటు బంజారా ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘ భవనానికి మరో పది లక్షలు

- ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

**లక్ష్మణచాంద, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** మండలంలోని రాచాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనం నిర్మాణం కొనసాగుతోంది. గతంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించారు. మరింత నిర్మాణం చేపట్టే దిశగా మరో పది లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్డిఎఫ్ నిధుల కింద ఐదు లక్షలు, ఎంపీ నిధుల కింద ఐదు లక్షల రూపాయలను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బన్నేపోయిన పోశెట్టి, నాయకులు బన్నబోయిన పోశెట్టి, బన్నేబోయిన రాజన్న, భూసి పెంటాజి, భూసి సురేష్, గజ్జల బోర్రన్న, తదితరులు పాల్గొన్నారు.



# సీఎంకప్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కాసిపేట గురుకుల విద్యార్థులు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీలకు కాసిపేట గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వుటూరి సంతోష్ కుమార్ తెలిపారు. నేటి నుంచి 23 వరకు ఖమ్మం జిల్లాలో నిర్వహించే సీఎంకప్ రెండవ ఎడిషన్ 2025 రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకులకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో జి ఆవిష్కార్, ఎన్ఆర్ ఈశ్వర్, జి అజయ్, జీ సాయిచరణ్, ఎం శివకుమార్, డి స్నేహిత్ ఉన్నారు. వీరు జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వూటూరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ సీఎం కప్ ఆశయానికనుగుణంగా రూరల్ టూ గ్లోబల్ నినాదాన్ని పూర్తి చేస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమం పీడీ కె హరీష్, పిఈటీ ఏ రాజేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 ఫిబ్రవరి 2026

# బాల్య వివాహాలను అరికట్టడానికి విద్యే ప్రధాన సాధనం



**హాలియా, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** అనుముల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశంశుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. మండల తహసిల్దార్ రఘు, సీఐ సతీష్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనయ్య, వైద్యాధికారి, జిల్లా న్యాయ సహాయాధికారి వెంకన్న, ఐసీడీఎస్ పర్యవేక్షకులు రమాదేవి, సరిత, బాలల పరిరక్షణ విభాగ ప్రతినిధి మహేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో బాల్య వివాహాలు, చిన్నారులపై లైంగిక నేరాల నిరోధక చట్టం అమలు, అక్రమ దత్తతలు, స్కూల్ డ్రాప్ అవుట్ వంటి అంశాలపై చర్చించారు. మార్చి 13వ తేదీ లోపు ఏవైనా సమస్యలు ఎదురైతే చర్చించి జిల్లా, విభాగ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. బాల్య వివాహాలు, అక్రమ దత్తతలు, చిన్నారులపై దుర్వినియోగం లేని మండలంగా తీర్చిదిద్దాలని అధికారులు సంకల్పించారు. మండల రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష లేకుండా చూడాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి విద్యే ప్రధాన సాధనం అన్నారు. ఆడపిల్లలు చదువును మధ్యలో ఆపకుండా అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసితే వెంటనే 1098 బాలల సహాయ సేవకు సమాచారం అందించాలని వివరించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించి వ్యాసరచన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇంచార్జి లక్ష్మారెడ్డి, ఎం ఆర్ వో రఘు, ఎంఈఓ శ్రీనయ్య, అనుముల మండల సిడిపిఓ విజయలక్ష్మి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లీగల్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకన్న, హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రమాదేవి సరిత, మండల మహిళా శక్తి సాధికారత శ్రీదేవి, సీసీ సైదయ్య, ఐసీపి ఎస్. మహేష్. కేజీబీవీ ప్రిన్సిపల్ హైమావతి టీచర్స్ సుజాత అనూష బేబీ తదితరులు పాల్గొన్నారు. మహిళా శక్తి సాధికారత ప్రతినిధులు శ్రీదేవి, సైదయ్య, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, ఉపాధ్యాయులు సుజాత, అనూష, బేబీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** సూర్యాపేట నూతన మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన మొరిశెట్టి నివేదిత లక్ష్యాది శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ పాల్గొన్నారు.

## యూరియా ఇస్తారా..ఆత్మహత్య చేసుకోవాలా..



**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ గ్రామాలలో సరిపడా యూరియా అందక రైతులు ఆవేదన చెందుతున్న ఘటనలు అనేకం కనిపిస్తున్నాయి. శుక్రవారం మండలంలోని సర్వేల్ గ్రామంలో యూరియా ఇస్తారా ఆత్మహత్య చేసుకోవాలా అంటూ దామోదర్ రెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎరువులు లేక పంటలు ఎండిపోతున్నాయని, చదువురాని తమను యాప్ లో బుక్ చేసుకోమంటే ఎక్కడికెళ్లాలని, బోరున విలపించాడు. పంటను కాపాడుకోవడం కోసం రైతు తల్లడిల్లిన విధానాన్ని చూసి అందరి రైతులు చాలా బాధపడ్డారు. వెంటనే ఈ విషయంపై అధికారులు స్పందించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మట్టా రాగమయి



**కల్లూరు, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి దయానంద్ స్పష్టం చేశారు. శుక్రవారం కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన మునగంటి లీలావతి శ్రీను దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరైనారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రాగమయి స్థానిక ఏఎంసి చైర్మన్ భాగం నీరజాదేవి, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, మునిగంటి లీలావతి శ్రీను దంపతులతో కలిసి నూతన గృహప్రవేశాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సత్యనారాయణ స్వామి వ్రత పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి ను తమ ఇంటి ఆడపడుచు గా భావించి లీలావతి శ్రీను దంపతులు ఎమ్మెల్యేకి చీర సారే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శ్రీను లీలావతి దంపతులను శాలువాతో సన్మానించి రాష్ట్ర ప్రభుత్వం చిత్రపటం మెమొంటోను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రెండో విడత ఏప్రిల్ లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పులిసాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కినేని కృష్ణ, పసుమర్తి చందర్రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, దేవరపల్లి మంగపతి రావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు,పొట్రూ అర్జున్ రావు, తక్కెళ్ళ పాటి దుర్గాప్రసాద్, మద్దినేని లోకేష్ , షేక్ ఉస్మాన్ ,పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత చాటుకున్న 108 సిబ్బంది..



**గుర్రంపోడు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ప్రమాదంలో చిక్కుకున్న బాధితుల ప్రాణాలు కాపాడటమే కాకుండా, వారి వద్ద ఉన్న లక్షన్నర రూపాయల నగదును తిరిగి అప్పగించి గుర్రంపోడు అత్యవసర వాహన (108) సిబ్బంది తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ గొప్ప కార్యానికి గుర్తింపుగా నల్లగొండ జిల్లా రక్షక భటాధికారి శరత్ చంద్ర పవార్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో వారిని అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఘటన వివరాలు:ఈ నెల 9వ తేదీన గుర్రంపోడు మండలం జూనుతల మజిలీ వద్ద ఒక శకటం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే అత్యవసర వాహన సిబ్బంది, వైద్య సహాయకులు వెలుగు సత్యనారాయణ, వాహన చోదకులు మారేపల్లి వెంకటేశ్వర్లు వేగంగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు వాహనంలోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ, వారిని సురక్షితంగా దేవరకొండ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అదే సమయంలో బాధితుడి వద్ద ఉన్న రూ. 1,50,000 నగదును భద్రపరిచిన సిబ్బంది, ఆ మొత్తాన్ని బాధితుడి బంధువులకు బాధ్యతాయుతంగా అందజేశారు. అందరికీ ఆదర్శం:ఈ సందర్భంగా జిల్లా రక్షక భటాధికారి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడటంతో పాటు, ధనం పట్ల ఎటువంటి ఆశ లేకుండా నిజాయితీని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇలాంటి నిస్వార్థ సేవలు సమాజానికి, అన్ని ప్రభుత్వ విభాగాల వారికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యక్రమ నిర్వాహకులు షేక్ సలీం మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

- చంద్రధన సర్పంచ్ సొల్లు రంగమ్మ సుధాకర్



**తలకొండపల్లి ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** మండల పరిధిలోని చంద్రధన గ్రామపంచాయతీలో శుక్రవారం సర్పంచ్ సొల్లు రంగమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.గ్రామ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సభను నిర్వహించగా గ్రామానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.గ్రామంలో మౌలిక వసతుల కల్పన,పారిశుద్ధ్య నిర్వహణ,తాగునీటి సరఫరా,విద్యుత్ దీపాల సంరక్షణ,డ్రైనేజ్ సమస్యలు,సీసీ రోడ్ల నిర్మాణం,విద్యుత్తు లైన్ పునరుద్ధరణ సమస్యల తో పాటు ఆవశ్యకతను గుర్తించి సభలో వెల్లడించారు.గ్రామస్తుల అభిప్రాయాలను సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు శ్రద్ధగా విని నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ రంగమ్మ మాట్లాడుతూ..గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు తగు చర్యలను చేపడుతామని తెలిపారు. గ్రామ సభలో చర్చించిన అంశాలు,తీసుకున్న నిర్ణయాలకు వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రవీందర్ రెడ్డి,పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్,వార్డు సభ్యులు,జిపిఓ నరసింహ,గ్రామ వ్యవసాయ అధికారి శ్రీనాథ్ రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ మంగమ్మ,పల్లె దావకాన డాక్టర్ నందిని,ఆశా వర్కర్లు,గ్రామ పెద్దలు,యువకులు,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతుల పథకం ప్రాజెక్టును పరిశీలించిన కాంగ్రెస్ బృందం



**మధిర, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర మండలంలోని వంగవీడు గ్రామం వద్ద వైరా నదిపై 630 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన జోవహర్ ఎత్తిపోతల పథకం పనులను శుక్రవారంఇరిగేషన్ డి ఈ ఈ నాగబ్రహ్మం తో కలిసి ప్రాజెక్ట్ మ్యాప్ ను పరిశీలించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు మాట్లాడుతూ జవహర్ ఎత్తిపోతలతో.చివరి భూములకు జలసిరి ఖమ్మం జిల్లా లోని సాగర జలాలకు చివరి ఆయకట్టుగా ఉన్న మధిర ఎర్రుపాలెం మండలాలకు ప్రస్తుతం సాగర్ జలాలు మూడో జోన్ లో సరఫరా అవుతున్నాయి.ఈ రెండు మండలాలకు సాగర్ నీటిని రెండోజోన్ లో సరఫరా చేసేందుకు వీలుగా. రెండు మండలాలకు సాగర్ జలాలను రెండో జోన్ నుంచి తరలించేందుకు మధిర మండలంలోని వైరా నదిపై వంగవీడు గ్రామంలో 630 కోట్ల రూపాయలతో మధిర, ఎర్రుపాలెం మండలంలోని ఉన్న రైతులకు మేలు చేసే విధంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గత సంవత్సరం ఆగస్టు నెలలో శంకుస్థాపన భూమి పూజ చేసినారు. అట్టి పనుల్లో భాగంగా ఇప్పటికే భూ సేకరణ కార్యక్రమం పూర్తిచేసుకుని పంప్ హౌస్ లో నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి వచ్చే సంవత్సరం నాటికి ఈ పని పూర్తి చేసి సుమారు 50 వేల ఎకరాలకు సాగర్ జలాలు అందిస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,వైస్ చైర్మన్ అవులూరు సత్యనారాయణ రెడ్డి,సర్పంచ్ సిద్దిపోగు ప్రసాద్,ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి,అనుమోలు వెంకటకృష్ణారావు, చొప్పకట్లపాలెం సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి,డైరెక్టర్లు బాణావత్ రమణ నాయక్,గుడేటి బాబురావు,అద్దంకి రవికుమార్,మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు,వెంకయ్య బాబు,నిడమానూరు వంశీ,తూమాటి నవీన్ రెడ్డి,పతేపురపు సంగయ్య,బిట్ర ఉద్దండయ్య,మైలవరపు చక్రి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ కులాల రైతులకు పరికరాలు పంపిణీ



**చేర్యాల, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** షెడ్యూల్ కులాల గొప్ప ప్రణాళిక ఎస్సీ ఎస్పీ కింద మెరుగైన మక్కా సైలజ్ పద్ధతుల ప్రచారం ద్వారా మెరుగైన మేత భద్రత అనే శిక్షణ కం ఇన్ పుట్ పంపిణీ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆకునూరు గ్రామ షెడ్యూల్ కులా రైతులకు శుక్రవారం ప్రతి రైతుకు బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్, ఒక టార్పాలిన్, ప్లాస్టిక్ షీట్, పార అందజేశారు. ఈ కార్యక్రమానికి వింటర్ నర్సరీ సెంటర్ ఐసిఆర్ ఐఎన్ఆర్ ఇన్చార్జి డాక్టర్ ఎన్. సునీల్ నాయకత్వం వహించి మాట్లాడుతూ.. షెడ్యూల్ కులాల రైతులను సామర్థ్యాభివృద్ధి సమయానుకూల ఇన్పుట్ మద్దతు ద్వారా శక్తివంతం చేయడంలో ఈ పథకం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం లబ్ధిదారులకు పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి, రాంపూర్ సర్పంచ్ శెట్టె కొమురయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ జక్కుల తిరుపతి, డాక్టర్ సునీల్, డాక్టర్ యతీష్, ఏడీఏ రాధిక, మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర్, ఏఈవో పూజ, గ్రామపంచాయతీ పాలకవర్గం, రైతులు, పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలే లక్ష్యం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం మైలర్ దేవ్‌పల్లి డివిజన్‌లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సుమారు రూ.9.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నదని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ దశలవారీగా పరిష్కరిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, ప్రేమ్ గౌడ్, అడికే రాజు తదితరులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మిది హత్యా..? ఆత్మహత్యా..?

- హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటున్న కుటుంబసభ్యులు
- నేరస్థులను రిమాండ్ చేస్తామన్న ఎస్ఐ లింగారెడ్డి

**నాంపల్లి, ఫిబ్రవరి 19 (జనం సాక్షి) :** నాంపల్లి మండలంలోని నేరాళ్లపల్లి గ్రామానికి చెందిన గోదాసు ధనలక్ష్మి తన అమ్మగారి ఇంట్లోగల బాత్రూంలో ఉరి వేసుకొని చనిపోయి కనిపించింది.ఆత్మహత్య చేసుకొని చనిపోయింది అని భావించి పోలీసువారు దేవరకొండ మార్చురీకి తరలించిచి నాంపల్లి తహసీల్దార్ దేవసింగ్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు,కానీ నా బిడ్డది ఆత్మహత్య కాదు, ముమ్మాటికి హత్య అని ధనలక్ష్మి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టి మృతదేహని తీసుకోవడానికి నిరాకరించడంతో మృతదేహం దేవరకొండ మార్చురిలోనే ఉంది.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఉండే మేకల యాదయ్య మూడోవ కుమార్తె ధనలక్ష్మి నీ ఇదే గ్రామానికి చెందిన గోదాసు యాదయ్య కుమారుడు రవికి ఇచ్చి గత సంవత్సరం వివాహం జరిపించారు.అప్పటి నుండి వరకట్నం కోసం రవి ధనలక్ష్మి నీ తిడుతూ,కొడుతూ చిత్రహింసలు చేసేవాడు అని పలుమార్లు ధనలక్ష్మి వారి కుటుంబ సభ్యులకు చెప్పుకుంది అని తన బిడ్డని రవి వారి కుటుంబ సభ్యులు కొట్టి చంపి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తమకి నాయ్యం జరగాలి అంటూ ధనలక్ష్మి కుటుంబసభ్యులు ఆరోపించారు.

### మృతురాలి అత్తగారింట్లో రక్తపు మరకలు

వీరి ఆరోపణలకు ఊతం ఇస్తూ ధనలక్ష్మి కుటుంబ సభ్యులు వెళ్లి రవి ఇంటిని పరిశీలించగా అక్కడ చెరిపిన రక్తపు మరకలు కనిపించడంతో పోలీసులకి సమాచారం అందించడంతో క్లూస్ టీం వచ్చి రక్తపు మరకలు ఉన్న మట్టి నమూనాలను సేకరించారు.రవి, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు.



### ధనలక్ష్మిది హత్య అని గ్రామస్తుల ఆరోపణ

రవి ధనలక్ష్మి నీ వారి ఇంట్లోనే కొట్టి చంపి,ధనలక్ష్మి అమ్మగారి ఇంట్లో ఎవరు లేని సమయంలో తీసుకోవచ్చి బాత్రూమ్ లో ఊరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఈ విషయంలో జనంసాక్షి విలేకర్ సబ్ ఇన్స్పెక్టర్ లింగరెడ్డి ని వివరణ కోరగా నేరస్థులు మా అదుపులోనే ఉన్నారు వారిని ఈ రోజే రిమాండ్ కి తరలిస్తామని,పోస్ట్ మార్టం రిపోర్ట్, ఫోరెన్సిక్ రిపోర్ట్ బట్టి నేరస్థులకు శిక్ష పడేలా చూస్తామని అన్నారు.





# ఈఎల్ఎస్ఎస్‌లో పొరపాట్లు చేయొద్దు

**న్యూఢిల్లీ:**పాత పన్ను విధానంలో కొనసాగుతున్న వారికి పన్ను ఆదా కోసం పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కీలకం ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్). మరి, వీటిని ఎంచుకునేటప్పుడు సాధారణంగా చేసే పొరపాట్లు, వాటిని ఎలా అధిగమించాలో చూద్దామా..ఈఎల్ఎస్ఎస్ పథకాలు ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలు. ఇవి పాత పన్ను విధానంలోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలను అందించే ఏకైక మ్యూచువల్ ఫండ్ రకం. ఈ పథకాలు తమ ఆస్తులలో 80 శాతం ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాల్లో మదుపు చేస్తాయి. వీటికి మూడేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో పెట్టుబడిని వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదు.పన్ను ఆదా సాధనాల్లో ఈఎల్ఎస్ఎస్ లాకిన్ పీరియడ్ (3 ఏళ్లు) అత్యంత తక్కువగా ఉన్నప్పటికీ, దీని గురించి ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. మీరు సిప్ ద్వారా పెట్టుబడి పెడుతున్నప్పుడు, ప్రతి నెలా చెల్లించే వాయిదాకు విడివిడిగా మూడేళ్ల లాకిన్ వ్యవధి వర్తిస్తుంది. ఉదాహరణకు, మీరు జనవరిలో రూ.5,000 పెడితే, ఆ మొత్తం మూడేళ్ల తర్వాత వచ్చే జనవరి వరకూ కొనసాగాలి. అంటే, మొదటి వాయిదా వేసిన మూడేళ్లకే మొత్తం సొమ్మును వెనక్కి తీసుకోవడం కుదరదు. కాబట్టి, మీ భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడులను ప్లాన్ చేసుకోండి. వేర్వేరు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏఎంసీ) నుంచి అనేక ఈఎల్ఎస్ఎస్ పథకాలను ఎంచుకోవడం మరో పెద్ద పొరపాటు. దీనివల్ల మీ పోర్ట్‌ఫోలియో వైవిధ్యం దెబ్బతింటుంది. చాలా ఫండ్లు ఒకే రకమైన షేర్లలో పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుంది. ఇది నష్టభయాన్ని పెంచడమే కాకుండా, ఆశించిన రాబడిని తగ్గించవచ్చు. పైగా సెక్షన్ 80సీ కింద గరిష్ఠ పరిమితి రూ.1.5లక్షలు మాత్రమే. కాబట్టి, ఎక్కువ ఫండ్లలో పెట్టుబడి పెట్టినా అదనపు పన్ను ప్రయోజనం ఉండదు.ఈఎల్ఎస్ఎస్‌లో కేవలం రూ.1.5లక్షల వరకే పెట్టుబడి పెట్టాలనే అపోహ చాలామందిలో ఉంది. వాస్తవానికి ఈ పథకాల్లో పెట్టుబడి పెట్టడానికి గరిష్ఠ పరిమితి ఏదీ లేదు.



# కొత్త కారు కొంటే ఇవి తప్పనిసరి

**న్యూఢిల్లీ:**సొంతంగా ఒక కారు ఉండటం ఇప్పుడు ఒక కనీస అవసరంగా మారింది. కారు కొనాలనే ఆలోచన రాగానే మొదట వచ్చే సందేహం దానికి కావాల్సిన నిధులను ఎలా సమకూర్చుకోవాలి? ఎంత పొదుపు చేయాలి? అనేది. సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోతే కారు కొనుగోలు భవిష్యత్తులో భారంగా మారే అవకాశం ఉంటుంది. ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో ముందడుగు వేస్తే ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా మీ ఇంటి ముందుకు కొత్త కారు వచ్చి చేరుతుంది.కారు కొనుగోలులో తొలి దశ బడ్జెట్ నిర్ణయించుకోవడం. ప్రస్తుతం మార్కెట్‌లో మధ్య శ్రేణి కారు ధర సుమారు రూ.7లక్షల నుంచి రూ.10లక్షల వరకూ ఉంది. మీ ఆదాయం, అవసరాలు, వ్యక్తిగత ఇష్టాలను బట్టి, ఈ బడ్జెట్ మారొచ్చు. ఒకసారి ధరను నిర్ణయించుకున్నాక, తర్వాతి కాలంలో ఆ బడ్జెట్‌ను పెంచకుండా ఉండటం ఉత్తమం. ఉదాహరణకు, మీరు రూ.7 లక్షల కారును కొనాలని నిర్ణయించుకున్నారనుకుందాం.కారు లోన్ తీసుకోవడం: దీనివల్ల తక్షణమే కారును ఇంటికి తెచ్చుకోవచ్చు. ప్రస్తుతం చాలా బ్యాంకులు కారు ధరలో 80-90% వరకు రుణం ఇస్తున్నాయి. మిగిలిన 20 మొత్తాన్ని డౌన్ పేమెంట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ. 7 లక్షల కారుకు మీరు



రూ.1.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన మొత్తాన్ని 7 ఏళ్ల కాల పరిమితితో ఈఎంఐల రూపంలో చెల్లించవచ్చు.పొదుపు చేయడం: కొంతకాలం ఆగి, తగినంత సొమ్ము జమ అయ్యాక కారును కొనుగోలు చేయడం. దీనివల్ల వాయిదాల భారం ఉండదు.కారు రుణం సౌకర్యవంతంగా అనిపించినప్పటికీ, ఇందులో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి. కారు అసలు ధర కంటే చాలా ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. వడ్డీతో పాటు లోన్ ప్రాసెసింగ్ ఫీజులు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులు తోడవుతాయి. అంతేకాకుండా, సుమారు 7 ఏళ్ల పాటు ప్రతి నెలా ఈఎంఐ చెల్లించడం ఒక భారంగా మారుతుంది. అదే మీరు పొదుపు చేసి కొంటే, ఈ అదనపు ఖర్చులు తగ్గడమే కాకుండా ఆర్థిక ప్రశాంతత లభిస్తుంది. అయిదేళ్ల తర్వాత కారు కొనాలని లక్ష్యంగా పెట్టుకుంటే, అప్పటికి కారు ధర ఎంత ఉండవచ్చో అంచనా వేయడం ముఖ్యం. గత పదేళ్ల తీరును గమనిస్తే, భారతదేశంలో కార్ల ధరలు ఏటా సగటున 10% పెరుగుతున్నాయి. ఇదే కొనసాగితే, నేడు రూ.7 లక్షలు ఉన్న కారు అయిదేళ్ల తర్వాత సుమారు రూ.11.27 లక్షలకు చేరుతుంది. కాబట్టి మీ 5 ఏళ్ల పొదుపు లక్ష్యం రూ. 11.27 లక్షలుగా ఉండాలి.

ఎక్కడ పెట్టుబడి పెట్టాలి?

5 ఏళ్ల కాల పరిమతి కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు కొంత నష్టభయంతో కూడుకున్నవి. దీనికి బదులుగా హైబ్రిడ్ ఫండ్లు ఎంచుకోవడం ఉత్తమం. ఇవి ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పెట్టుబడి పెడతాయి. మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పుడు ఈక్విటీ ద్వారా మంచి రాబడులు, మార్కెట్లు ఒడుదొడుకుల్లో ఉన్నప్పుడు డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల ద్వారా రక్షణ లభిస్తుంది.

మ్యూచువల్ ఫండ్లలో క్రమబద్ధమైన పెట్టుబడి విధానం ద్వారా మీ లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు.

రూ.11.27 లక్షల లక్ష్యాన్ని చేరుకోవడానికి వివిధ రాబడి శాతం ప్రకారం నెలకు ఎంత పొదుపు చేయాలంటే...

8% సగటు రాబడితో: నెలకు రూ. 15,240

10% సగటు రాబడితో: నెలకు రూ. 14,436

12% సగటు రాబడితో: నెలకు రూ. 13,670

ఆర్థిక నిపుణుల సూచన ప్రకారం, గరిష్ఠంగా నెలకు రూ.15,240 పొదుపు చేయడం మంచిది. ఒకవేళ మీకు 8% కంటే ఎక్కువ రాబడి వస్తే, ఆ అదనపు సొమ్ముతో మీరు అనుకున్న దానికంటే మెరుగైన మోడల్ లేదా ప్రీమియం కారును కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

# నాలుగు సూత్రాలతో ఆర్థిక ధీమా



**న్యూఢిల్లీ:**నేటి వేగవంతమైన ప్రపంచంలో కేవలం సంపాదన పెంచుకోవడం మాత్రమే ఆర్థిక విజయం అనిపించుకోదు. ఊహించని సంక్షోభాలు ఎదురైనప్పుడు, ఆర్థికంగా కుంగిపోకుండా ధైర్యంగా నిలబడటమే అసలైన ఆర్థిక స్థిరత్వం..మీ ఆర్థిక స్థితిగతులు ఎంత బలంగా ఉన్నాయో అంచనా వేయడానికి, నిపుణులు నాలుగు ప్రధాన కొలమానాలను సూచిస్తున్నారు. అవేంటో చూద్దామా..


1 ఆదాయంలో పొదుపు: జీవితంలో ఎప్పుడు ఏ ఆపద వస్తుందో ఎవరూ ఊహించలేరు. అకస్మాత్తుగా ఉద్యోగం పోయినా లేదా అనారోగ్యం వంటి ఖర్చులు ఎదురైనా, మీ పొదుపు మిమ్మల్ని రక్షిస్తుంది. చాలామంది ఇలాంటి సమయాల్లో పదవీ విరమణ కోసం దాచుకున్న డబ్బును వాడుతుంటారు లేదా రుణాలు తీసుకుంటారు. అందుకే, నిపుణుల సూచన ప్రకారం మీ వద్ద కనీసం మూడు నుంచి ఆరు నెలల జీతానికి సమానమైన మొత్తం నగదు రూపంలో అందుబాటులో ఉండాలి. ఇది ఇల్లు లేదా వాహన మరమ్మతులు, అనారోగ్యం వంటి అత్యవసర సమయాల్లో మీకు రక్షణ కవచంలా పనిచేస్తుంది.

2 అప్పుల పరిమితి: బ్యాంకులు ఇచ్చే క్రెడిట్ కార్డు పరిమితులు, ముందస్తు అనుమతి పొందిన వ్యక్తిగత రుణాల ఉచ్చులో పడటం వల్ల ఆర్థిక ఆరోగ్యం దెబ్బతింటుంది. బాధ్యతారాహిత్యంగా చేసే ఈ స్వల్పకాలిక అప్పుల వల్ల మీ జీతంలో అధిక భాగం వడ్డీలు, వాయిదాలకే సరిపోతుంది. ఇది మీ జీవన ప్రమాణాలను తగ్గించడమే కాకుండా, సిబిల్ స్కోరునూ దెబ్బతీస్తుంది. ఆరోగ్యకరమైన ఆర్థిక స్థితి కోసం, మీ నెలవారీ ఆదాయంలో అప్పుల వాటా 20% నుంచి 35% మించకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యం.

3 బీమా రక్ష: పొదుపుతో పాటు సరైన బీమా ఉన్నప్పుడే ఆర్థిక రక్షణ లభిస్తుంది. బీమా ఉండటం వల్ల మీ ఆస్తులకు, కుటుంబ భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది. మన దేశంలో కేవలం 5 శాతం మందికే బీమా ఉంది, అందులోనూ చాలామంది తక్కువ కవరేజీతో ఉన్నారు. బీమా మీ వార్షిక ఆదాయానికి 10 నుంచి 15 రెట్ల వరకూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉదాహరణకు: మీ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు అయితే, మీకు కనీసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు బీమా రక్షణ ఉండాలి. దీనికి అదనంగా మీపై ఉన్న అప్పుల మొత్తాన్నీ కలపాలి.

4 పదవీ విరమణ నిధి: ఒకానొక దశలో మనం పని చేయడం ఆపేయక తప్పదు. అప్పుడూ మన జీవనశైలి మారకూడదంటే, పక్కాగా పదవీ విరమణ ప్రణాళిక ఉండాలి. పదవీ విరమణ తర్వాత మీ నెలవారీ ఖర్చుల కోసం, పదవీ విరమణకు ముందు మీకున్న ఆదాయంలో కనీసం 75 శాతం వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. చిన్న వయసులోనే పొదుపు ప్రారంభించడం వల్ల చక్రవడ్డీ ప్రయోజనంతో భారీ నిధిని సమకూర్చుకోవచ్చు.

ఈ నాలుగు సూత్రాలను క్రమం తప్పకుండా సమీక్షించుకోవడం వల్ల ఆర్థిక క్రమశిక్షణ పెరగడమే కాకుండా, మీ భవిష్యత్తుకు బలమైన పునాది లభిస్తుంది.




# ఎప్‌స్టీన్ రహస్యం.. ఆమె ఛేదించారు!

**వాషింగ్టన్:**ఒకరిద్దరు కాదు. వందలు, వేల మంది బాలికలు, యువతులు... పేదరికం, కుటుంబ నిరాదరణ, మోడలింగ్ ఆసక్తులు... పలు కారణాలతో ఎప్‌స్టీన్ అనే సంపన్న కామాంధుడి వలకి చిక్కారు, సెక్స్ ట్రాఫికింగ్‌కి బలయ్యారు. ఆ చీకటి సాలెగూడు నుంచి బయటపడిన కొందరమ్మాయిల కథలు వింటే... ఎలాంటి సమాజంలో ఉన్నాం, మృగాళ్ల నుంచి ఆడపిల్లలను ఎంత జాగ్రత్తగా రక్షించుకోవాలి.ఒకరిద్దరు కాదు. వందలు, వేల మంది బాలికలు, యువతులు... పేదరికం, కుటుంబ నిరాదరణ, మోడలింగ్ ఆసక్తులు... పలు కారణాలతో ఎప్‌స్టీన్ అనే సంపన్న కామాంధుడి వలకి చిక్కారు, సెక్స్ ట్రాఫికింగ్‌కి బలయ్యారు. ఆ చీకటి సాలెగూడు నుంచి బయటపడిన కొందరమ్మాయిల కథలు వింటే... ఎలాంటి సమాజంలో ఉన్నాం, మృగాళ్ల నుంచి ఆడపిల్లలను ఎంత జాగ్రత్తగా రక్షించుకోవాలి... అన్నదాన్ని తెలియజేస్తున్నాయి. ఎప్‌స్టీన్ ఫైల్స్... జుగుప్సాకరమైన ఈ ఇంటర్నేషనల్ సెక్స్ ట్రాఫికింగ్ స్కామ్ సెగ ఇప్పుడు మనదేశాన్నీ తాకింది. ఆ వికృత కామక్రీడకు బలైనవాళ్లలో మనదేశ బాలిక పేరూ ఉండటంతో మరోసారి దీనిమీద చర్చ మొదలైంది. అయితే, కొన్నేళ్ల కిందటి ఎప్‌స్టీన్ కేసును తిరగదీసి, 2019లో అతనికి జైలుశిక్ష పడటంలో మయామీ హెరాల్డ్ పత్రికకు చెందిన మహిళా ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ కీలకపాత్ర పోషించారు. పేరు జూలీ కె.బ్రౌన్. 80 మంది బాధితుల్ని కలిశారీమె. వాళ్ల కథల్నీ ఎప్‌స్టీన్ అరాచక వ్యవస్థనీ సిరీస్‌గా ప్రచురించారు. ఆ కథనాల్ని 'పర్వర్షన్ ఆఫ్ జస్టిస్' పేరుతో పుస్తకంగానూ తీసుకొచ్చారు అసలు ఎప్‌స్టీన్ కేసు శోధించాలన్న ఆలోచన ఆమెలో ఎలా మొదలైందన్నది తెలుసుకునే ముందు....జెఫ్రీ ఎప్‌స్టీన్... అమెరికన్ ఫైనాన్షియర్. బాలికలు, యువతుల జీవితాలతో ఆడుకున్న కామపిశాచి. దేశాధినేతలు, వ్యాపారులు, మేధావులతో పరిచయాలు పెంచుకుని అపర కుబేరుడిగా ఎదిగాడు. అసాంఘిక, అశ్లీల సామ్రాజ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. ప్రైవేటు దీవుల్ని కొని, ఇంద్ర భవనాలు నిర్మించి, అనేక దేశాల నుంచి అమ్మాయిల్ని రప్పించి పార్టీలు ఇచ్చేవాడు. ఫ్లోరిడాలోని తన పామ్‌బీచ్ నివాసంలో 14 ఏళ్ల అమ్మాయిని లైంగికంగా వేధించాడని 2005లో అతనిమీద కేసు నమోదైంది. దర్యాప్తుకోసం వెళ్లిన పోలీసులు న్యూడ్ పెయింటింగులతో నిండిన ఆ ఇంటి గోడల్ని చూసి నివ్వెరపోయారు. చివరకు ఎప్‌స్టీన్ నేరాన్ని ఒప్పుకోవడంతో 2008లో జైలుశిక్ష పడింది. డబ్బు బలంతో నాన్ ప్రాసిక్యూషన్ (ప్లీ డీల్)ఒప్పందం చేసుకున్నాడు. ఫలితం తేలికపాటి జైలుశిక్ష పడగా 13 నెలలకే విడుదల య్యాడు. జైల్లోనూ రాచమర్యాదలే. నిజానికి అతనిమీద మోపిన నేరానికి కనీసం 20 ఏళ్ల జైలుశిక్ష పడాలి. కానీ అలా జరగలేదు. ఇదే బ్రౌన్‌లో ఆసక్తిని రేకెత్తించింది. ఎవరితను... ప్లీ డీల్ ఎలా పొందాడు... అనుకుంటూ అతనిపై ఓ కన్నేసి ఉంచారీమె!

ఎలా శోధించారు?

కేసు విచారణకు సంబంధించిన లీగల్ డాక్యుమెంట్లను 2017లో క్షుణ్ణంగా పరిశీలించారు బ్రౌన్. వాటిల్లో బాధితుల పేర్లకు బదులుగా



జేన్‌డో1, జేన్‌డో2... అని రాస్తారు. కానీ వాటి ద్వారానే 80 మంది బాధితుల వివరాలు సేకరించి వాళ్లని కలిశారు. అందుకామె చాలా కష్టపడ్డారు. ఎంతో దూరాలు ప్రయాణించేవారు. చాలామంది భయంతో నోరు విప్పేవారు కాదు. ఎనిమిది మంది అమ్మాయిలు మాత్రం ధైర్యంగా ముందుకొచ్చి ఎప్‌స్టీన్ వికృతచేష్టల్నీ, తమమీద జరిగిన అకృత్యాల్నీ వినిపించారు. దాదాపుగా అందరిదీ ఒకటే కథ. ఫీజులకోసం కొందరూ కార్పొరేట్ టౌన్ పార్టీల ఆశతో ఇంకొందరూ అతని గాలానికి చిక్కినవాళ్లే. డ్రగ్స్‌కి బానిసైన బాలికల్నీ చేరదీసేవారు. వీళ్లని వెతికి తెచ్చే పని ఎప్‌స్టీన్ గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మ్యాక్స్‌వెల్‌ది... తన స్నేహితుడు గొప్ప దాత అనీ, ఫీజులు కట్టి సాయం చేస్తాడనీ, మసాజ్ చేస్తే చాలనీ, 200 డాలర్ల చొప్పున ఇస్తామని తీసుకెళ్లేది. అక్కడ వాళ్లమీద అఘాయిత్యం చేయడమే కాదు, ఆ దృశ్యాలను రహస్య కెమెరాల్లో చిత్రించి, భయపెట్టి లొంగదీసుకునేవారు. వాళ్ల స్నేహితుల్నీ తీసుకొస్తే డబ్బులిస్తామనీ ఆ అమ్మాయిలకే ఆశ చూపించేవారు. ఒకమ్మాయి పాతిక మందినీ మరొకమ్మాయి నలభై మందినీ ఎప్‌స్టీన్‌కి పరిచయం చేశారట. ఇలా ఎప్‌స్టీన్ కామానికి బలైన బాలికలెందరో. ఆ నరకం నుంచి బయటికొచ్చి వాళ్లు చెప్పేవి వినడానికే సమాజం సిగ్గుపడుతుందంటే... ఆ అమ్మాయిలెంత నరకం అనుభవించి ఉంటారు? పైగా వాళ్లను న్యాయ విచారణలో ప్రశ్నలతో హింసించారు, జీతంకోసం పనిచేసే వేశ్యలుగా చిత్రించారు ఎప్‌స్టీన్ న్యాయవాదులు.వాళ్లందరినీ కలిసిన బ్రౌన్... 2018లో ఆ అమ్మాయిలు ఎదుర్కొన్న లైంగిక హింస గురించి సిరీస్‌గా ప్రచురించారు. అప్పటి అటార్నీ జనరల్ అలెగ్జాండర్ అకోస్టా మధ్యవర్తిత్వం వహించిన 2008 నాట్జి నాన్ ప్రాసిక్యూషన్ ఒప్పందమే అతనికి తేలికపాటి శిక్ష పడటానికి కారణమన్న విషయాన్ని ఆమె బహిర్గతం చేశారు. ట్రాఫికింగ్ నెట్‌వర్క్ ఆరోపణలు, మీటూ ఉద్యమం ఊపందుకోవడం, బ్రౌన్ కథనాలతో న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూషన్ ఎప్‌స్టీన్ కేసును తిరగదీసింది. దర్యాప్తు మళ్లీ ప్రారంభమైంది. ప్లీ డీల్ బాధితుల హక్కులను ఉల్లంఘించిందనీ, ట్రాఫికింగ్ జరిగిందనీ.. అన్న ఆరోపణలతో జులై 6, 2019న ఎప్‌స్టీన్‌ను న్యూయార్క్‌లో అరెస్ట్ చేశారు. తరవాత కొన్ని రోజులకే అకోస్టా యూఎస్ కార్మిక కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. ఆగస్టు 10న విచారణకోసం ఎదురుచూస్తూ జైలు గదిలో అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు ఎప్‌స్టీన్.

ఎవరీ జూలీ కె. బ్రౌన్?

బ్రౌన్ స్వస్థలం ఫిలడెల్ఫియా.. చిన్నతనం నుంచీ ఎన్నో కష్టాలు పడ్డారు. ఒంటరి తల్లి పెంపకంలో పెరిగారు. చుట్టుపక్కల, స్కూల్లో అవమానాలు, వేధింపులు ఎదుర్కొన్నారు. పరిశోధనాత్మక కథనాలమీద ఆసక్తితో స్కూలు వార్తాపత్రికకి ఎడిటర్‌గా పనిచేశారు బ్రౌన్. పదహారేళ్ల వయసులో బయటి ప్రపంచంలోకి వచ్చి సొంత జీవితాన్ని ప్రారంభించారు. కాలేజీ ఫీజులకోసం కొరియర్‌గా, ఫ్యాక్టరీలో వర్కర్‌గా ఎన్నో పనులు చేశారు. జర్నలిజంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఫిలడెల్ఫియా డెయిలీ న్యూస్‌లో కొంతకాలం చేశాక మయామీ హెరాల్డ్‌కి వచ్చారు. ఓ దశలో ఉద్యోగం పోతుందనే అనుకున్నారట. కానీ యాజమాన్యం మద్దతు లభించడంతో ఆమె ధైర్యంగా తన కథనాలను ప్రచురించారు. ఈ ఒక్క కేసే కాదు, దీనికి ముందు జైళ్ల అరాచక వ్యవస్థపై నాలుగేళ్లపాటు శోధించి, కథనాలు రాశారు బ్రౌన్. అవి అధికారుల రాజీనామాలకూ అవినీతిపరుల తొలగింపునకీ దారితీశాయి. 30 ఏళ్ల కెరియర్‌లో రెండుసార్లు ప్రసిద్ధ జార్జ్ పోల్క్ అవార్డుతోపాటు మరెన్నో పురస్కారాల్నీ అందుకున్నారు. పులిట్జర్ ప్రైజ్ గెలుచుకున్న మయామీ టీమ్‌లో ఈమె ఒకరు. 2020లో టైమ్ మ్యాగజీన్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పీపుల్ జాబితాలోనూ చేరారు. ఎప్‌స్టీన్ అరెస్ట్‌తో అంతా ఆమె ధైర్యాన్నీ తెగువనీ ప్రశంసించారు. అప్పుడు 'భయాన్ని పక్కనబెట్టి తమ కథలను కెమెరా ముందు చెప్పిన ధైర్యవంతులైన బాధితులే రియల్ హీరోలు' అన్నారీమె. అంతేకాదు, 'వాళ్లు తమకు జరిగిన అన్యాయం గురించి చెబుతుంటే సమాజం ఎంతగా కుళ్లిపోయిందో తెలుస్తోంది. పిల్లల్ని రక్షించాల్సిన బాధ్యత మనదే. అలాంటిది ఎంతోమంది టీనేజర్లు బలైన ఈ ఘోర నేరాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే... వాళ్లకి ఏమని సమాధానం చెబుతాం?' అంటోన్న బ్రౌన్ పట్టుదల, వృత్తి పట్ల ఉన్న నిబద్ధత అభినందనీయం!

# 2029 కల్లా ఏడాదికి 10 హెచ్125 హెలికాప్టర్ల ఉత్పత్తి

**న్యూఢిల్లీ:**ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్‌బస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్)తో కలిసి కర్ణాటకలో స్థాపించిన తుది అసెంబ్లీ లైన్ నుంచి ఏడాదికి 10 హెచ్125 హెలికాప్టర్లను ఉత్పత్తి చేయాలని యోచిస్తోంది. 2029 నాటికి ఈ లక్ష్యాన్ని చేరతామని ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ సీఈఓ బ్రూనో ఈవెన్ వెల్లడించారు. భారత్‌లో హెలికాప్టర్ మార్కెట్ బాగుంటుందని తాము బలంగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. పౌర హెలికాప్టర్ మార్కెట్‌ను పెంచడంలో హెచ్125 హెలికాప్టర్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. కర్ణాటకలోని వేమగల్‌లో హెచ్125 కోసం దేశంలోనే తొలి ప్రైవేటు రంగ హెలికాప్టర్ ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను టీఏఎస్ఎల్‌తో కలిసి ఎయిర్‌బస్ ఏర్పాటు చేసింది. ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈ ప్లాంటును దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించిన సంగతి విదితమే. ప్రస్తుతం మనదేశంలో 100కు పైగా ఎయిర్‌బస్ హెలికాప్టర్లు సేవలందిస్తున్నాయి.




# ఫ్లోరిడా ఎయిర్‌పోర్టుకు డొనాల్డ్ ట్రంప్ పేరు!

**న్యూయార్క్(జనంసాక్షి):**ఫ్లోరిడాలోని పామ్ బీచ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పేరు మారనుంది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పెట్టనున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ త్వరలోనే దీనిపై సంతకం చేయనున్నారు. అనంతరం ఈ విమానాశ్రయం పేరు మార్పునకు ఫెడరల్ ఏవియేషన్ ఆమోదం కూడా అవసరం. ట్రంప్ నివాసం 'మార్ ఎ లాగో'కు కొద్ది దూరంలోనే ఉన్న ఈ ప్రాంతం ఇసుక బీచ్‌లు, లగ్జరీ ఎస్టేట్‌లకు ప్రసిద్ధి.స్థిరాస్తి వ్యాపారంలో ఉన్న ట్రంప్‌నకు.. ఆయన పేరుతో ప్రపంచ వ్యాప్తంగా అనేక భవనాలున్నాయి. అయితే, అమెరికాలోని ప్రముఖ ప్రాంతాలకు తన పేరు ఉండాలని భావిస్తున్న ట్రంప్.. ఇందుకోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. వాషింగ్టన్‌లోని కెనడీ స్మారక కాంప్లెక్స్ పేరును 'ట్రంప్-కెనడీ సెంటర్'గా మార్చేందుకు ఇప్పటికే ఆమోదం తెలిపారు. న్యూయార్క్ పెన్ స్టేషన్ (న్యూయార్క్‌లోని అతిపెద్ద రైలు, రోడ్డు కనెక్టివిటీ కేంద్రం) తోపాటు వాషింగ్టన్‌లోని డల్లెస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులకు తన పేరు పెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ తీవ్ర వ్యతిరేకత వచ్చినట్లు సమాచారం.

# ఓపెన్ ఏఐలో ఏం జరుగుతోంది?

**న్యూఢిల్లీ:**కృత్రిమ మేధ... ప్రజల అవసరాల కోసమా, లేక కొందరి వ్యాపార ప్రయోజనాల కోసమా? ఈ సందేహాన్ని లేవనెత్తుతోంది గతేడాది విడుదలై సంచలనం సృష్టిస్తున్న పుస్తకం- ఎంపైర్ ఆఫ్ ఏఐ: డ్రీమ్స్ అండ్ నైట్‌మేర్స్ ఇన్ సామ్ ఆల్ట్‌మన్స్ ఓపెన్ ఏఐ. టెక్ జర్నలిస్ట్ కరెన్ హావ్ ఇందులో ఓపెన్ ఏఐ సంస్థ, సారథుల ప్రస్థానాన్ని విశ్లేషిస్తూ ఈ అద్భుత సాంకేతికతను అడ్డంపెట్టుకుని సాగిస్తున్న వ్యాపారాన్ని ఆధునిక సామ్రాజ్యవాదంతో పోల్చారు. ఏఐ నాణేనికి మరోవైపున జరుగుతున్న వనరుల దోపిడీ గురించి, లాభాపేక్షలేని సంస్థగా మొదలై ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేటు




సంస్థగా మారడం గురించి, సంస్థ సారథి-సామ్ ఆల్ట్‌మన్ చేతిలో ఉన్న అపరిమిత అధికారం గురించి ఆలోచించమంటున్నారు. ఏ సమాచారం కావాలన్నా గూగులమ్మను అడగడం ఓల్డ్ ఫ్యాషన్. జెన్ జీతో కలిసి నడవాలంటే సంభాషణలో ప్రతి రెండో వాక్యంలోనూ చాట్ జీపీటీ, గ్రోక్, క్లాడ్‌లలో ఏదో ఒకదాన్ని ప్రస్తావించాలి. జెమినై బెటరా కోపైలట్ బెటరా, పర్‌ప్లెక్సిటీ ప్రత్యేకత ఏంటి, డీప్‌సీక్ ఏం చేయబోతోంది... లాంటివి చర్చించగలగాలి. ఏడెనిమిదేళ్ల క్రితం మనకివేవీ తెలియవు. పైన చెప్పినవేవీ అప్పటికి పుట్టలేదు కూడా. కృత్రిమమేధ అన్న మాటొక్కటి తెలుసు, దాంతో అద్భుతాలు చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయని కాస్తో కూస్తో టెక్నాలజీ విషయాలు తెలిసినవారికి అవగాహన ఉండేది. అలాంటిది హఠాత్తుగా ఇవన్నీ నిత్య జీవితంలోకి ఎలా వచ్చేశాయి? ముఖ్యంగా గత మూడేళ్లలో ఈ రంగంలోనూ, సిలికాన్ వ్యాలీలోనూ చోటుచేసుకున్న మార్పులు సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. కరెన్ హావ్ ఎంఐటీ టెక్నాలజీ రివ్యూ మ్యాగజీన్‌కి సీనియర్ ఏఐ ఎడిటర్‌గా, వాల్‌స్ట్రీట్ జర్నల్, ది అట్లాంటిక్ పత్రికలకు కరెస్పాండెంట్‌గా పనిచేశారు. ప్రత్యేకించి కృత్రిమమేధ, అది ప్రపంచం మీద చూపనున్న ప్రభావం గురించి ఏడేళ్ల రిపోర్టింగ్ అనుభవం ఉంది. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా 'ఓపెన్ ఏఐ' (చాట్ జీపీటీని తయారుచేసింది ఈ సంస్థే) గురించి ఎక్కువగా రాసేవారు. ఆ సందర్భంగా సంస్థ ఆంతరంగిక విషయాలూ తెలిశాయి. ఎవరెవరు పెట్టుబడులు పెట్టిందీ, సంస్థ ఎలా ఎదుగుతున్నదీ దగ్గర నుంచి గమనించారు. అదీ ఈ పుస్తక రచనకు నేపథ్యం. తన అనుభవానికి తోడు 300లకు పైగా ఇంటర్వ్యూలు, ఈ-మెయిల్స్, వ్యక్తిగత సందేశాలను ఆధారంగా తీసుకున్నారు. ఇంటర్వ్యూలిచ్చిన వారిలో సగానికి పైగా ఓపెన్ ఏఐ సంస్థలో పనిచేసినవాళ్లే. మిగిలినవాళ్లు ఇతర టెక్ సంస్థల్లో పనిచేస్తూ సామ్ ఆల్ట్‌మన్‌కి సన్నిహితంగా ఉన్నవాళ్లు. 2023 నవంబరులో జరిగిన సామ్ ఆల్ట్‌మన్ తొలగింపు ఉదంతంతో పుస్తకాన్ని మొదలెట్టారు కరెన్. బోర్డు సభ్యులు ఎంతో మల్లగుల్లాలు పడి తీసుకున్న ఆ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాల్సి వచ్చిందంటే ఆల్ట్‌మన్ ఎంతటి శక్తిమంతుడో ఆలోచించమంటుంది కరెన్ పుస్తకం.

ఎవరీ సామ్ ఆల్ట్‌మన్?

సిలికాన్ వ్యాలీ గోల్డెన్‌బోయ్‌గా మారిన సామ్ ఆల్ట్‌మన్ సంపన్నుల ఇంట పుట్టారు. తండ్రి మెకింతోష్ కంప్యూటర్ కొనిస్తే ఎనిమిదేళ్లకే కోడింగ్ నేర్చుకున్నారట. పందొమ్మిదో ఏట స్టాన్‌ఫర్డ్‌లో డిగ్రీ చదువు మధ్యలో ఆపేసి 'లూప్ట్' అనే సోషల్ నెట్‌వర్క్ ప్రారంభించారు, 30 మిలియన్ డాలర్ల పెట్టుబడులు సేకరించారు.

# మృతుడిపై బంగారం చోరీ

## రాయికల్‌లో మానవత్వం మరిచిన దుండగులు!

- రాయికల్ టోల్ ప్లాజాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదంలో మరణించిన వ్యక్తి మెడలో నుంచి 4 తులాల గొలుసు అపహరణ
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (మిద్దెల సత్యనారాయణ) (జనంసాక్షి) :**

మాయమై పోతున్నదమ్మా మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అనే పాట గుర్తుకు వస్తుంది ఈ ఘటన చూస్తే అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం ఆ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందడం ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా దగ్గర ఈ నెల 18వ తేదీన చోటుచేసుకుంది అరుణాచలం దైవదర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈనెల 18వ తేదీన రాయికల్ టోల్ ప్లాజా దగ్గర లారీని ఇన్నోవా క్రిష్ట వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు పుల్లగుర్రం పురుషోత్తంరెడ్డి గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారూ అయితే పురుషోత్తంరెడ్డి మెడలో నాలుగు తులాల బంగారు గొలుసు ఉంది రోడ్డు ప్రమాదం తర్వాత మృతుడి మెడలో నుండి ఆ గొలుసు మాటు మయమైంది కుటుంబ సభ్యులు బాధతో వారి బాధలో వారు ఉంటే బంగారు గొలుసు ఎటుమాయమైందో అర్థం కాలేదు. అంత్యక్రియల తర్వాత కుటుంబ సభ్యులు పోలీసులను సంబంధిత అధికార యంత్రాంగాన్నీ ఆశ్రయించిన వారికి నిరాశే మిగిలిపోయింది.

**మా అన్న డెడ్‌బాడీపై ఉన్న బంగారు గొలుసు మాయం చేశారు**

**పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి**



ఈనెల 18వ తేదీన అర్ధరాత్రి రాయికల్ టోల్ ప్లాజా దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే తన అన్న పుల్లగుర్రం పురుషోత్తం రెడ్డి వాహనంలోనే మృతి చెంది ఉన్నాడు మేము వెళ్లి చూసేసరికి విగత జీవులుగా పడి ఉన్నారు మేము బంగారం డబ్బుల గురించి అక్కడ ఏమి ఆలోచించలేదు బాధతో శోకసముద్రంలో మునిగిపోయాం కానీ గత పది సంవత్సరాల నుండి మా అన్న పురుషోత్తంరెడ్డి మెడలో నాలుగు తులాల బంగారు గొలుసు ఉండేది రాత్రి కూడా తను తీయకుండా అలాగే వేసుకొని పడుకునేవాడు అరుణాచలం యాత్రకు వెళ్లేటప్పుడు కూడా మెడలోనే ఉంది ఇప్పుడు డెడ్ బాడీపై ఉన్న ఫోటోలో కూడా అలాగే ఉంది కానీ తీరా చూస్తే ఎవరిని అడిగిన బంగారు గొలుసు లేదని చెబుతున్నారు డెడ్ బాడీపై ఉన్న బంగారు గొలుసును కూడా మాయం చేస్తారా ఇదేం సమాజం అసలు మానవత్వం అనేది ఉందా ఈ మనుషులకు.



# చలో సెక్రటరియేట్ తరలిరండి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** టిజిఎస్ఆర్టిసి జేఏసీ ఉద్యోగుల సమస్యల కొరకు చలో సెక్రటేరియట్ పోస్టర్‌ను శుక్రవారం వేములవాడ ఆర్టీసీ జెఏసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చిపోయిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, వేతన సవరణ యూనియన్ల పునరుద్ధరణ ఉద్యోగ భద్రత తదితర అంశాల సాధనకై పెద్ద ఎత్తున డిపో నుండి కార్మికులు ఈనెల 24 న చలో సెక్రటేరియట్ కు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బి కాళిదాస్, జిపి సింగ్, శ్రీకాంత్, కీసరి రమేష్, లక్ష్మణ్,కార్మికులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 24న జాబ్ మేళా నిర్వహణ

**జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్**

**పెద్దపల్లి,ఫిబ్రవరి 20(జనంసాక్షి) :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ ,యువకులకు సాక్సెస్ ప్రాజెక్టు ఎల్ఎల్‌పి కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఫిబ్రవరి 24 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాక్సెస్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి కంపెనీలో మొత్తం 51 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 50, మార్కెటింగ్ మేనేజర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబిఏ, మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్ డిగ్రీ విద్య అర్హతలు కలిగిన వారు అర్హులని, వయస్సు 18 నుంచి 36 మధ్యలో ఉండాలని అన్నారు.

# వెన్నెముక చికిత్సలో కొత్త ఒరవడి

- అత్యాధునిక టెక్నిక్‌లతో రోగులకు మేలు
- సంక్లిష్ట సర్జరీల్లో విజయాలు
- పేషెంట్ల జీవన నాణ్యత పెంపు
- పేషెంట్ సానుభూతితో చికిత్స



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో 12 ఏళ్లకుపైగా అనుభవమున్న ఫెలోషిప్ ట్రైన్డ్ స్పైన్ సర్జన్ డాక్టర్ మధుకిరణ్ యార్లగడ్డ.. సంక్లిష్టమైన వెన్నెముక వైకల్యాల శస్త్రచికిత్స సవరణ, మినిమల్లీ ఇన్వాసివ్ స్పైన్ సర్జరీల్లో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నారు. పలు అంతర్జాతీయ సంస్థల్లో శిక్షణ పొందిన డాక్టర్ మధుకిరణ్.. స్కోలియోసిస్ సవరణ, మోషన్ ప్రిజర్వింగ్ వెన్నెముక ప్రక్రియలు వంటి హై-ప్రెసిషన్ మినిమల్లీ ఇన్వాసివ్ టెక్నిక్‌లలో చేసిన కృషికి విశేష గుర్తింపు పొందారు. ఈ టెక్నిక్‌లు నొప్పి, కోలుకునే సమయం, శస్త్రచికిత్స ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అత్యంత క్లిష్టమైన వెన్నె ముక సమస్యల పరిష్కారంలో డాక్టర్ మధుకిరణ్ ఎంతో నమ్మకమైన వైద్యు డు. గతంలో విఫలమైన సర్జరీలను సరిచేయడం, వెన్నెముకలో పలుచోట్ల ఎముకలను అతికించడం, తీవ్రమైన వెన్నెముక గాయాలు, కణితుల వంటి కేసులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ ముందే కంప్యూటర్ సహాయంతో ప్లానింగ్ చేస్తారు. ఆపరేషన్ సమయంలో నరాలకు హాని జరగకుండా 'న్యూరో మానిటరింగ్' వంటి పద్ధతుల ద్వారా రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. తీవ్రమైన గాయాల తర్వాత వెన్నెముకను మళ్లీ నిలబెట్టడం నుంచి వెన్నెముక క్యాన్సర్ కణితుల వరకు ఆయన చేసే ప్రతి పనిలో అద్భుతమైన సాంకేతిక నైపుణ్యం, పేషెంట్ పట్ల శ్రద్ధ కనిపిస్తాయి. తన పనితీరు గురించి డాక్టర్ మధుకిరణ్ యార్లగడ్డ మాట్లాడుతూ.. 'నా లక్ష్యం కేవలం వెన్నెముకను సరిచేయడం మాత్రమే కాదు.

పేషెంట్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, వారు మళ్లీ మునుపటిలా కదలగలిగేలా చేసి, వారి జీవన నాణ్యతను పెంచడం' అన్నారు. వెన్నెముక కదలిక దెబ్బతినకుండా చూస్తూ, నొప్పిని తగ్గించినప్పుడు మేము ఆ పేషెంట్‌కు వారి జీవితాన్ని తిరిగి ఇచ్చినట్లవు తుందన్నారు. 'బలమైన వెన్నెముకతోనే శక్తివంతమైన జీవితం' అనే నినాదంతో ముందుకు సాగుతూ.. ఆధునిక ఆవిష్కరణలు, ఖచ్చితత్వం, పేషెంట్ పట్ల సానుభూతితో వెన్నెముక శస్త్రచికిత్సల్లో సరికొత్త మార్పులు చేస్తున్నారు. ఈ సమావేశంలో యశోద ఆసుపత్రి ప్రతినిధులు సింహరాజు శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. డాక్టర్‌ను సంప్రదించడానికి సెల్ 7075703537 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ఆస్థి కోసం సహోదరునిపై హత్య ప్రయత్నం చేసిన అన్న

- తెల్లవారుజామున కత్తితో దాడి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- నిందితున్ని అరెస్ట్ చేసిన గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు




**గోదావరిఖని, జనంసాక్షి :** ఆస్థి, ఇతర వివాదాలతో సొంత బాబాయ్ కుటుంబంపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మార్కండేయ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీపీ కార్యాలయంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కలిసి అరెస్ట్ వివరాలు వెల్లడించారు. నిందితుడు మార్కండేయ కాలనీకి చెందిన గాడిచెర్ల రామ్‌దూత్. అతడి నుంచి దాడికి ఉపయోగించిన కత్తి, మొబైల్‌ఫోన్, రక్తపు మరకలున్న బట్టలు స్వాధీనం చేసుకున్నారు. రామ్‌దూత్ బీటెక్ చదివి ప్రస్తుతం సోరియాసిస్ చర్మవ్యాధితో ఇంట్లోనే ఉంటున్నాడు. అతడి తాత రాయమల్లు కట్టించిన ఇంటిలో పెద్ద కుమారుడు సారయ్య కుటుంబం ఒక భాగంలో, చిన్న కుమారుడు శ్రీనివాస్ కుటుంబం మరో భాగంలో నివసిస్తున్నారు. శ్రీనివాస్ 11 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య సుమిత్ర, కుమారుడు ప్రణయ్ (22), కుమార్తె సువర్చల, సుమిత్ర తల్లి కొమురమ్మ అక్కడే ఉంటున్నారు. రామ్‌దూత్ తండ్రికి ఫిట్స్, బీపీ సమస్యలు, తల్లికి గుండె సమస్యలు ఉన్నాయి. పిన్ని సుమిత్ర కిరాణా దుకాణంలో సిగరెట్లు, గుట్కా, పాన్‌మసాలా అమ్ముతుండటంతో వాటి వాసన, సిగరేటు పొగ కారణంగా తమ ఆరోగ్యం దెబ్బతింటోందని రామ్ దూత్ కుటుంబం పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై తరచూ గొడవలు జరిగాయి. బాబాయ్ కుటుంబ ఆస్తి తనకే వస్తుందని భావించిన రామ్‌దూత్.. బాబాయ్ కుటుంబ సభ్యులను చంపాలని నిర్ణయించుకున్నాడు. గతేడాది అక్టోబర్ 5న అమెజాన్ ద్వారా కొబ్బరి కత్తి కొనుగోలు చేసి ఇంట్లో దాచుకున్నాడు. హత్యకు గల కారణాలను ఒక నోట్‌బుక్‌లో రాసుకున్నాడు. ఈ పథకంలో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో పిన్ని సుమిత్ర నిద్రలేచి బాత్‌రూంకు వెళ్లగా.. రామ్‌దూత్ కత్తితో బాబాయ్ ఇంటికి వెళ్లి పడుకుని ఉన్న ప్రణయ్‌పై ఛాతీ, భుజాలు, మెడపై దాడి చేశాడు. అరుపులు విని అడ్డుకున్న కొమురమ్మ ముఖం, చెవి, చేతిపై గాయాలపాలయ్యారు. తర్వాత సుమిత్రపై ముఖం, చేతులపై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలు చేశాడు. అరుపులు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కలవారు నిందితుడిని అడ్డుకుని కత్తి లాక్కున్నారు. దాడి సమయంలో బట్టలపై రక్తం పడటంతో బట్టలు మార్చుకుని రామ్‌దూత్ పారిపోయాడు. బాధితులను మొదట గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత కరీంనగర్ వన్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. నిందితుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద దాక్కొని బస్‌స్టాండ్‌కు వెళ్తున్నాడనే సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి అక్కడికి వెళ్లి అతడిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# పీఎంశ్రీ స్కూళ్లలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపిక అయిన స్కూళ్లలో మొదలు పెట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పీఎంశ్రీ కింద ఎంపిక అయిన విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాధికారి, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో ఇంచార్జి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.పీఎంశ్రీ కింద జిల్లాలో మొత్తం 16 విద్యాలయాలు ఎంపిక అయ్యాయని, వాటిలో అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ లు, సైన్స్ ల్యాబ్ లు, లైబ్రరీలు, వర్షం నీరు ఇంకుడు గుంతలు ఇతర నిర్మాణాలు ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు.పీఎంశ్రీ కింద ఎంపికైన విద్యాలయాల్లో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆయా స్కూళ్లలో పనులను జిల్లా విద్యాధికారి పరిశీలించాలని ఆదేశించారు. కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు.ఇట్టి కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణ రావు, ఏఈలు నాగరాజు, అశోక్ కుమార్, అధికారులు తదితరులు ఉన్నారు.

## పూర్వ సింగరేణి కార్మికురాలు కొమ్ము పోచమ్మ ఇక లేరు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 20(జనంసాక్షి) :** రామగుండం మున్సిపాలిటీ పరిధిలోని (20వ) డివిజన్ న్యూ మారేడుపాకకు చెందిన సింగరేణి పురిటి బిడ్డ పూర్వ కార్మికురాలు, కొమ్ము పోచమ్మ ఏదాడి పోచమ్మ ( 93) సంవత్సరాలు ఇక లేరు. ఆమె గురువారం తుది శ్వాస విడిచారు. గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే మనుమడు రాజు, మనోజ్ ,కుటుంబ సభ్యులు కరీంనగర్ లోనీ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మాట్లాడుతూనే అకస్మాత్తుగా గుండె ఆగిపోయిందనీ పోచమ్మ కుమారుడు కొమ్ము గట్టయ్య తెలిపారు. పోచమ్మకు కోడలు నాగమణి ఒక కూతురి స్థానంలో చేసిన సేవలను పలువురు బంధువులు, గ్రామస్తులు కొనియాడారు.గత కొద్దిరోజుల నుండి ఆరోగ్యం సహకరించక అనారోగ్యానికి గురైందని తెలిపారు.1967 నుండి 1992 వరకు సింగరేణి సంస్థలో గుట్కా కార్మికురాలిగా విధులు నిర్వహించి, కార్మికుల హక్కులపై పోరాటం చేసి తనదైన శైలిలో సీనియర్ కార్మికురాలిగా పోరాటం చేసే సమయంలో అప్పటి ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.ఆనాటి కాలంలో సింగరేణిలో సంస్థలో ఎంతోమంది కి ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాలలో ఆనందాన్ని నింపారు. పోచమ్మ మరణ వార్త విన్న విశ్రాంత కార్మికులు, బంధువులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మనుమలు, మనమరాలు, డబ్బు చప్పుల తో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు.

# పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న





- తెలంగాణ గౌరవానికి చిరస్థాయి ప్రతీక
- మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట
- తండ్రియాలలో మూడు వివో భవనాలకు శంకుస్థాపన

**కథలాపూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** తెలంగాణ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను 'పోరాట యోధుడు'గా, సామాన్య ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా అభివర్ణించారు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. శుక్రవారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం తండ్రియాల గ్రామంలో 30 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మూడు వివో (ఎూా) భవనాలకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ గౌరవానికి, సామాన్య ప్రజల హక్కుల కోసం చేసిన పోరాటానికి చిరస్థాయి ప్రతీక అన్నారు. మొఘల్ పాలనలో సామాన్యులపై జరిగిన అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి స్వరాజ్య స్థాపనకు చేసిన ప్రయత్నాలు చరిత్రలో అంటిపెట్టుకున్నాయని పేర్కొన్నారు. ఆయన ధైర్యసాహసాలు, నాయకత్వ గుణాలు యువతకు ఆదర్శప్రాయమని, తరతరాలకు స్ఫూర్తినిచ్చే త్యాగాలను గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, దళితులు, బహుజనులు, పేదల హక్కుల పరిరక్షణ కోసం పాపన్న చేసిన కృషి విశేషమని, సమాజంలో సమానత్వం, స్వాభిమాన భావన పెంపొందించడంలో ఆయన పాత్ర అసాధారణమని తెలిపారు. గోల్కొండ కోటపై జెండా ఎగురవేసి, రాచరిక పోకడలు, అణచివేతకు గురైన వారికి అండగా నిలిచారని గుర్తుచేశారు. నేటి యువత ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. వేములవాడ పట్టణంలో నడిబొడ్డున విగ్రహ ఏర్పాటుకు అధికారంలో లేనప్పటికీ తాను కృషి చేశానని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ సమాజ సంక్షేమానికి పాటుపడుతోందని, కాటమయ్య రక్షణ కవచం పేరిట సేఫ్టీ కిట్ల పంపిణీ చేస్తోందని తెలిపారు. కథలాపూర్ మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలకు కలికోట సూరమ్మ చెరువు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కుడి-ఎడమ కాలువల నిర్మాణానికి భూసేకరణ పూర్తయిందని వివరించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయల సిలిండర్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ రహిత రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, మార్కెటింగ్ సదుపాయాలతో ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. స్వయం ఉపాధి వ్యాపారాల ప్రారంభానికి ఆర్థిక సహాయం అందిస్తూ మహిళా శక్తిని బలపరుస్తున్నట్లు వివరించారు.



## లేగ దూడపై దాడి చేసిన చిరుత

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులులు సంచారిస్తున్నాయి. వేములవాడ మున్సిపల్ పరిధిలోని హనుమక్క పల్లిలో గురువారం రాత్రి రోమాల భూమయ్యకు చెందిన లేగదూడపై దాడి చేయాగ అది మరణించినది.శుక్రవారం చిరుతపులి అడుగులను ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా వెళ్లవద్దని హెచ్చరించారు.తమ పొలాల వద్ద పశువులను కట్టి వేయవద్దన్నారు. జిల్లాలో ఐదు చిరుత పులులు సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.






# నారాయణ.. నారాయణ..!

- ఇది విద్యా సంస్థా?... ఫీజుల కర్మాగారమా?
- క్రమశిక్షణ శవమైపోయిందా..

**ఖమ్మం (జనంసాక్షి):** విద్య అంటే దీపం వెలిగించడమని పెద్దలు అన్నారు. కానీ నేడు కార్పొరేట్ కళాశాలలు ఆ దీపానికి నూనె పోసే బదులు అగ్గి రాజేస్తున్నాయి.ఖమ్మం జిల్లాలోని ఓ కార్పొరేట్ జూనియర్‌కళాశాలలో జరిగిన సంఘటన, విద్యా వ్యవస్థ కుళ్లిపోయిందనడానికి సాక్ష్యంగా నిలుస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రవేశాల సమయంలో తల్లిదండ్రులకు చెప్పిన మాటలు ఒకటి...

**కళాశాలలో జరుగుతున్న అఘాయిత్యాలు మరొకటి.**

"క్రమశిక్షణతో కూడిన విద్య", "విలువలతో కూడిన భవిష్యత్తు"అంటూ నోటితో మంత్రాలు జపించిన యాజమాన్యం, చేతలలో మాత్రం పూర్తి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యాన్ని చూపిస్తోంది. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కళాశాల, కనీసం విద్యార్థులను నియంత్రించలేకపోతోందంటే అది వైఫల్యం కాదు... నేరం. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులు పరస్పరం దాడులకు దిగడం, ముష్టి ఘాతాలు కురిపించుకోవడం అంటే అక్కడ చదువు, సంస్కారం, భద్రత ఏమీలేవన్న మాట. ఇది ఒక్క రోజు జరిగిన ఘటన కాదు. నెలల తరబడి సాగుతున్న నిర్లక్ష్యానికి పర్యవసానం. క్రమశిక్షణ లేకపోతే చదువు శూన్యం. చదువు లేకపోతే భవిష్యత్తు అంధకారం. అంధకారంలో పెరిగిన యువత సమాజానికి ఏమిస్తారు?. అదే ఈరోజు పెరుగుతున్న నేరాలకు మూలం. కార్పొరేట్ కళాశాల అన్న పేరుతో తలుపు లు మూసేసి, బయట ప్రపంచాన్ని దూరం పెట్టి, అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ తెలియకుండా దాచిపెట్టే ఈ సంస్కృతి విద్యా ఉగ్రవాదం కిందికే వస్తుంది. ఈ కళాశాల తీరుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి కళాశాలలు మూసేయాలి.. గుర్తింపు రద్దు చేయాలి..అని డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ జిల్లాలోని విద్యార్థుల బంగారు భవిష్యత్తు నిర్మాణానికి చాలా అవసరం. ఈ సంఘటనపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని జనంసాక్షి వివరణ కోరగా సంఘటన వాస్తవమేనని అంగీకరించారు. తాను కళాశాలకు వెళ్లి విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# యువతకు సైన్యంలో చేరే బంగారు అవకాశం!

- 90 రోజుల ఉచిత అగ్నివీర్ శిక్షణ.. ఫిబ్రవరి 23లోగా దరఖాస్తు చేసుకోండి



**పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలోని యువతకు భారత సైన్యంలో అగ్నివీర్‌గా చేరే స్వప్నాన్ని సాకారం చేసే అరుదైన అవకాశం లభించింది. అగ్నివీర్ యూపీహెచ్ఎస్ పరీక్షలకు సిద్ధం కావడానికి 90 రోజుల పాటు పూర్తి స్థాయి శారీరక, లిఖిత పరీక్షల శిక్షణ ఉచితంగా అందుబాటులో ఉంది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా అభ్యర్థులకు ఫిజికల్ ట్రైనింగ్, మెడికల్ పరీక్షల అవగాహన, రాత పరీక్షల కోచింగ్, గ్రౌండ్ ప్రాక్టీస్, యూనిఫాం, స్టడీ మెటీరియల్ వంటి సౌకర్యాలు పూర్తిగా కల్పిస్తారు. శిక్షణ సమయంలో భోజనం కూడా ఉచితంగా అందిస్తారు. శిక్షణ ఫిబ్రవరి 1 నుంచి మే 31 వరకు నిర్వహిస్తారు. ఆసక్తి గల యువత ఫిబ్రవరి 23 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫిబ్రవరి 25న దరఖాస్తు చేసుకున్నవారికి మెడికల్ పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. రిజిస్ట్రేషన్ కోసం రుద్రమదేవి స్టేడియం, సెంటెనరీ కాలనీ, రామగిరి వద్ద ఉదయం 6 నుంచి 8 గంటల వరకు హాజరు కావాలి. వెంట ఆధార్ కార్డు, 10వ తరగతి మెమో, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరి.

పెద్దపల్లి జిల్లాకు చెందిన పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు 17.5 నుంచి 22 సంవత్సరాల మధ్య ఉండాలి. మరిన్ని వివరాలకు 9573688952, 9949725997, 8106807784 నెంబర్లను సంప్రదించవచ్చు.

మరోవైపు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లోని దోమలగూడలో జరిగిన ఈ పోటీలలో పెద్దపల్లి జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొని విజయాలు సాధించారు. జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్ జాగ్ వాకింగ్‌లో మొదటి బహుమతి, కమాన్ పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎడునూరి పౌర్ణమి చెస్‌లో మొదటి బహుమతి, రొంపికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో మొదటి బహుమతి, మ్యూజికల్ చైర్‌లో రెండో బహుమతి, జిగ్‌జాగ్ వాకింగ్‌లో రెండో బహుమతి సాధించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద, ఐఈ కోఆర్డినేటర్ జి. కవిత తదితరులు పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మంథని సబ్ రిజిస్ట్రార్

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్‌లు ఇద్దరు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు శుక్రవారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డారు. మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వారు లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి వద్ద నుంచి రూ. 16,500 లంచం తీసుకుంటుండగా ఇంచార్జ్ కరీంనగర్ ఏసీబీ డీఎస్పి మధు ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి మంథని సబ్ రిజిస్టర్ కాసర్ల రాజేందర్, డాక్యుమెంట్ రైటర్ రషీద్‌లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 నెంబర్ కు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ మధు ఈ సందర్భంగా తెలిపారు.

# బచ్చలికుంట పునరుద్ధరణకు
# కదిలిన యంత్రాంగం

## కుంటలను మింగేస్తున్న తిమింగలాలపై జనంసాక్షి' సంచలన కథనం

- రంగంలోకి దిగిన రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు
- ఆక్రమణల తొలగింపు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎదిర గ్రామస్థులు
- పునరుద్ధరణ సరే.. ఆక్రమణదారులపై చర్యలేవి? అని ప్రశ్నిస్తున్న జనం




**కొందుర్గు/జిల్లేడ్ చౌదరిగూడ ఫిబ్రవరి 20 జనంసాక్షి:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అక్షరాయుధాన్ని ఎక్కుపెట్టిన 'జనంసాక్షి' కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. "కుంటలను మింగేస్తున్న తిమింగలాలు" అంటూ ఎదిర గ్రామంలోని బచ్చలి కుంట ఆక్రమణపై ప్రచురితమైన కథనం జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రెవెన్యూ మరియు నీటి పారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

### అసలేం జరిగిందంటే..

రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామ శివారులోని సర్వే నంబర్ 802లో 2 ఎకరాల 07 గుంటల విస్తీర్ణంలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 'బచ్చలి కుంట' ఉంది. అయితే, సత్య ప్రమోద్ రావు అనే వ్యక్తి తన పట్టా భూమి పేరుతో ఈ కుంటను పూర్తిగా ధ్వంసం చేసి, భూమిని చదును చేశాడు. సాక్ష్యాధారాలతో సహా 'జనంసాక్షి' ఈ అక్రమాలను వెలుగులోకి తెచ్చింది. కథనంపై స్పందించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ సలీం పాషా, నీటి పారుదల శాఖ డీఈ క్రాంతి, జెఈ మనోహర్ మరియు జిపిఓ నర్సింలు తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. కుంట భూమి ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో కుంట పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించారు. జేసీబీలతో పూడ్చేసిన కుంటను తవ్వి కుంట పూర్వ వైభవం సంతరించుకునేలా చర్యలు చేపట్టారు.

### ప్రజల డిమాండ్ - చర్యలు ఎక్కడ?

కుంట పునరుద్ధరణ పనులు ప్రారంభం కావడంపై ఎదిర గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న కుంటను నిర్భయంగా ధ్వంసం చేసిన వ్యక్తిపై ఇప్పటి వరకు ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "పునరుద్ధరణ సరే.. మరి ఆక్రమణదారుడిపై చర్యలు ఏవి?" అని గ్రామస్థులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



# మెడికవర్ వైద్యుల అద్భుత చికిత్స

- రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- 8 గంటల శస్త్రచికిత్సతో కొత్త జీవితం
- తుంటి ఎముక విరిగి, వెన్నెముక, ఊపిరితిత్తులకు గాయాలు



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 20 జనంసాక్షి:** రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితికి చేరిన 41 ఏళ్ల రవి గోయెంకా అనే వ్యక్తికి మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అత్యవసర చికిత్సలతో కొత్త జీవితాన్ని అందించారు. కోమా స్థితిలో ఐసీయూలో చేరిన ఆయన ప్రస్తుతం స్వయంగా నడుచుకుంటూ డిశ్చార్జ్ అవ్వడం వైద్య బృందానికి ఆనందాన్ని కలిగించింది. ప్రమాదంలో వాహనం కిందపడటంతో కుడి తుంటి ఎముక తీవ్రంగా విరిగిపోయింది. వెన్నెముక, పక్కటెముకలు, ఊపిరితిత్తులకు గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం కారణంగా పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వెంటనే స్పందించిన ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని తమ బృందంతో 8 గంటలపాటు శ్రమించి రోగికి కొత్త జీవితాన్ని ఇచ్చారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని మాట్లాడుతూ.. రోగి ఆసుపత్రికి చేరేసరికి పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందన్నారు. తుంటి ఎముక పూర్తిగా చీలిపోవడంతో శస్త్రచికిత్స చాలా సవాలుగా మారిందని, తమ బృందం సుమారు 8 గంటలు శ్రమించి ఎముకను పునర్నిర్మించినట్లు తెలిపారు. ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆయన తిరిగి నడవగలిగేలా చేయడమే తమ ముఖ్య లక్ష్యమన్నారు.
శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న సమయంలో ఆకస్మికంగా శ్వాసలో ఇబ్బంది తలెత్తడంతో కార్డియాలజీ విభాగం వెంటనే జోక్యం చేసుకుంది. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి మాట్లాడుతూ.. పరీక్షల్లో ఊపిరితిత్తుల్లో ప్రమాదకరమైన రక్తపు గడ్డలు (పల్మనరీ ఎంబోలిజం) ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇది కొన్ని నిమిషాల్లోనే ప్రాణాంతకమయ్యే పరిస్థితి కావడంతో ఆలస్యం చేయకుండా మెకానికల్ క్లాట్ రిమూవల్ విధానం ద్వారా గడ్డలను తొలగించామని తెలిపారు. సమయానికి స్పందించకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేదన్నారు. అనస్థీషియా, క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ విభాగాల సమన్వయంతో అందించిన చికిత్స ఫలితంగా రవి గోయెంకా ప్రస్తుతం మెట్లు ఎక్కగలుగుతూ సాధారణ జీవితానికి చేరుకున్నారు.
ఈ సందర్భంగా రోగి రవి గోయెంకా మాట్లాడుతూ.. ప్రమాదం తర్వాత తాను తిరిగి నడవగలనని అనుకోలేదని, మెడికవర్ వైద్యులు సమయానికి స్పందించి ప్రాణాలను కాపాడటమే కాకుండా సాధారణ జీవితానికి తిరిగి తీసుకువచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అనస్థీషియా డా. శ్రీనివాస్, క్రిటికల్ కేర్ డా. ప్రదీప్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డా. రవీష్, సెంటర్ హెడ్ కృష్ణవేణి పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


వేములవాడ(జనంసాక్షి): పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో 14, 19 వార్డుల్లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికర రాకేష్ కౌన్సిలర్లు తూము మధు, అన్నారం శ్రీనివాస్, కుమ్మరి శిరీష శ్రీనివాస్, తోట రాజు, కొండా శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# 9వ రోజుకు న్యాయవాదుల దీక్ష

- గన్‌మన్ దాడి, సీఐ దురుసుపై నిరసన
- కోర్టుకు హాజరైన ఏసీపీ, సీఐ, గన్‌మన్
- కేసు మార్చి 2కు వాయిదా
- పోరాటం మరింత ఉధృతమయ్యే అవకాశం

గోదావరిఖని, ఫిబ్రవరి 20 (ఈనాడు): ఈ నెల 10న గోదావరిఖనికి చెందిన న్యాయవాది మార్కాపురి తిలక్‌పై దాడి చేసిన గన్‌మన్, న్యాయవాదులను దూషించిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిలపై చర్యలు తీసుకోవాలంటూ ఖని బార్ అసోసియేషన్ పిలుపుమేరకు న్యాయవాదులు చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ నిరసనతో గోదావరిఖనిలోని మూడు మున్సిఫ్ కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి, అదనపు జిల్లా న్యాయస్థానాల్లో కోర్టు కార్యకలాపాలు నిలిచిపోయాయి. గన్‌మన్ ప్రవీణ్, సీఐ ఇంద్రసేనారెడ్డిలపై గోదావరిఖని మున్సిఫ్ కోర్టులో బాధిత న్యాయవాది తిలక్ దాఖలు చేసిన ప్రైవేట్ కంప్లెయింట్ కేసులో సీఐ ఇంద్రసేనారెడ్డి, గన్‌మన్ ప్రవీణ్‌తో పాటు రిపోర్ట్ కోసం ఖని ఏసీపీ మడత రమేష్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వా ఎదుట హాజరయ్యారు. అయితే తమకు కేసు విషయంలో వివరణకు మూడు వారాల సమయం కావాలని పోలీసులు కోరగా న్యాయమూర్తి కేసును మార్చి 2కు వాయిదా వేశారు. న్యాయవాదుల పోరాటం మరింత ఉధృతమవుతోంది. న్యాయం కోసం తగ్గేదేలేదంటూ రోడ్డెక్కి నిరసన తెలపటంతో పోరాటం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఓ వైపు సీఐ చర్యలను నిరసిస్తూ నేరుగా సీపీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో రానున్న రోజుల్లో పోరాటం మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. న్యాయవాదుల నిరసనతో ఏసీపీ మడత రమేష్ జోక్యం చేసుకుని న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించి దాడి వివరాలతో పాటు జరుగుతున్న పరిణామాలపై వివరాలు సేకరించారు. న్యాయవాదులు సర్వసభ్య సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది.




# ప్రధానమంత్రి ముద్ర యోజన అవగాహన సదస్సు

**పెద్దపల్లి,ఫిబ్రవరి 20(జనంసాక్షి) :** రాష్ట్ర స్థాయి ప్రాజెక్ట్ (ఆర్ఏఎంపి)లో భాగంగా, ప్రధాన్ మంత్రి ముద్రా యోజన (పిఎంఎంవై) పై శుక్రవారం ఒకరోజు అవగాహన కార్యక్రమం పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల కేంద్రం (డిఐసి,) పెదపల్లి ఆధ్వర్యంలోని ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ (ఇడిసి) నిర్వహించింది. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రస్తుత (ఎంఎస్ఎంఇ)యూనిట్లు, వ్యాపారాన్ని ప్రారంభించదలచిన ఔత్సాహికులు మరియు యువత పాల్గొని, ముద్రా రుణాల వర్గాలు, అర్హత ప్రమాణాలు మరియు బ్యాంకు రుణాల పొందుపరచే విధానంపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల కేంద్రం, పెదపల్లి జనరల్ మేనేజర్ కీర్తి కాంత్ మరియు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ (ఎఫ్ఎల్‌సి) ప్రతినిధి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై, స్వయం ఉపాధి ప్రోత్సాహం మరియు ఆర్థిక అవగాహన ప్రాధాన్యతపై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంతోష్, విజయ్ శిక్షకులుగా వ్యవహరించి, ముద్రా యోజనకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని (ఇడిసి) మేనేజర్ హరీష్, అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ సహకారంతో నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా జిల్లా యువత మరియు చిన్న వ్యాపారులలో స్వయం ఉపాధిపై ఆసక్తిని పెంచడం మరియు సంస్థాగత రుణాల పొందుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

# గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రకృతి-సైన్స్‌పై అవగాహన సదస్సు

**పెద్దపల్లి,ఫిబ్రవరి 20(జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం ప్రకృతిని, వైజ్ఞానిక దృక్పథాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశాల పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకృతి ప్రజాకవి జయరాజు, మరియు విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ ,గాయత్రి కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, అమ్మ నేత్ర అవయవదాన ప్రోత్సాహక సంఘం నేత ఈశ్వర లింగం పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి జయరాజ్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడాలని ఈ భూమండలం మీద సకల జీవరాశి మనుగడ సాధించాలంటే గాలి నీరు అందరికీ అవసరమని అవి నేడు కలుషితమవుతున్నాయని మానవులు విచ్చలవిడిగా యంత్రాల వాడకం వల్ల,అనేక రకాల ఫ్యాక్టరీల వల్ల మరియు పంటలలో ఎరువులు మరియు రసాయనాలు వాడకం వల్ల, ప్లాస్టిక్ వినియోగం వల్ల, మానవుడు సృష్టించే వ్యర్థాల వల్ల గాలి నీరు ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని విద్యార్థులకు తెలియజేశారు. విజ్ఞాన దర్శిని ఫౌండర్ రమేష్ మాట్లాడుతూ సైన్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మూఢనమ్మకాలను నమ్మవద్దని నేటి ప్రపంచంలో ప్రతి విద్యార్థి సైన్స్‌తో సహవాసం చేయాలని సూచించారు. అదేవిధంగా అమ్మ నేత్ర అవయవ దాన ప్రోత్సహక సంఘం నేత ఈశ్వర లింగం మాట్లాడుతూ నేత్రదానంతో కార్నియల్ అందులో జీవితాల్లో వెలుగులు నింపొచ్చని ,అవయవ దానంతో కొందరు అభాగ్యుల జీవితాలను కాపాడచ్చని, దేహదానంతో వైద్య విద్యార్థులకు పాఠాలను నేర్పరచని చర్మదానంతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలుద్దామని, కేశ దానంతో మహిళ క్యాన్సర్ రోగులకు భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాత్ర కోఆర్డినేటర్ టిపిటిఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఏ విజయ్ కుమార్,విజ్ఞాన్ దర్శిని రాష్ట్ర అధ్యక్షులు ఆదం రాజు, విజ్ఞాన దర్శిని నాయకురాలు శోభారాణి ,విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అలీ,యువజన సంఘం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి సురేష్,గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ జే రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు.. అర్హులందరికీ సొంత ఇల్లు

- రోగులకు వైద్య సేవలపై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆరా
- తాండూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పరిశీలన
- మాతా శిశు ఆసుపత్రి సందర్శన



**తాండూరు, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూర్ పట్టణ శివారులో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని గ్రామాల్లో గృహప్రవేశాలు కూడా జరిగాయన్నారు. మౌలిక సదుపాయాలు పూర్తయిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అర్హుల జాబితా సిద్ధం చేస్తామని చెప్పారు. నిరుపేదలై ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి ఖాళీ స్థలం లేని అర్హులకు నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామని వివరించారు. అదే సమయంలో మాతా శిశు హాస్పిత్రిని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, డీసీహెచ్ ఎస్. ఆనంద్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్ కుమార్, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- వేములవాడ వేదికగా బీఆర్ఎస్ సవాల్
- నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు
- మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్



**వేములవాడ (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గంలో రాజకీయ వేడి రాజుకుంది. స్థానిక బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో బీఆర్ఎస్ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వేములవాడలో అసలు ఏం అభివృద్ధి జరిగిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఇంచార్జి లక్ష్మీనరసింహారావుపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని, కాంగ్రెస్ నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పార్టీ బీఫాంపై గెలిచిన కౌన్సిలర్లను అక్రమంగా పార్టీలో ఎలా చేర్చుకుంటారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. చేతనైతే అభివృద్ధి అంశంపై బహిరంగ డిబేట్ పెట్టాలని, తాము సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దళిత సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని, కేవలం ఒకే వర్గానికి పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఆది శ్రీనివాస్ రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ, ఆయన ఎన్ని పార్టీలు మారారో, ఎన్ని కండువాలు కప్పుకున్నారో ప్రజలందరికీ తెలుసని కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరిగాయని, ఆది శ్రీనివాస్ మోసం చేశారని సొంత పార్టీ నాయకులే ఏడుస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఎద్దేవా చేశారు.?ముఖ్యంగా నిన్న ప్రెస్ మీట్‌లో మాట్లాడిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారేనని, ఆ విషయాన్ని వారు మరవద్దని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, సిరిగిరి చందు, గోలి మహేష్, కందుల క్రాంతికుమార్, జోగిని శంకర్, గుడిసె సదానందం, వెంకట్ రెడ్డి, రేగుల రాజేశం, నిమ్మశెట్టి రాజు, సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, కమలాకర్ రెడ్డి, రాధకిషన్ రావు, రాంబాబు, గోస్కుల నర్సయ్య, మామిండ్ల కనకయ్య, చందనం శ్రీనివాస్, ప్రేమ్ చారీ, ఉమర్, మిర్యాల సంతోష్, పోతు అనిల్, రఫీ, అల్లాడి శ్రీనివాస్, బోల్లం దేవరాజు, ఆసద్, రాజు, శివరాజ్ లతో పాటు భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రతిమ ఫౌండేషన్ కృషి

- నాప్కిన్ డిస్పోజల్ మెషిన్ దానం
- నెలసరి సమయంలో జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం
- ధైర్యంగా మాట్లాడాలని డాక్టర్ హరిణి సూచన

**కరీంనగర్, ఫిబ్రవరి 20 జనంసాక్షి:** తిమ్మాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాప్కిన్ డిస్పోజల్ మెషిన్ దానం చేశారు. ఈ సందర్భంగా నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిమ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయినపల్లి హరిణి విద్యార్థినుల సౌకర్యార్థం ఉచిత శానిటరీ ప్యాడ్ డిస్పోజల్ మెషిన్‌ను డొనేట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల ఆరోగ్యం, పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.
నెలసరి సహజ ప్రక్రియ అని, దీనిపై భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. డాక్టర్ గీతారెడ్డి నెలసరి సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యతపై విద్యార్థినులకు వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, ప్రతిమ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు. బాలికల ఆరోగ్యం, విద్యా పురోగతికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# ఇచ్చిన హామీలను బండి సంజయ్ నెరవేర్చాలి

- విద్యార్థుల పరీక్షలకు ఆటంకం కలుగకుండా ఎన్నికలు నిర్వహించాలి
- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి డిమాండ్



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి ):** కరీంనగర్ నగరంలోని డంపింగ్ యార్డ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి శుక్రవారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యాలంలో రాష్ట్ర కార్యదర్శి తేజ్ దీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని, అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్లు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన బండి సంజయ్ కుమార్ వెంటనే ఆ నిధులను మంజూరు చేయాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన మేయర్, డిప్యూటీ మేయర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని డంపింగ్ యార్డ్‌ను నగర పరిధి బయటకు తరలించే చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. ఆర్ ఓబీ నిర్మాణం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేయాలనీ బండి సంజయ్‌ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ముఖ్య పాత్ర పోషించిందని, గణనీయమైన ఓట్లు సాధించిందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ 15 మంది అభ్యర్థులను గెలిపించిందని వెల్లడించారు. ప్రజాభిప్రాయాన్ని పక్కనపెట్టి అభ్యర్థులను పార్టీలు గురించేస్తున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పరిషత్ ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ నాయకులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో గెలుపు గుర్రాలకు టిక్కెట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 15 అభ్యర్థులను గెలిపించారని, అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థుల సంక్షేమంపై
# సర్కారు ప్రత్యేక దృష్టి

- గురుకులాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు, చర్యలు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. గురుకుల విద్యార్థులకు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని వేగంగా పరిష్కరించడంతో పాటు మెరుగైన పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడానికి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్‌ను ముందుగానే తయారు చేయాలని స్పష్టం చేసింది. జిల్లా షెడ్యూల్‌కు అనుగుణంగా, సంబంధిత అన్ని విభాగాలకు వాటిని అందజేయాలని స్పష్టం చేసింది. నోడల్ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని, విద్యా సంస్థల సరైన పనితీరును నిర్ధారించడానికి ఆకస్మిక సందర్శనలను కూడా నిర్వహిస్తారని వెల్లడించింది. అధికారులు గురుకుల పాఠశాలలను సందర్శించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవడానికి తనిఖీ నివేదికలను తయారు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఏ చర్యలు తీసుకున్నారో వెంటనే తెలియజేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను ప్రతి నెల అయిదో తేదీలోపు సంబంధిత విభాగాధిపతులు, కార్యదర్శులకు తప్పకుండా సమర్పించాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది.

## జీవన్ రెడ్డి మర్యాదకు భంగం కలిగించకండి

- కాంగ్రెస్ అధిష్టానానికి జగ్గారెడ్డి వినతి




హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ కష్ట కాలంలో పార్టీతో ఉన్న జీవన్ రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా పార్టీ హైకమాండ్ చొరవ తీసుకోవాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. జగ్గారెడ్డి తాజాగా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నా. జీవన్ రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయారు. కాంగ్రెస్ పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పార్టీలోనే ఉన్నాడు. రాజకీయంగా జీవన్ రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. కష్ట కాలంలో పార్టీలో ఉన్న జీవన్ రెడ్డికి అవమానం జరగకుండా కాంగ్రెస్ పెద్దలు చొరవ చూపాలి. జీవన్ రెడ్డికి గౌరవం వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరుతున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో, జీవన్‌రెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఫుడ్ పాయిజన్ అయిందని జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్టు సమాచారం.

## పోలీస్ భద్రతా విభాగం కార్యదర్శి గోపాల్ రెడ్డి మృతి

- డీజీపీ బి.శివధర్‌రెడ్డి సంతాపం



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : రాష్ట్ర పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, ప్రస్తుత భద్రత, ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శి ఆల గోపాల్ రెడ్డి (80) శుక్రవారం మరణించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. పోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేరిన ఏ.గోపాల్ రెడ్డి, అంకితభావంతో పనిచేసి ఐపిఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం గత 20 ఏళ్లుగా భద్రత మరియు ఆరోగ్య భద్రత విభాగాల కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు. గోపాల్ రెడ్డి ఆరోగ్య భద్రత పథకం ద్వారా సిబ్బందికి మెరుగైన వైద్యం అందేలా చూడటంతో పాటు భద్రత స్కీం క్రింద గృహ రుణాలు, పిల్లల విదేశీ విద్య వంటి అంశాల పర్యవేక్షణలో ముఖ్య భూమిక పోషించారు. 80 ఏళ్ల వయసులోనూ, అనారోగ్యం బారిన పడే వరకు ఆయన తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడం విశేషం. శ్రీ గోపాల్ రెడ్డి మృతి పట్ల రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్న డిజిపి వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

## రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

- బాగ్ లింగంపల్లి గోదాములో ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : పేదలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్–ఆఫిషియో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్?అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించమని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జ్‌లు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో మంటలు

- తక్షణమే స్పందించిన హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు
- మంటలనార్పడంతోపాటు సహాయక చర్యలు
- 50 మందిని సురక్షితంగా బయటకు తెచ్చిన డీఆర్‌ఎఫ్
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన హైడ్రా కమిషనర్






హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : పెను ప్రమాదాన్ని హైడ్రా తప్పించింది. ఫైర్ ఎక్స్టింగ్విషర్ ద్వారా మంటలను క్షణాల్లో నియంత్రించి అందులో చిక్కుకున్న50 మందికి పైగా ఉన్నవారిని హైడ్రా శుక్రవారం కాపాడింది. అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లోని నీలగిరి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ కేబుళ్లున్న ప్యానల్ బోర్డులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సరిగ్గా ఉదయం 11.01 గంటలకు అందింది. క్షణాల్లో ఫీల్డ్‌మీద ఉన్నహైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలకు హైడ్రా కంట్రోల్ రూం సిబ్బంది చేర్చారు. ఆ చేరువలో ఉన్న హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది సరిగ్గా 11.04 నిమిషాలకు అక్కడకుచేరుకుని ఫైర్ ఎక్స్టింగ్విషర్ల ద్వారా మంటలను నియంత్రించారు. ఒక పక్క మంటలను అదుపులోకి తెస్తూనే హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో మరో రెండు బృందాలు అక్కడకు చేరుకున్నాయి. వీరితో పాటు.. ఫైర్, పోలీసు విభాగాలు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. మెట్ల మార్గం వద్దే కరెంటు కేబుళ్లు తగలపడడం.. పొగలు కమ్మేయడంతో రెండో అంతస్తులో చిక్కుకున్న వారిని హైడ్రా డీఆర్ ఎఫ్ వద్ద సిద్ధంగా ఉన్న రోప్ ల్యాడార్ల ద్వారా కిందకు దించారు. ఇలా మంటలనార్పడం.. వెంటనే సహాయక చర్యలు ప్రారంభమవ్వడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగలేదు.

### ఊపిరి పీల్చుకున్న అధికారులు

అమీర్‌పేట అంటేనే ఐటీ రంగంతో పాటు.. పలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇచ్చే అడ్డా. ఇక్కడ ఉన్న మైత్రేయివనం, ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో వందలాది శిక్షణ కేంద్రాలున్నాయి. ప్రతి అంతస్తులో పదుల సంఖ్యలో కోచింగ్ సెంటర్లున్నాయి. ఇక్కడ మంటలంటుకుంటే ఆ ప్రమాదాన్ని ఊహించలేం. వేలాది మంది ఇక్కడ శిక్షణ పొందుతుంటారు. అమీర్‌పేటలో అగ్ని ప్రమాదం అని తెలియడంతోనే నగరమంతా అప్రమత్తమైంది. హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది క్షణాల్లో స్పందించిన తీరుతో పాటు.. మంటలను ఆపడం, పై అంతుస్తుల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రోప్ ల్యాడర్ల సాయంతో కిందకు దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. అక్కడ అగ్ని ప్రమాదానికి కారణాలను క్షేత్ర స్థాయిలో చూశారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్యగారు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హైడ్రా ఏడీఎఫ్‌వో మోహన రావు.. ఘటనకు గల కారణాలను, సహాయక చర్యలను అధికారులకు వివరించారు.

### పెను ప్రమాదం తప్పింది...

అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఘటనా స్థలిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలను ఆరా తీశారు. క్షణాల్లో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. ఫైర్, పోలీసు విభాగాలు సమన్వయంతో పని చేసి ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా కాపాడారన్నారు. వరుసగా జరుగుతున్న ఘటనలు అందరికీ కనువిప్పు కావాలన్నారు. ఫైర్, జీహెచ్ ఎంసీ, విద్యుత్, పోలీసు విభాగాలతో నెల క్రితం హైడ్రా తనిఖీలు చేసి కొన్ని షాపులను సీజ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోడానికి గడువు కావాలంటే నెల రోజులు సమయం ఇచ్చామన్నారు. వరుస ఘటనల నేపథ్యంలో ఫైర్ చట్టాలలో చేర్పులు, మార్పులను చేయాల్సి ఉంది. ఈమేరకు సంబంధిత శాఖలతో కలిసి ప్రభుత్వానికి నివేదిస్తాం. నెల తర్వాత మళ్లీ సంబంధిత శాఖలన్నిటితో కలిసి తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. ఇదే సమయంలో ప్రజలు కూడా ఎవరికి వారు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా అప్రమత్తమవ్వాలని హైడ్రా కమిషనర్ కోరారు. ఒక వేళ అగ్ని ప్రమాదం జరిగితే సురక్షితంగా బయట పడేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు.

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై రకరకాల వ్యాఖ్యానాలు


- కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు.. అభినందించిన శశిథరూర్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై రకరకాల వ్యాఖ్యానాలు వచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్‌లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ చాలా బాగా జరిగిందంటూ కొనియాడారు. పెద్ద కార్యక్రమాల్లో కొన్ని అవాంతరాలు జరుగుతుంటాయని.. అయినా కూడా కేంద్రం చాలా బాగా నిర్వహించిందని మెచ్చుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఏఐ సమ్మిట్‌ను విమర్శించారు. 'అస్తవ్యస్తమైన ప్రజా సంబంధాల ప్రదర్శన' అని అభివర్ణించారు. చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్రంగా తప్పుపట్టారు. ఫిబ్రవరి 17న జరిగిన శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ రోజున పొడవైన క్యూలు, భారీ జనసమూహం, లాజిస్టికల్ సమస్యలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. భద్రతా సిబ్బంది నుంచి స్పష్టమైన సూచనలు లేకుండానే గేట్లు మూసేశారని సందర్శకులు తెలిపారు. పెద్ద ఎత్తున వార్తలు హల్‌చల్ చేశాయి. అలాగే గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం వివాదానికి దారితీసింది. 'ఓరియన్' అనే రోబోటిక్ కుక్కపై విమర్శలు రావడంతో ఆ విశ్వవిద్యాలయాన్ని ఎక్స్‌పో స్థలాన్ని ఖాళీ చేయమని కోరారు. ఇదిలా ఉంటే ఏఐ సమ్మిట్ నిర్వహణను రాహుల్ గాంధీ తప్పుపడితే.. శశిథరూర్ మాత్రం అభినందించారు. శిఖరాగ్ర సమావేశానికి వెళ్లే అవకాశం నాకు లభించకపోయినా శుక్రవారం నేను ఇక్కడ మాట్లాడుతున్నాను. నాకు అర్థమైనంత వరకు మొదటి రెండు రోజులు చాలా బాగా గడిచాయి. కొన్ని లోపాలు, కొన్ని సంస్థాగత విషయాలు ఉన్నాయి. ఇవి ఒక పెద్ద కార్యక్రమంలో జరుగుతాయని శశిథరూర్ తెలిపారు. ఇటీవలే శశిథరూర్‌తో కాంగ్రెస్ పెద్దలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై చర్చించారు. కేరళ ఎన్నికల వేళ ఇదో శుభపరిణామంగా భావించారు. మళ్లీ ఇంతలో ఏమైందో ఏమో తెలియదు గానీ.. మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని శశిథరూర్ ప్రశంసించారు.

## బ్రిటన్‌లో ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌పై తీవ్ర దుమారం

- మాజీ యువరాజు ఆండ్రూ సమక్షంలోనే బాలికకు కరెంట్ షాక్



లండన్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ బ్రిటన్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఆ దేశ రాజ కుటుంబానికి చెందిన మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్–విండ్సర్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన గురించి మరిన్ని ఆరోపణలు బయటకు వచ్చాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం.. ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసున్న ఓ బాలికకు సెక్స్ రాకెట్ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఆ బాలికను టేబుల్‌పై బంధించి ఈ అరాచకానికి పాల్పడ్డారని ఓ గుర్తుతెలియని వ్యక్తి సమాచారమిచ్చారు. ఈ ఆరోపణలు ఎఫ్‌బీఐ పత్రాల్లో ఉన్నాయి. ఈ ఘటన బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజ్‌లో జరిగిందని ఆ కథనాలు వెల్లడించాయి. అయితే ఆండ్రూ మాత్రం తనపై వచ్చిన ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించారు. 1994 నుంచి 1996 మధ్యలో హ్యూమన్ ట్రాఫికింగ్, మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల గురించి అవగాహన ఉందని సర్రే పోలీసులు వెల్లడించారు. అయితే దానిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. ఈ రెండు ఘటనలకు సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ఆరోపణలకు సంబంధించి ఎవరివద్ద అయినా సమాచారం ఉంటే తమకు రిపోర్ట్ చేయాలని కోరారు. కాగా.. అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా.. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆండ్రూను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. కొన్ని గంటలు విచారించిన అనంతరం ఆయన విడుదలయ్యారు. అయితే ప్రస్తుతానికి ఆయనపై ఎలాంటి అభియోగాలు మోపలేదు.

## వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

- డీపీఆర్‌వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డి.పి.ఆర్.ఓ.లను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ విధి విధానాలపై డిపిఆర్‌ఓలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జి.ఓ. నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పిఆర్‌ఓలకు సూచించారు. జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రిలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అక్రిడిటేషన్ కార్డుల పక్రియలో భాగంగా ఆన్‌లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ పక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డిపిఆర్‌ఓలను కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.

## బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు

### 10కోట్లు డిమాండ్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్

ముంబై, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు వచ్చాయి. 10 కోట్లు ఇవ్వాలని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాలో రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్ నుంచి వాయిస్ నోట్ రూపంలో బెదిరింపు వచ్చిందని ఓ మీడియా కథనం పేర్కొన్నది. ఈ కేసులో ముంబై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. క్రైం బ్రాంచ్ నేతృత్వంలో దర్యాప్తు మొదలైంది. నెంబర్ ఎక్కడిదో కనుక్కొనేందుకు అమెరికా భద్రతా సిబ్బందితో పోలీసులు టచ్‌లో ఉన్నారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించే పనిలోపడ్డారు. సాంకేతిక ఆధారాల కోసం అధికారులు వెతుకుతున్నారు. కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆనవాళ్లను పరిశీలిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్‌కు భద్రతను పెంచనున్నారు. గతంలో కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడింది. ఆ గ్యాంగ్ అనేక మంది సెలబ్రిటీలను బెదిరించిన దాఖాలు ఉన్నాయి.

## 'ది బిల్ ఈస్ పాస్డ్'

### రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన రోజు

### ఎక్స్ వేదికగా హరీష్ రావు పోస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది నేటికి 12 ఏళ్ల అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. బిల్ ఈజ్ పాస్డ్ అన్న టైటిల్‌తో ఓ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన క్రమాన్ని తన పోస్టులో ఆయన వెల్లడించారు. 2014, ఫిబ్రవరి 20వ తేదీన తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కినట్లు చెప్పారు. శాంతియుతంగా సాగిన స్వరాష్ట్ర ఉద్యమానికి సంకేత సూచకంగా బిల్లు పాసైనట్లు హరీశ్ రావు తన పోస్టులో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైనట్లు చెప్పారు. కేసీఆర్‌తో కలిసి విక్టరీ సంకేతం చేస్తున్న ఫోటోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కొన్ని దశాబ్దాల త్యాగం, పోరాటం, ఆత్మగౌరవం.. చివరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు హరీశ్ తన ఎక్స్‌లో తెలిపారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అన్నారు.

## డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

సంగారెడ్డి, ఫిబ్రవరి20 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురిని ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అమీన్‌పూర్‌లోని ఓ మార్బుల్ షాపుపై దాడి చేశారు. నిందితుల వద్ద అక్రమంగా నిల్వవున్న 2.7 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి డ్రగ్స్ పెడలర్స్ తో పాటు డ్రగ్స్‌ను అమీన్ పూర్ పోలీసులకు అప్పగించారు. రాజస్థాన్‌కు చెందిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370